
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 277

గురువారం 28-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎల్గర్ అజేయ సెంచరీ

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 245కు ఆలౌట్.. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 256/5 - 14లో



మళ్లీ రికార్డుల మోత

72 వేల పాయింట్ల ఎగువన సెన్సెక్స్.. 21,650 స్థాయి పైకి నిఫ్టీ - 15లో



పొగ మంచు గుప్పిట్లో 'ఉత్తరం'

ఉత్తర భారతదేశం పొగ మంచు గుప్పిట్లో చిక్కుకుంటోంది. దీంతో ఢిల్లీలో 110 విమానాలు ఆలస్యంగా నడిచాయి.

వివరాలు 6లో ▸



కారుతో తొక్కించి.. యువతి హత్య

జైపూర్‌లో రెండు జంటల గొడవ ఒక యువతి మృతికి దారి తీసింది. వేరొకరి స్నేహితురాలిని నిందితుడు కారుతో తొక్కించి చంపేశాడు.

వివరాలు 6లో ▸

ఎంఫిల్‌కు గుర్తింపు లేదు

ఎంఫిల్ కోర్సులకు ఎలాంటి గుర్తింపు లేదని, ఆ కోర్సుల్లో చేరొద్దని విద్యార్థులను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ హెచ్చరించింది.

వివరాలు 6లో ▸



రెజ్లర్లతో రాహుల్ కుస్తీ

హరియాణాలోని ఛర్రా గ్రామంలో బజరంగ్ పునియాతో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సరదాగా కుస్తీ పట్టారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంది సీఎం జగనే

రెండు విడతల్లో 10.37 లక్షల మందికి రూ.929.75 కోట్లు చెల్లింపు

న్యాయ ప్రక్రియ పూర్తిగానే మిగిలిన వారికీ చెల్లింపునకు సన్నాహాలు

నాడు అగ్రిగోల్డ్ యాజమాన్యానికి కొమ్ముకాసిన చంద్రబాబు

12లో

రైతు బాగు నచ్చని బాబు బ్యాచ్

అందుకే వ్యవసాయ యాంత్రీకరణపై రామోజీ కుటిల రాతలు

వాస్తవాలు విస్మరించి ద్రోన్లపై అవాస్తవాలతో కథనం

12లో

చక్కదిద్దారు

ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు

అవస్థలను తొలగించి ఆధునిక చదువుల బాట

- డిజిటల్ బోధనకు 62 వేల ఐఎఫ్‌పీ స్క్రీన్స్, 33 వేల స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లు
- ఆది నుంచే ఆంగ్లంలో పట్టుకోసం ఇంగ్లిష్ మీడియం.. టోఫెల్ శిక్షణ
- మూడో తరగతి నుంచి సబ్జెక్టు టీచర్.. యాక్టివిటీ బేస్డ్ పుస్తకాలు
- సీబీఎస్‌ఈ సిలబస్.. తాజాగా ఐబీ దిశగా అడుగులు
- పిల్లలకు ఐటీ కోర్సుల్లో శిక్షణ.. స్కిల్ ఎక్స్‌పర్ట్స్ నియామకం
- సర్కారు బడికొస్తే చాలు.. పుస్తకాల నుంచి అన్నీ ఉచితమే
- డబ్బులిచ్చి మరీ విద్యా బుద్ధులు నేర్పిస్తున్న సర్కారు
- విద్యారంగ సంస్కరణలకు రూ.71 వేల కోట్లకుపైగా వెచ్చించిన సీఎం జగన్



బ్లాక్ బోర్డుపై రాసేందుకు నాలుగు సుద్ద ముక్కల కోసం కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి నుంచి ఏకంగా ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ స్క్రీన్స్, స్మార్ట్ టీవీలతో మన ప్రభుత్వ స్కూళ్లు సరికొత్తగా ఆవిష్కృతమయ్యాయి.

పగిలిన గోడలు.. పెచ్చులూడే శ్లాబులు.. చెట్ల కింద వానాకాలం చదువులు అనే దురవస్థ నుంచి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను ఏకంగా ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికే దక్కింది. నాలుగంటే నాలుగేళ్లలోనే సాకారమైన మార్పులు ఇవన్నీ!

సాక్షి, అమరావతి: చదువుకునేందుకు లక్షలు ధారపోయాల్సిన పరిస్థితి నుంచి పిల్లలు సర్కారు బడికొస్తే చాలు ఎదురు డబ్బులిచ్చి మరీ ప్రోత్సహిస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. మనసుంటే మార్పు వచ్చి తీరుతుందని బలంగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంస్కరణల బాటతో మన విద్యా వ్యవస్థ 2019కి ముందు.. ఆ తర్వాత అని దేశమంతా చర్చించుకునేలా చేశారు. విద్యారంగంపై వెచ్చిస్తున్న వ్యయాన్ని భావి తరాల బంగారు భవిష్యత్తు కోసం పెట్టు పెట్టుబడిగా దృఢంగా విశ్వసించారు. కార్పొరేట్‌ను తలదన్నేలా

మిగతా 2వ పేజీలో ▶

రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'

తూర్పు నుంచి పశ్చిమ భారతదేశానికి బస్సుయాత్ర, పాదయాత్ర

- జనవరి 14న మణిపూర్‌లో శ్రీకారం.. మార్చి 20న ముంబైలో ముగింపు
- 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల్లో 6,200 కిలోమీటర్ల మేర ప్రయాణం
- ప్రతిరోజూ కొంత దూరం బస్సులో, మరికొంత దూరం కాలినడక
- ఇంఫాల్‌లో యాత్రను ప్రారంభించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

6లో



అమెరికాలో రోడ్డు ప్రమాదం..



టెక్సాస్‌లోని ప్రమాదస్థలి వద్ద సహాయక చర్యల్లో పోలీస్, వైద్య సిబ్బంది

ఆరుగురు ఏపీ వాసుల దుర్మరణం

మృతుల్లో ఐదుగురు ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పినతండ్రి కుటుంబ సభ్యులు

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

కారును ట్రక్ బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం

5లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఈ ప్రభుత్వమే లేకుంటే ఏమైపోయేవాళ్లమో..



కూలికి వెళ్తే గాని రోజు గడవని కుటుంబం మాది. అసలే అంతంత మాత్రంగా ఉండే మా బతుకులపై విధి పగపట్టింది. నా భర్త పక్ష వాతంతో మంచానపడ్డాడు. కుమారుడికి రెండు కిడ్నీలు పాడైపోయాయి. బాపట్ల జిల్లా వేటపాలెం సర్వోదయ కాలనీలో నివాసం ఉంటున్న నాకు భర్త, ఇద్దరు కుమారులు. నా భర్త కూలి పనులు చేస్తుండగా.. నేను ఇళ్లల్లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని ఇన్నాళ్లూ నెట్టుకొచ్చాం. వచ్చిన డబ్బులతోనే పిల్లలను చదివించుకున్నాం. ఇలా సవ్యంగా జరిగిపోతున్న తరుణంలో ఐదేళ్ల కిందట మా ఆయన కట్టా శ్రీనివాసులకు పక్షవాతం వచ్చింది. దీనికి మతిమరుపు సమస్య తోడయ్యింది. ఆయన మంచానికే పరిమితమయ్యాడు. దీంతో మా కుటుంబం ఛిన్నాభిన్నమైంది. ఇళ్లల్లో పనులు చేసుకుంటూ భర్తను, పిల్లలను చూసుకొనేదాన్ని. మా పెద్ద కుమారుడు కట్టా రాఘవేంద్ర పాలిటెక్నిక్ చదువుకొనే సమయంలో గుండెకు సంబంధించిన అనారోగ్య సమస్య తలెత్తింది. భర్త ఆరోగ్యం కోసం, బిడ్డ గుండె సమస్య కోసం మందుల కొనుగోలు కష్టంగా మారింది. ఆ సమయంలో వలంటీర్ ద్వారా భర్తకు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. అదే సమయంలో పెద్ద కుమారుడి రెండు కిడ్నీలు పాడైపోయాయి. ఏం చేయాలో పాలు పోలేదు. సమస్యలను మా వలంటీర్ దృష్టికి తీసుకెళ్లాను. వాడికి డయాలసిస్ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేశారు. దాంతో మందులు కొనుగోలు చేసుకుంటూ కుమారుడికి క్రమం తప్పకుండా డయాలసిస్ చేయిస్తూ నెట్టుకొస్తున్నా. చిన్న కుమారుడి చదువు పూర్తి కావడంతో పెళ్లి చేశాను. వాడు వేరేగా కాపురం ఉంటున్నాడు. ప్రభుత్వమే ఆదుకోకపోతే మా కుటుంబం ఏమైపోయేదో.

– కట్టా పద్మ, సర్వోదయ కాలనీ, వేటపాలెం
(దగ్గుమాటి శ్రీధర్‌రెడ్డి, విలేకరి వేటపాలెం)

వ్యవసాయానికి ఢోకా లేదు



నేను చిన్నకారు రైతును. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం గొట్ట గ్రామంలో నాకున్న రెండెకరాల భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఏటా ఖరీఫ్ వస్తే పెట్టుబడి పెట్టడం.. తీరా వాతావరణం అనుకూలించకుంటే పంట నష్టపోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ తీవ్ర వర్షాభావ పరిస్థితుల మధ్య వరి ఉభాలు పూర్తి చేశాం. అడపాదడపా వర్షాలు తప్ప ఈ ఏడాది ఆశించిన వర్షాలు పడలేదు. అయినా ఈ ప్రభుత్వం తీసుకున్న జలయజ్ఞం కొనసాగింపు చర్యలతో కరువు నుంచి బయటపడ్డాం. వంశధార ఫేజ్–2 రిజర్వాయర్‌తో పాటు గొట్టా బ్యారేజీలో నీటి స్థిరీకరణ, కాలువల నిర్వహణ, నీటి సరఫరా సమయానుకూలంగా చేపట్టారు. ఎండాకాలంలో పడిన అకాల వర్షాలు, వరదల సమయంలో ముందు చూపుతో వరద కాలువల ద్వారా వంశధార ఫేజ్–2 రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించారు. గొట్టా బ్యారేజీ నిర్వహణ కూడా బాగుంది. వంశధార రిజర్వాయర్ నుంచి కుడి ప్రధాన కాలువకు, గొట్టా బ్యారేజీ నుంచి ఎడమ ప్రధాన కాలువకు నీటిని మళ్లించడంతో రైతులకు న్యాయం చేసినట్టయ్యింది. జలయజ్ఞం పుణ్యమాని ఇక్కడి ఆయకట్టు రైతులు ఏ సమస్యా లేకుండా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారు.

– ఇంటి లక్ష్మీనారాయణ, గొట్ట
(పెనుమజ్జి ధర్మారావు, విలేకరి, హిరమండలం)

ఆరోగ్యశ్రీ నా ప్రాణాలు కాపాడింది



నేను, నా భార్య కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాది తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు. కొంత కాలంగా నా తలలో రక్తం గడ్డ కట్టి ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతుంటే ప్రైవేటు ఆస్పత్రిలో చేరాను. వైద్యం కోసం సుమారు రూ.50 వేలు ఖర్చయింది. అయినా ఫలితం లేకపోయింది. తణుకులో ప్రైవేట్ ఆస్పత్రిలో స్కానింగ్ తీసుకోగా తలలో గడ్డకట్టిన చోట ఆపరేషన్ చేయించాలని వైద్యులు సూచించారు. కూలీకి వెళితే తప్ప పూట గడవని పరిస్థితి మాది. లక్షల రూపాయలు వెచ్చించి ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమత లేదు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాను. ఒక్కపైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. భోజనం సైతం ఆస్పత్రి వాళ్లే పెట్టారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం మా ఆయన ప్రాణాలు కాపాడిందని నా భార్య దేవి ఎప్పుడూ తలుచుకుంటూ ఉంటుంది. మా ఇద్దరు పిల్లలు కానూరు ప్రభుత్వ హైస్కూల్లో చదువుతున్నారు. అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15000 అందుతోంది.

– వీరమల్లు శ్రీను, కానూరు
(పంతం వెంకటేశ్వర్లు, విలేకరి, పెరవలి)

చక్కదిద్దారు



సీబీఎస్‌ఈ.. మండలానికో కాలేజీ

ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 1,000 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోధనను ప్రారంభించింది. ప్రతి మండలంలో బాలికల కోసం ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. 292 ఉన్నత పాఠశాలలను బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మొత్తం 352 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు. 2022–23 నుంచి 14 కో–ఎడ్ జూనియర్ కళాశాలలను గర్ల్స్ జూనియర్ కళాశాలలుగా మార్చారు. దీంతో మొత్తం 679 మండలాల్లో బాలికల కోసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులోకి వచ్చింది.

సబ్జెక్టు టీచర్లు.. టోఫెల్ శిక్షణ

పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించాలంటే ఇంగ్లిష్ భాషపై పట్టు ఎంతో అవసరం. అందుకోసం ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశపెట్టడంతో పాటు ప్రాథమిక స్థాయి నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ప్రభుత్వం టోఫెల్ శిక్షణ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా 3 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు టోఫెల్ శిక్షణనిస్తున్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను నియమించి ఉత్తమ బోధన అందుబాటులోకి తెచ్చింది.

పాఠ్యాంశాల సంస్కరణ..

విద్యార్థుల్లో నేర్చుకునే తత్వం, జిజ్ఞాస పెంచేందుకు ప్రభుత్వం పాఠ్యాంశాల్లో సంస్కరణలు తీసుకొచ్చింది. మూస పద్ధతిలో ఉన్న పాఠాలను 2020–21 నుంచి సమూలంగా మార్చింది. 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించేందుకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌ను అమలు చేస్తోంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాలలను ఫౌండేషన్, ఉన్నత పాఠశాలలుగా మార్చింది. అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల అవసరాన్ని తీర్చేలా భారీగా పదోన్నతులు కల్పించారు. బోధనా సామర్థ్యాలు పెంచేందుకు, సీబీఎస్‌ఈ బోధనకు అనుగుణంగా 'టీచర్ కెపాసిటీ బిల్డింగ్' శిక్షణనిచ్చింది. ఇందుకోసం ఇఫ్లూ, రివర్‌సైడ్ లెర్నింగ్ సెంటర్లలో ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చారు.

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ బోధన బాట పట్టించారు. అక్షరానికి అగ్రాసనం వేస్తూ పేదింటి పిల్లలను అక్కున చేర్చుకున్నారు. నాడు – నేడు ద్వారా ఇప్పటికే రెండు దశల్లో 44,617 ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తెచ్చారు. ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధన, 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ విధానం, 1,000 ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్‌ఈ సిలబస్ ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సాధ్యమైంది. మధ్యాహ్నం ప్రతి విద్యార్థి సంతృప్తిగా భుజించేలా రోజుకో రుచికరమైన మెనూతో గోరుముద్ద అమలు చేస్తున్నారు. ఏటా సగటున రూ.1,400 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.6,995.34 కోట్ల బడ్జెట్‌ను పిల్లల భోజనం కోసం కేటాయించింది. వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డు, మూడు రోజులు రాగిజావ, బెల్లం చిక్కీను అందచేస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధను అత్యుత్తమ చర్యగా విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. సర్కారు స్కూళ్లలో ప్రాథమిక స్థాయి నుంచే టోఫెల్ శిక్షణతో పాటు 2025–26 నుంచి ఐబీ సిలబస్‌ను సైతం అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది ప్రభుత్వం. కేవలం విద్యారంగంలో సంస్కరణల కోసమే నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం రూ.71 వేల కోట్లకు పైగా ఖర్చు చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.

అమ్మ ఒడి నుంచి ఆణిముత్యాలు..

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, అంతర్జాతీయంగా రాణించాలన్న దీర్ఘకాలిక లక్ష్యంతో పాఠశాల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో సమగ్ర విద్య సంస్కరణలను అమలు చేసింది. 'మనబడి నాడు–నేడు' ద్వారా మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదులను సమకూర్చింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను పరిశుభ్రంగా మారుస్తూ నిర్వహణకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో మొత్తం 58,950 పాఠశాలలు ఉండగా 72,20,633 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 44,617 ప్రభుత్వ పాఠశాలల్లో 43.10 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీరందరికీ అత్యున్నత ప్రమాణాలతో విద్యనందించాలని 2019–20లోనే ప్రభుత్వం సంస్కరణలు ప్రారంభించింది. నవరత్నాలు పథకంలో భాగంగా పిల్లలను బడికి పంపించే తల్లికి రూ.15 వేలు చొప్పున తొలిసారి 42,33,098 మంది ఖాతాల్లో రూ.6,349.6 కోట్లు జమచేసి ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట నిలుపుకొన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకే కాకుండా ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న వారికీ అమ్మ ఒడి అమలు చేసి 2022–23 వరకు రూ.25,809.50 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసి ప్రభుత్వం అండగా నిలిచింది.

సదుపాయాలు..

విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువు నేర్చుకునేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం మనబడి నాడు–నేడు ద్వారా శ్రీకారం చుట్టింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 11 సదుపాయాలను కల్పించింది. నిరంతర నీటి సరఫరాతో టాయిలెట్లు, తాగునీరు, మరమ్మతులు, ఫ్యాన్లు, లైట్లతో విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, భవనాలకు పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, అదనపు తరగతి గదులు నిర్మించింది. నాడు–నేడు మొదటి విడతలో 15,715 పాఠశాలల్లో రూ.3,669 కోట్లతో సౌకర్యాలు కల్పించారు. రెండో దశలో రూ.8,000 కోట్లతో 22,344 పాఠశాలల్లో పనులు వడివడిగా చేపట్టారు. నాడు–నేడు పనులు చేపట్టిన అన్ని ఉన్నత పాఠశాలల్లో ఇంటర్నెట్‌తో పాటు 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో 3డీ డిజిటల్ పాఠాలను బోధిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 33 వేల స్మార్ట్ టీవీలతో పాఠాలతో పాటు టోఫెల్ శిక్షణ అందిస్తున్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు బైజూస్ పాఠాలను ఉచితంగా అందించడం గమనార్హం. దేశంలో 25 వేల ఐఎఫ్‌పీలు ఉంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే 62 వేల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయడం దేశ చరిత్రలో విప్లవంగా నిలిచిపోయింది.

డిజిటల్ శకం..



ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉత్తమ కంటెంట్ ఉచితంగా అందించేందుకు అతిపెద్ద ఎడ్ టెక్ కంపెనీ బైజూస్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఈ కంటెంట్‌ను ఇంటర్ విద్యార్థులకు కూడా అందిస్తుండడం విశేషం. ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిపి 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో 9.53 లక్షల మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్స్ ఇచ్చి ఇంటి వద్ద కూడా డిజిటల్ పాఠాలు నేర్చుకునేలా చర్యలు తీసుకుంది. ఏపీ ఈ పాఠశాల మొబైల్ యాప్, దీక్ష వెబ్‌సైట్, డీటీహెచ్ చానెళ్లు, యూట్యూబ్ చానెల్ లాంటి వాటి ద్వారా విద్యార్థులు ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా చదువుకునే ఏర్పాటు చేసింది. విద్యార్థుల సందేహాల నివృత్తికి 'ఏఐ' టెక్నాలజీతో పనిచేసే 'డౌట్ క్లియరెన్స్ బాట్' యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, టోఫెల్ శిక్షణలో ఎదురయ్యే క్లిష్టమైన సందేహాలను ఇది సునాయాసంగా నివృత్తి చేస్తుంది.

ప్రతిభకు ప్రోత్సాహం..

విద్యా రంగ సంస్కరణల కొనసాగింపు, నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల కృషిని అభినందించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది మరో గొప్ప ముందడుగు వేసింది. ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో చదివి ప్రతిభ చాటిన వారిని 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో సత్కరించింది. 2023 ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానాల్లో నిలిచిన 22,768 మంది స్టేట్ బ్రిలియన్స్ అవార్డులు అందుకున్నారు.

టెక్నాలజీపై శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 2024–25 నుంచి ఫ్యూచర్ స్కిల్స్ కోర్సులను ప్రవేశపెడుతోంది. ఆరు నుంచి ఇంటర్ వరకు మూడు దశల్లో ఫ్యూచర్ స్కిల్ శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థుల ఆలోచన శక్తిని విస్తరించడం, విజ్ఞానంలో ముందుండేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), 3డీ ప్రింటింగ్, గేమింగ్ లాంటి పది విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసమే దాదాపు రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నాస్కామ్, జేఎన్‌టీయూ నిపుణులు, ఏపీ ఎస్సీఈఆర్టీ, స్వతంత్ర నిపుణులతో ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఈ కోర్సులను 6,790 ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు ఇంజనీరింగ్ చివరి ఏడాది విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా నియమిస్తున్నారు.

ఐబీ దిశగా అడుగులు..

'మన పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా ఎదగాలి. ప్రపంచానికి దిక్సూచిగా మారాలి' అన్న సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో 'ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ)' బోధన ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దేశంలో 210 వరల్డ్ క్లాస్ కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే అందుబాటులో ఉన్న 'ఐబీ' బోధనను ప్రభుత్వ స్కూళ్లలోకి తెచ్చి పేద పిల్లలకు ఉచితంగా అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ అడుగులు ముందుకు వేశారు. 2025 – 26 నుంచి ఐబీ బోధన ప్రవేశపెట్టి ఏటా ఒక్కో తరగతి చొప్పున పెంచుతూ + 2 వరకు అందించేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, లేటరల్ థింకింగ్, డిజైన్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ లాంటి నైపుణ్యాలకు సాన పెట్టడంతోపాటు అంతర్జాతీయంగా అత్యుత్తమ స్థాయిలో ఉద్యోగాలయ పొందేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. నాలుగున్నరేళ్లలోనే ఇన్ని అద్భుతమైన సంస్కరణలు విద్యారంగంలో తేవడం చరిత్రాత్మకమని, ఇది ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

జగనన్న అమ్మ ఒడి ఇలా..

ఏడాది	లబ్ధిదారులు	వ్యయం రూ.కోట్లలో
2019-20	42,33,098	6,349.6
2020-21	44,48,865	6,673.4
2021-22	42,62,419	6,393.6
2022-23	42,61,965	6,392.9

విద్యా కానుక అందించారు ఇలా..

ఏడాది	విద్యార్థులు	వ్యయం
2020-21	42,34,322	648.10
2021-22	47,32,064	789.21
2022-23	45,14,687	886.69
2023-24	43,10,165	1,042.53

విద్యా సాధికారత..



స్కూళ్లలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులతో పాటు ఆంగ్ల మాధ్యమం వల్ల విద్యా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రాథమిక స్థాయి నుంచి బలమైన పునాదులను నిర్మిస్తోంది. ఇప్పుడు మన ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉత్తమ విద్యతో నైపుణ్యం గల మానవ వనరులను సృష్టించడం సాధ్యమేనని బలంగా నమ్ముతున్నా.

– ప్రొఫెసర్ కె.శ్రీరామమూర్తి, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్

పదేళ్లలో అద్భుతాలు సృష్టిస్తారు



గతంలో నేను ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు పుస్తకాలు, యూనిఫారం లాంటివి డొనేట్ చేసేవాడిని. ఈ ప్రభుత్వం వచ్చాక నోటు పుస్తకాల నుంచి యూనిఫారం, బూట్లు వరకు ఆ అవసరం లేకుండా అన్నీ ఉచితంగా అందిస్తోంది. స్వేచ్ఛ న్యాప్కిన్స్ ఇస్తున్నారు. ఆటలు ఆడిస్తున్నారు. పిల్లలకు నేర్పే విధానం, నేర్చుకునే విధానం సంపూర్ణంగా మారింది. ప్రభుత్వ విద్యలో ఇదో గొప్ప సంస్కరణ. కార్పొరేట్ స్కూళ్లలోనూ ఇన్ని వసతులు లేవు. ఇప్పుడు చదువుకుంటున్న పిల్లలు మరో 10 ఏళ్లలో అద్భుతాలు సృష్టిస్తారనడంలో సందేహం లేదు.

– డాక్టర్ రాజశేఖర్, గైనకాలజిస్ట్, కర్నూలు

ఆ ఇబ్బందులు తొలగించారు



ప్రభుత్వ స్కూళ్లలో టాయిలెట్లు లేకపోవడం బాలికలకు అతి పెద్ద సమస్య. ఈ ప్రభుత్వం ఆ సమస్యను దూరం చేసింది. బాలికలకు స్వేచ్ఛ పేరుతో శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా ఇస్తున్నారు. గతంలో ఈ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారు. నాడు–నేడుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. రక్తహీనత నివారణకు బెల్లం చిక్కీతో పాటు ఐరన్ మాత్రలు ఇవ్వడం ప్రశంసనీయం.

– వడిశెట్టి గాయత్రి, పీజీ లెక్చరర్, పిఠాపురం

'నీటి' మీద లెక్కలు

గోదావరి-కావేరి అనుసంధానానికి నీటి లభ్యతపై ఎన్‌డబ్ల్యూడీఏ, సీడబ్ల్యూసీ వేర్వేరు లెక్కలు

సాక్షి, అమరావతి: గోదావరి–కావేరి అనుసంధానం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో నీటి లభ్యతపై జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) లెక్కను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కొట్టిపారేస్తోంది. తెలంగాణలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, గోదావరి–కావేరి అనుసంధానంలో ప్రతిపాదించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు మధ్య ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు వినియోగించుకున్న నికర జలాల్లో 177 టీఎంసీలు మిగులు ఉందని ఎన్‌డబ్ల్యూడీఏ లెక్క కట్టింది. సీడబ్ల్యూసీ దీనికి విరుద్ధంగా చెబుతోంది. గోదావరిలో ఎక్కడా నికర జలాల్లో మిగులు లేదని సీడబ్ల్యూసీ తేల్చిచెప్పింది. దాంతో గోదావరిలో నీటి లభ్యతపై సంయుక్తంగా శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏలను కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశించింది. మహానది–గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా 760 టీఎంసీల జలాలను కృష్ణా, పెన్నా, కావేరి బేసిన్‌లకు తరలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది.

ఆ లెక్కకు ప్రాతిపదిక ఏమిటో?

శ్రీరాం సాగర్ ప్రాజెక్టు – ఇచ్చంపల్లి మధ్య తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకోగా.. ఇచ్చంపల్లి వద్ద నికర జలాల్లో 177 టీఎంసీల మిగులు జలాలు ఉంటాయని ఎన్‌డబ్ల్యూడీఏ లెక్కకట్టింది. ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 105 టీఎంసీలు, జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు నీటి ఆవిరి కింద కేటాయించిన 52 టీఎంసీలకు మిగులు జలాలు 177 టీఎంసీలు జత చేసి 334 టీఎంసీలను గోదావరి–కావేరి అనుసంధానంలో తరలించడానికి ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. దీన్ని సీడబ్ల్యూసీ అంగీకరించడంలేదు. శ్రీరాం సాగర్ – ఇచ్చంపల్లి మధ్య 177 టీఎంసీల మిగులు జలాలు ఉన్నట్లు ఏ ప్రాతిపదికన లెక్కగట్టారని ఎన్‌డబ్ల్యూడీఏను ప్రశ్నించింది. గోదావరి బేసిన్‌లో ఎక్కడా నికర జలాల్లో మిగులు లేదని పేర్కొంది. కోటా నీటిని ఛత్తీస్‌గఢ్ వాడుకుంటే గోదావరి–కావేరి అనుసంధానం ప్రశ్నార్థకమవుతుందంది. శ్రీరాం సాగర్– ఇచ్చంపల్లి మధ్య వరద జలాల్లో మిగులు అనుమానమేనని సీడబ్ల్యూసీ పేర్కొంది. 50 శాతం లభ్యత..., గరిష్టంగా వరద వచ్చే రోజుల్లో ఇచ్చంపల్లి వద్ద 247 టీఎంసీల లభ్యత ఉండే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

సమ్మె విరమించండి

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు మంత్రుల కమిటీ విజ్ఞప్తి

- ఇప్పటికే ఎంతో చేశాం.. న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తాం
- బాలలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రధానం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అనివార్యత తీసుకురావద్దు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీలకు మరింత చేయూతనివ్వడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని.. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రుల బృందం తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సమ్మెను విరమించుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెతో రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరింది. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల మీద మరింత శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని.. వారి క్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అనివార్య పరిస్థితి తీసుకురావద్దని కోరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ప్రయోజనం కోసం తీసుకున్న వివిధ నిర్ణయాలను పునరుద్ఘాటిస్తూ.. మరిన్ని సానుకూల నిర్ణయాలను తీసుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని.. అందువల్ల సమ్మెను విరమించాలని కోరింది.

టీడీపీ హయాంలో ఒక్కపైసా కూడా పెంచలేదు

అంగన్‌వాడీలకు టీడీపీ హయాంలో 2016 ఏప్రిల్ 4న అంగన్‌వాడీ కార్యకర్తల జీతం రూ.4,200 నుంచి, రూ.7,000కు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు రూ.2,950 నుంచి రూ.4,500కు, అంగన్‌వాడీ సహాయకుల జీతాలు రూ.2,200 నుంచి రూ.4,500కు పెంచారని మంత్రుల బృందం గుర్తు చేసింది. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అంగన్‌వాడీల కష్టాలు చూసి జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపింది. దీంతో అప్పటి ప్రభుత్వం ఎన్నికలకు 6 నెలల ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల జీతాలను పెంచిందని గుర్తు చేసింది. గత ప్రభుత్వ హయాంలో 2019 వరకూ అంగన్‌వాడీ కార్యకర్తలకు సగటున రూ.6,950, అంగన్‌వాడీ సహాయకురాలికి, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు సగటున రూ.3,900 మాత్రమే చెల్లించిందని వివరించింది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలను రూ.11,500లకు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలను రూ.7,000కు, అంగన్‌వాడీ సహాయకుల జీతాలను రూ.7,000కు పెంచిందన్నారు. మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.27.80 కోట్లు ప్రోత్సాహకాలుగా ప్రభుత్వం చెల్లిస్తోందని మంత్రుల బృందం తెలిపింది.రాష్ట్ర విభజన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే తొలిసారిగా పదోన్నతులు ఇచ్చి 560 గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేసింది. ఈ పోస్టుల పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది. దాంతో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించిందని వివరించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించిందని తెలిపింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలతోపాటు వివిధ రూపాల్లో తోడ్పాటు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేసింది.

రేపు భీమవరంలో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భీమవరంలో పర్యటిస్తారు. తాడేపల్లిలోని తన నివాసం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి భీమవరం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు. కార్యక్రమం అనంతరం తిరిగి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

అవసరం ఉన్న జీవోలన్నింటినీ అప్‌లోడ్ చేస్తున్నాం

- జీవోల అప్‌లోడ్ విషయంలో కొత్త విధానం తెచ్చాం
- ఈ–గెజిట్‌లో జీవోలను అప్‌లోడ్ చేస్తున్నాం
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రజలకు అవసరం ఉన్న జీవోలన్నింటినీ అప్‌లోడ్ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. జీవోల అప్‌లోడ్ విషయంలో కొత్త విధానాన్ని తీసుకొచ్చామని తెలిపింది. జీవోఐఆర్ స్థానంలో ఈ–గెజిట్‌లో జీవోలను అప్‌లోడ్ చేస్తున్నామని వివరించింది. ఆ మేరకు జీవో 100 జారీ చేశామని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. పెట్రోల్ బిల్లులు, కరెంట్ బిల్లుల చెల్లింపులు, జీత భత్యాలు వంటి అప్రధాన్య జీవోలను మాత్రమే అప్‌లోడ్ చేయడం లేదని తెలిపారు. అత్యవసర జీవోలను జీవో జారీ అయిన మరుసటి రోజే అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. గతంలో జీవోలపై ఎవరు జారీ చేశారో వారి సంతకం ఉండేది కాదని, ఇప్పుడు వారి సంతకంతో సహా అప్‌లోడ్ చేస్తున్నామని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. గోప్యత, అతి గోప్యత, రహస్య జీవోలను మాత్రమే అప్‌లోడ్ చేయడం లేదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నామమాత్రంగానే జీవోలను అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసే జీవోల గురించి తెలుసుకోవడం పౌరుల హక్కు అన్నారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. పారదర్శకతలో భాగంగా జీవోలన్నింటినీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడింది. ఒకవేళ ఆ జీవోలు గోప్యం, అతి గోప్యం కేటగిరీ కిందకు వస్తుంటే, ఆ జీవోల్లోని విషయాన్ని బయటపెట్టకుండా, ఆ జీవోలు గోప్యమని తెలియచేస్తూ వాటిని కూడా అప్‌లోడ్ చేయడం సబబుగా ఉంటుందని తెలిపింది. గోపత్య , అతి గోప్యత, రహస్యంగా జీవోలను వర్గీకరిస్తున్నట్లు చెబుతున్న నేపథ్యంలో, అలా కేటగిరీల వర్గీకరణకు అనుసరిస్తున్న విధానం ఏమిటో చెప్పాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో రాజ్యాంగపరమైన అంశాలు ముడిపడి ఉన్న నేపథ్యంలో లోతుగా విచారణ జరుపుతామంటూ విచారణను జనవరి 22కి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. జీవోలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచకపోవడం సమాచార హక్కు చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ పలువురు హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా...

గ్రూప్‌-1 పోస్టులకు 1 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్‌-1 సర్వీసెస్ పోస్టుల పూర్తి సమాచారాన్ని కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలు, అర్హతలు, వేతనాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి ఒకటి నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రదీప్ కుమార్ సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ https://psc.ap.gov.in చూడవచ్చు.

జనవరి 30 నుంచి పీసీబీ ఏఈఈ పోస్టులకు దరఖాస్తులు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 19 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 21 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది.

ప్రతి కుటుంబం సంక్షేమమే ప్రధాని ఆశయం



మాట్లాడుతున్న పీయూష్ కుమార్

తిరుపతి మంగళం: భారతదేశంలోని ప్రతి కుటుంబం బాగుండాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ ఆశయమని కేంద్ర ప్రభుత్వ కామర్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ అన్నారు. తిరుపతి జీవకోనలోని గురుకృప సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పీయూష్‌కుమార్, తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీయూష్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభించారని తెలిపారు. జనవరి 26 నాటికి ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. సంకల్ప యాత్రను జిల్లాలో ఇప్పటికే 373 గ్రామ పంచాయతీలు, తిరుపతిలోని 21 డివిజన్లలో విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. కేంద్ర పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

భారత్ దేఖో.. ఫిట్ రఖో

విశాఖలో సైకిల్ యాత్ర ప్రారంభించిన నేవీ అధికారులు



సాక్షి, విశాఖపట్నం: ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు విశ్రాంత సైనికులు సైకిల్‌పై భారత యాత్ర చేపట్టారు. పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ నెల 23న భువనేశ్వర్ నుంచి లెఫ్టినెంట్ జనరల్ అనిల్ పూరీ, ఆయన సతీమణి కల్నల్ డాక్టర్ సోని యాపూరీ 'భారత్ దేఖో.. ఫిట్ రఖో' పేరుతో సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర బుధవారం మధ్యాహ్నం విశాఖకు చేరుకుంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంతో పాటు ఐఎన్ఎస్ విశ్వకర్మ వద్ద వీరికి నౌకాదళాధికారులు, సిబ్బంది, వారి కుటుంబాలు ఘన స్వాగతం పలికాయి. ఈ దంపతులకు విశాఖ నుంచి మాజీ సైనికులు కల్నల్ ముఖేష్ రౌత్, మేజర్ పీవీ రావు, వికాస్, సుధాకర్ జత కలిశారు. సైకిల్ యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ యాత్ర జనవరి 2వ తేదీ వరకూ సాగుతుందని నేవీ అధికారులు తెలిపారు. సైకిల్ యాత్ర అంటే రెండు చక్రాలపై దేశాన్ని చుట్టిరావడం మాత్రమే కాదనీ..దేశ ప్రజలకు భారత గడ్డపైనా, శారీరక శ్రమపైనా ప్రేమను పెంచేందుకు దోహదపడేలా అవగాహన కల్పిస్తామని ర్యాలీ నిర్వహిస్తున్న వెటరన్ సైనికులు తెలిపారు.

11 మంది డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి

20 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రమోషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇరవైమంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. 2006 బ్యాచ్‌కు చెందిన 11 మంది డీఐజీలకు ఐజీలుగా, 2010 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఎస్పీలకు డీఐజీలుగా, 2011 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఎస్పీలకు స్పెషల్ గ్రేడ్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదోన్నతులు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐజీలుగా పదోన్నతులు పొందిన అధికారులు : కొల్లి రఘురామ్ రెడ్డి, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జీవీజీ అశోక్ కుమార్, జి.విజయ్‌కుమార్, ఎస్.హరికృష్ణ, ఎం.రవి ప్రకాశ్, ఎస్వీ రాజశేఖరబాబు, కేవీ మోహన్‌రావు, పీహెచ్‌డీ రామకృష్ణ.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉంటూ ఐజీలుగా పదోన్నతి పొందిన రాష్ట్రానికి చెందిన అధికారులు : ఆకే రవి కృష్ణ, ఆర్. జయలక్ష్మి

డీఐజీలుగా పదోన్నతి పొందిన అధికారులు: సీహెచ్ విజయ రావు, రాహుల్‌దేవ్ శర్మ, విశాల్ గున్నీ

స్పెషల్ గ్రేడ్ ఎస్పీలుగా పదోన్నతి పొందిన వారు: బి.సత్యయేసుబాబు, కేకేఎన్ అన్బురాజన్, అట్టాడ బాబూజీ, కె.ఫక్కీరప్ప, ఎం.రవీంద్రనాథ్ బాబు.

- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉంటూ స్పెషల్ గ్రేడ్ ఎస్పీగా సీహెచ్. వెంకట అప్పల నాయుడు పదోన్నతి పొందారు.


విజయవాడ కృష్ణలంక ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, దేవినేని అవినాష్


అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు


పల్నాడు జిల్లా గురజాలలోని జయంతి పాఠశాలలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కాసు


ఏలూరు జిల్లా పోతునూరు ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

కూత కుదిరింది.. ఆట అదిరింది

- రాష్ట్రవ్యాప్తంగా జోష్ నింపుతున్న 'ఆడుదాం ఆంధ్రా'
- ఐదు క్రీడాంశాల్లో టోర్నీలు
- నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్న క్రీడాకారులు
- సత్తా చాటుతున్న యువతులు.. దమ్ము చూపుతున్న యువకులు
- 26 జిల్లాల్లోని 8,549 గ్రామ, వార్డు సచివాలయాల్లో 8,594 పోటీలు


ప్రకాశం జిల్లా పీసీపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో క్రీడా రంగానికి మహర్దశ వచ్చింది. గ్రామీణ, పట్టణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు.. మాణిక్యాల్లాంటి క్రీడాకారులను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరిట ఐదు క్రీడాంశాల్లో టోర్నమెంట్లు నిర్వహిస్తోంది. యువత ఆరోగ్యాన్ని పెంపొందించే.. క్రీడా స్ఫూర్తి నింపే లక్ష్యంతో వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా క్రీడాకారులు నువ్వా.. నేనా అన్నట్టుగా తలపడ్డారు. ఆయా క్రీడాంశాల్లో వేలాది జట్లు దుమ్మురేపాయి. యువతులు సైతం పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. షెడ్యూల్ ప్రకారం 26 జిల్లాల్లోని 8,549 గ్రామ, వార్డు సచివాలయాల్లో పోటీలు నిర్వహించారు. దాదాపు 18 జిల్లాల్లో 50 శాతం నుంచి 73.85 శాతం సచివాలయాల్లో పోటీలు ఊపందుకున్నాయి. 9,774 పోటీలను నిర్దేశిస్తే 8,594 పోటీలను దిగ్విజయంగా పూర్తి చేశారు. కొన్నిచోట్ల సమయాభావంతో పోటీలు మరుసటి రోజు షెడ్యూల్‌లోకి మార్చారు. అత్యధికంగా విశాఖపట్నంలో 95.37 శాతం, పశ్చిమ గోదావరిలో 94.95 శాతం, తూర్పు గోదావరిలో 92.93 శాతం, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో 90 శాతానికిపైగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు జరిపించారు. క్రీడాకారులు చెలరేగి ఆడుతుంటే.. రెట్టించిన ఉత్సాహంతో ప్రేక్షకులు క్రీడాకారులను ప్రోత్సహించడం విశేషం. తొలిరోజు కంటే అత్యధికంగా 7.02 లక్షల మంది వీక్షకుల సంఖ్య నమోదయ్యింది. ఇందులో 4.80 లక్షల మంది పురుషులు, 2.20 లక్షల మంది మహిళలు పోటీలను నేరుగా తిలకించారు. మొత్తంగా 31,169 మ్యాచ్‌లలో 70 శాతం మ్యాచ్‌లు అనుకున్న సమయానికి పూర్తి చేశారు.

ఉత్తరాంధ్రలో ఉవ్వెత్తున

శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా రెండో రోజూ ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా టోర్నీలు కొనసాగాయి. పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ యువకులతో కబడ్డీ ఆడి అలరించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో బుధవారం వివిధ టోర్నమెంట్లు హోరాహోరీగా సాగాయి. సచివాలయ స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు జిల్లాల్లోని 976 సచివాలయాల పరిధిలోని 485 మైదానాల్లో ఆటల పోటీలు సాగాయి. విశాఖ జిల్లా పశ్చిమ నియోజకవర్గంలోని సింహాచలం సచివాలయాల పరిధిలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో కబడ్డీ, క్రికెట్, ఖోఖో పోటీలు జరగ్గా.. చినవాల్తేరు జీవ్కూజియం గ్రౌండ్‌లో షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గాజువాక నియోజకవర్గ పరిధిలోని భెల్ (హెచ్‌పీవీపీ) క్రీడా మైదానంలో 8 జట్ల మధ్య సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురంలో క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో యువ జట్లు ఉత్సాహంగా తమ ప్రతిభ చాటాయి.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 515 సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా రెండో రోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మామిడికుదురు మండలం మొగిలికుదురులో పోటీలను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లాలోని 511 సచివాలయాల పరిధిలో క్రీడాకారులు ఉల్లాసంగా పాల్గొన్నారు. కాకినాడ జిల్లాలోని 400 మైదానాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు చురుగ్గా పాల్గొన్నారు.

రాయలసీమలో రసవత్తరంగా..

రాయలసీమలో ఆడుదాం ఆంధ్రా పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. చిత్తూరులో పోటీలను కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు పర్యవేక్షించారు. పీవీకేఎన్ మైదానంలో పోటీలను జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం 507 సచివాలయాల పరిధిలో 492 క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం రెండు రోజుల్లో 2,602 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉండగా.. 2,365 మ్యాచ్‌లు జరిగాయి. తిరుపతి జిల్లా పరిధిలో రెండో రోజు 1,552 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా.. 1,151 మ్యాచ్‌లు జరిగాయి. పోటీలను తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు. కర్నూలు జిల్లా పరిధిలోని 672 సచివాలయాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. కోడుమూరు మండలం పెంచికలపాడులో ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ రిబ్బన్ కట్ చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఒక్క కర్నూలు నగరంలోనే 30 క్రీడా మైదానాల్లో క్రికెట్, కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. కడప డీఎస్ఏ క్రీడా మైదానంలో పోటీలను డీఎస్‌డీవో కె.జగన్నాథరెడ్డి ప్రారంభించారు.

సత్తా చాటుతున్న సెంట్రల్ ఆంధ్రా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు కోలాహలంగా సాగుగుతున్నాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆచంట నియోజకవర్గ పరిధిలోని మార్టేరు, పెనుమంట్ర మండలాల్లో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం పోటీలను ప్రారంభించారు. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఏలూరు జిల్లాలో 1,250 మ్యాచ్‌లు, పశ్చిమగోదావరి జిల్లాలోని 537 సచివాలయ పరిధిలో 880 మ్యాచ్‌లు నిర్వహించారు. క్రీడా ప్రాంగణాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. విజయవాడ కృష్ణలంకలోని ఏపీ ఎస్ఆర్ఎంసీ హైస్కూల్ మైదానంలో రెండో రోజు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 1.20 లక్షల మంది భాగస్వాములవుతున్నారని కలెక్టర్ తెలిపారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. పల్నాడు జిల్లాలోని అన్ని మండలాల్లో పోటీలు నిర్వహించారు. గురజాలలోని జయంతి పాఠశాలలో క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. ప్రకాశం జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. కనిగిరి జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు. తర్లుపాడు మండలంలో పోటీలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్, క్రికెట్ ఆడారు.

ఈనాడు కథనం పచ్చి అబద్ధం

పీసీ పల్లి: ప్రకాశం జిల్లా పీసీ పల్లి పంచాయతీలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు స్థానిక మహిళలు లేక రుణాలు తీసుకునేందుకు బ్యాంక్‌కు వచ్చిన అయ్యవారిపల్లికి చెందిన పొదుపు మహిళలతో టెన్నికాయిట్ ఆడించారంటూ 'ఈనాడు' ప్రచురించిన కథనాన్ని వెంకటేశ్వర డ్వాక్రా గ్రూప్ మహిళలు తీవ్రంగా ఖండించారు. ఈనాడులో ప్రచురించిన కథనమంతా అబద్ధమని మహిళలు తెలిపారు. పీసీపల్లి మండలం మురుగమ్మి పంచాయతీకి చెందిన వెంకటేశ్వర డ్వాక్రా గ్రూపునకు తామంతా రుణాల కోసం కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ చిలకమ్మ కలిసి మంగళవారం పీసీ పల్లిలోని బ్యాంక్‌కు వెళ్లామన్నారు. బ్యాంక్‌లో రుణ ప్రక్రియ ఆలస్యం అవుతుందనడంతో సమీపంలోని పాఠశాలకు వెళ్లి 'ఆడుదాం ఆంధ్రా' తిలకించామన్నారు. అక్కడ పోటీల్లో పీసీ పల్లికి చెందిన తమ స్నేహితులు ఆటలాడుతుండటంతో విరామ సమయంలో వారితో ముచ్చటిస్తూ వారి చేతిలో ఉన్న ఆట వస్తువులను తీసుకుని సరదాగా వారితో కలసి ఆడామని చెప్పారు. అనంతరం బ్యాంకుకు వెళుతుంటే ఈనాడు విలేకరి వచ్చి మీది ఏ గ్రామం, ఏ పనిమీద వచ్చారని అడిగి ఫొటోలు తీసుకువెళ్లినట్టు చెప్పారు. గ్రూప్ లీడర్ సులోచన మాట్లాడుతూ.. రుణాల కోసం పీసీ పల్లి బ్యాంక్‌కు వెళ్లామని.. రుణ ప్రక్రియ ఆలస్యం అవుతుందనడంతో స్కూల్‌లో జరిగే ఆటల పోటీలకు చూడటానికి వెళ్లామని చెప్పారు. తాము పోటీల్లో పాల్గొనలేదని.. కావాలనే పార్టీల మీద అక్కసుతో తమ ఫొటోలు తీసి తప్పుడు కథనం ప్రచురించారని తెలిపారు.

వలంటీర్ల ఆగ్రహ జ్వాలల్లో పచ్చపత్రికల దహనం

ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలు రాస్తున్నాయి

- సమ్మె చేస్తామనడం అవాస్తవం
- వలంటీర్ల సోషల్ మీడియాలో దూరి అసత్య పోస్టులు పెడుతున్న పచ్చబ్యాచ్
- వలంటీర్ల సంఘ నేతల స్పష్టీకరణ
- ఎల్లోమీడియాకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల నిరసనలు


కర్నూలు జిల్లా నందవరంలో రామోజీరావు, రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న వలంటీర్లు

నందవరం/హుకుంపేట/పెదకూరపాడు/కోళ్లపాలెం/కపిలేశ్వరపురం: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవాభావంతో నిరంతరం పనిచేస్తున్న వలంటీర్లు.. తమపై వస్తున్న తప్పుడు కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము సమ్మె చేస్తామన్నామని, ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనడం లేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ప్రతుల్ని పలుచోట్ల దహనం చేశారు. పలు ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో నిరసన తెలిపారు. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏబీఎన్, ఈటీవీ, టీవీ 5 చానళ్లు అసత్య ప్రసారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు సమ్మె, నిరసనలు చేసే ఆలోచనలే లేవని ముక్తకంఠంతో నినదించారు.

అసత్యవార్తలతో దెబ్బతీయలేరు

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ఇంటింటికి చేరవేస్తున్న తమపై ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ కర్నూలు జిల్లాలో వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ఈ విధమైన అక్కసు వెళ్లగక్కుతున్నాయని చెప్పారు. తమకు ఎలాంటి సమ్మె, నిరసనలు చేసే ఉద్దేశం లేదని, అసత్యవార్తలతో వలంటీర్ల ఐక్యతను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. నందవరం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రామోజీ, రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలను దహనం చేశారు. నాగలదిన్నెలో గ్రామ సచివాలయం-1, 2 పరిధిలోను, సోమలగూడూరులోను వలంటీర్లు పచ్చపత్రికలను తగులబెట్టారు.

ఇదంతా పచ్చమీడియా కుట్ర

జీతాలు పెంచాలని వలంటీర్లు సమ్మె చేస్తున్నట్లు ఈనాడు పత్రికలో వచ్చిన కథనం అవాస్తవమని, ఇదంతా పచ్చమీడియా కుట్ర అని వలంటీర్ల అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు, హుకుంపేట మండల శాఖ అధ్యక్షుడు మీసాల రవితేజ చెప్పారు. అవాస్తవ కథనాలు ప్రచురించిన పత్రికలకు వ్యతిరేకంగా బుధవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు, పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు జరుగుతున్న మేలును చూసి తట్టుకోలేకనే పచ్చమీడియా అవాస్తవ కథనాలను ప్రచురిస్తోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. గౌరవంతోపాటు ఉపాధి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురిస్తే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు ముసిరి భవానీశంకర్, గబ్బాడ శ్రీను, అప్పలరాజు, శాంతికుమారి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.


నాగలదిన్నెలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను దహనం చేస్తున్న వలంటీర్లు


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేశవరంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వినూత్న నిరసన

సమాజసేవే పరమావధిగా.. స్వచ్ఛందంగా సేవలందిస్తున్న తమపై ఎల్లో మీడియా పిచ్చి రాతలు రాస్తోందని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పచాయతీ పరిధిలోని కోళ్లపాలేనికి చెందిన వలంటీర్లు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. ఈనాడు మీడియా, టీవీ 5 ఎలక్ట్రానిక్ మీడియా తమను రెచ్చగొట్టే విధంగా తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సమ్మెలోకి వెళ్లడం లేదని, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీ మేరకు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు జెరూష, నాగవేణి, స్వప్న, రాణి, అలివేణి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు నీలా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలెవరూ నమ్మవద్దు

వలంటీర్ వ్యవస్థ రూపశిల్పి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వలంటీర్లు ఆందోళనలు చేస్తున్నట్టు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మవద్దని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని వలంటీర్లు కోరారు. జీతాలను పెంచాలంటూ వలంటీర్లు ఆగ్రహంతో ఉన్నారని, రహదారులపై ఆందోళనలతో రగిలిపోతున్నారని సోషల్ మీడియాలోను, కొన్ని పత్రికల్లోను తప్పుడు వార్తలు వస్తున్నాయని చెప్పారు. తప్పుడు కథనాలు రాసిన ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను దహనం చేశారు.

వలంటీర్ల ఐక్యతను దెబ్బతీయలేరు



వలంటర్లను రెచ్చగొట్టి చిచ్చుపెట్టాలనే ఉద్దేశంతోనే పచ్చమీడియా తప్పుడు వార్తలను ప్రచురిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు ప్రభుత్వసేవలు చేరువయ్యాయి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మా సేవలను జీర్ణించుకోలేకనే ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఆ రెండు పత్రికలకు తగిన బుద్ధి చెబుతారు. వలంటీర్ల ఐక్యతను ఎవరూ దెబ్బతీయలేరు. మేమంతా సీఎం జగనన్నకు అండగా ఉంటాం.

– భీమన్న, గ్రామ వలంటీరు, నందవరం మండలం, కర్నూలు జిల్లా

విపక్షాల కుట్రలు విఫలం

కొందరినైనా రెచ్చగొటి సమ్మెలోకి దించాలన్న విపక్షాల కుట్రలు విఫలమయ్యాయి. నిన్నటిదాక వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులతో పోలుస్తూ ప్రతిపక్షాలు, పచ్చ మీడియా విషప్రచారం చేశాయి. ఇప్పుడు వలంటీర్లపై లేనిపోని ప్రేమను కురిపించి అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వలంటీర్ల సోషల్ మీడియాలోకి పచ్చబ్యాచ్ దూరి అసత్య పోస్టులు పెడుతున్నారు. వలంటీర్లు అందరూ ఆడుదాం ఆంధ్రాలో పాల్గొంటున్నారు. అవాస్తవాలు చెప్పే వారిని శిక్షించాలి.

– వెలితోటి చిన్నబాబు, పల్నాడు జిల్లా వలంటీర్ల యూనియన్ నాయకుడు

కుప్పాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే

- మంత్రి ఆర్కే రోజా


క్రీడాకారులతో వాలీబాల్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

తిరుపతి సిటీ: వచ్చే ఎన్నికల్లో కూడా వార్ వన్ సైడ్‌గా జరుగుతుందని.. వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయమని రాష్ట్ర క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఉమెన్స్ వాలీబాల్ టోర్నీని ఆమె ప్రారంభించారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ.. 14ఏళ్లు సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు తన నియోజకవర్గమైన కుప్పాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కుప్పం ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత కుప్పంలో ఇంటింటికి సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు తాగునీరు కూడా అందించామన్నారు. కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీతో పాటు రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అంతకుముందు సౌత్ జోన్ మహిళా వాలీబాల్ టోర్నీని ప్రారంభించిన రోజా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో క్రీడారంగానికి మహర్దశ వచ్చిందని చెప్పారు. గ్రామీణ, పట్టణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మహిళలు క్రీడారంగంలోనూ దూసుపోతున్నారని.. ఈ టోర్నీలో పాల్గొనేవారు కూడా సమాజానికి తమ ప్రతిభను చాటాలని సూచించారు.

'ఏపీసీపీడీసీఎల్' ఇన్‌చార్జ్ సీఎండీ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ఇన్‌చార్జ్ సీఎండీగా కె.సంతోషరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. డిస్కం ప్రస్తుత సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) సీఎండీగా ఉన్న సంతోషరావుకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఇస్తూ ఇంధన శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన విజయవాడలోని డిస్కం కార్పొరేట్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంతోషరావుకు పద్మాజనార్దనరెడ్డి స్వాగతం పలికారు.



దీర్ఘ అనుభవం మీద ఆధారపడి చెప్పే పొట్టి వాక్యమే... సామెత.
– మిగెల్ డె సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 28 డిసెంబర్ 2023

ఎరుపెక్కిన సముద్ర వర్తకం

సమీపకాలంలో భారత్‌కు అత్యంత ఆందోళనకర పరిణామం ఇది. బలవత్తరమైన శక్తిగా ఎదగడానికి సముద్ర వర్తకం ముఖ్యమైన వేళ... వాణిజ్య నౌకలపై వరుస దాడులు నిరంతర అప్రమత్తత అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. వేర్వేరు వాణిజ్య నౌకలపై అరేబియా సముద్రంలో ఇటీవల జరిగిన దాడులతో, భారత నౌకాదళం మూడు క్షిపణి విధ్వంసక నౌకలను మోహరించాల్సి వచ్చింది. వాటిని వివిధ ప్రాంతాల్లో గస్తీకి నిలిపి, ముష్కరుల దొంగదాడులకు మన నేవీ చెక్ పెట్టే పనిలో పడింది. వారం రోజుల్లో... భారతీయ సిబ్బందితో కూడిన రెండు వాణిజ్య నౌకలు మన దేశానికి వస్తూ, దాడికి గురవడం మన సముద్ర వర్తకం భద్రతపై ప్రశ్నలు రేపింది.

పోర్‌బందర్‌కు 217 నాటికల్ మైళ్ళ దూరం నుంచి 21 మంది భారతీయ సిబ్బందితో కూడిన ఎమ్వీ కెమ్ ప్లూటోపై డిసెంబర్ 23న డ్రోన్ దాడి జరిగింది. అప్రమత్తమైన భారత నౌకాదళం, భారత తటరక్షక దళం సదరు వర్తక నౌకకు రక్షణగా నిలిచాయి. తర్వాత కొద్ది గంటలకే... పాతిక మంది భారతీయ సిబ్బందితో కూడిన వాణిజ్య క్రూడాయిల్ ట్యాంకర్ ఎమ్వీ సాయిబాబాపై ఎర్రసముద్రం దక్షిణ ప్రాంతంలో డ్రోన్ దాడి జరిగింది. దీంతో,నౌకాదళం గస్తీ పెంచింది. దాడులు జరిపిన ముష్కరులు సముద్ర గర్భంలో దాగివున్నా సరే, వెతికి పట్టుకొని, కఠిన చర్యలు తీసుకుంటామంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. లెక్కలు తీస్తే... నవంబర్ 19 నుంచి ఇప్పటికి ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై 30 డ్రోన్ దాడులు, సముద్రపు దొంగల దాడులు జరిగాయి. అంటే, దాదాపు రోజుకో దాడి. ఈ 30 దాడుల్లో సగం ప్రపంచంలోనే అతి రద్దీగా ఉండే సముద్ర వర్తక మార్గంలో ఎర్ర సముద్రంలో జరిగినవే. ఇది ఆందోళనకరం.

తాజాగా ఎమ్వీ కెమ్ ప్లూటోపై జరిగిన దాడి తాలూకు శిథిలాలను సేకరించి, దాడి తీరుతెన్నులను కనిపెట్టే ప్రయత్నం సాగుతోంది. దాడి మరో నౌకపై నుంచి చేశారా, లేక తీర ప్రాంతం నుంచి జరిగిందా లాంటి అంశాలను నిర్ధారణ చేసే పనిలో ఇండియన్ నేవీ నిమగ్నమైంది. ఒకపక్క గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంతో ఉద్రిక్తతలు పెరగగా, అదే సమయంలో వాణిజ్య నౌకలపై ఇలా డ్రోన్ దాడులు జరగడం యాదృచ్ఛికమేమీ కాదు. అక్కడి యుద్ధం తాలూకు ప్రభావం ఇక్కడకు విస్తరించింది. యెమెన్‌లో అధిక ప్రాంతాలను తమ నియంత్రణలో పెట్టుకున్న హౌథీ రెబల్స్ నవంబర్ మధ్య నుంచి ఎర్ర సముద్రంలో వెళుతున్న నౌకలపై డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్నారు. గాజాలోని హమాస్‌కు సంఘీభావంగా రెబల్స్ ఈ దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌తో స్పష్టమైన సంబంధం లేని నౌకలపైనా ఈ దాడులు సాగడం గమనార్హం. వీరికి ఇరాన్ అండదండలున్నట్టు కథనం.

దాడులకు బాధ్యత తమదేనంటూ ఈ యెమనీ రెబల్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ఎమ్వీ సాయిబాబాపై హౌథీలు దాడి జరిపారనీ, ఎమ్వీ కెమ్‌ప్లూటోపై ఇరాన్ నుంచి డ్రోన్‌ను ప్రయోగించారనీ అమెరికా కేంద్ర కమాండ్ సమాచారం. దాడులకు ఎర్ర సముద్రాన్ని ఎంచుకోవడంలో ముష్కరులకు పెద్ద వ్యూహం ఉంది. ప్రపంచ నౌకా రవాణాలో 30 శాతం, వ్యాపారంలో 12 శాతం, సముద్రజలాలపై పెట్రోలియమ్ వాణిజ్యంలో 10 శాతం మధ్యధరా ప్రాంతాన్ని హిందూ మహాసముద్రంతో కలిపే ఎర్ర సముద్రం మీదుగానే జరుగుతాయి. దాడుల వల్ల నౌకలు రూటు మార్చి, ఒకప్పటిలా గుడ్‌హోప్ అగ్రం చుట్టూ తిరిగిరావాలి. దూరం, దరిమిలా ప్రయాణకాలం పెరిగే ఈ సుదీర్ఘయానం వల్ల చమురు, దిగుమతుల ధరలు గణనీయంగా పెరుగుతాయి. పశ్చిమాసియా నుంచి వచ్చే చమురు మరింత ప్రియమవుతుంది. చమురు సరఫరాలకు ప్రధానంగా ఆ ప్రాంతంపై ఆధారపడే భారత్‌కు ఇది దెబ్బ. ఇజ్రాయెల్ – హమాస్ పోరు ప్రారంభమైనప్పటి నుంచి ముడి చమురు ధరలు అంతకంతకూ పెరగడమే అందుకు నిదర్శనం.

అమెరికా, ఇజ్రాయెల్‌లను సైద్ధాంతికంగా వ్యతిరేకించే హౌథీల దాడుల దెబ్బకు ఎర్ర సముద్రం ఇప్పుడు యుద్ధ క్షేత్రమైపోయింది. గాజాకు మానవతా సాయం అందేవరకు ప్రపంచ సరఫరా వ్యవస్థలకు అవరోధాలు కల్పించాలన్న వారి ఆలోచన ఫలిస్తోంది. దీన్ని ప్రతిఘటించి, ముష్కరుల దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా గత వారం 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్' పేర బహుళ దేశీయ నౌకా దళాన్ని ప్రారంభించింది. అయితే, అగ్రరాజ్య సారథ్యంలోని ఈ బలగంలో పలు దేశాలు చేరలేదు. సూయజ్ కాలువ ద్వారా వర్తకం తగ్గినందు వల్ల భారీగా నష్టపోయే ఈజిప్ట్ ఇంతవరకు హౌథీల దుశ్చర్యలను ఖండించలేదు. చివరకు యెమెనీ గ్రూపుతో శాంతి ప్రక్రియ చర్చలు సాగిస్తున్న సౌదీ అరేబియా సైతం అమెరికా సారథ్య నౌకాబలగాన్ని సమర్థించలేదు.

ఉత్తరాన హిమాలయాలు, పశ్చిమాన శత్రుత్వం వహించే పాకిస్తాన్ ఉన్నందున, మిగిలిన దిక్కుల్లో వాణిజ్యానికి సంబంధించి ఆచరణలో భారత్ ద్వీపదేశమే. అందుకే, మనకు సముద్ర వర్తకం కీలకం. మన దేశ వాణిజ్య పరిమాణంలో 98 శాతం, విలువలో 68 శాతం సముద్ర మార్గాల్లోనే సాగుతాయి. దానికి తగ్గట్టే హిందూ మహాసముద్ర ప్రాంతానికి కావలి పాత్రను భారత్ పోషిస్తోంది. వాణిజ్యం పెరగాలంటే, మిత్రదేశాలతో కలసి ఈ సముద్ర మార్గాలను సురక్షితంగా ఉంచాలి. ఆ పనే భారత్ చేస్తోంది. అయితే, ఇజ్రాయెల్ – గాజా యుద్ధంలో సమదూరం పాటిస్తూ వచ్చిన మనకు తాజా పరిస్థితులు కొత్త బరువు నెత్తిన పెట్టాయి. సోమాలీ సముద్ర దొంగల్ని నిరోధించేందుకు ఈ సరికే గస్తీ సాగిస్తున్న భారత్, ఇకపై వాణిజ్య నౌకల్ని భద్రంగా ఎర్ర సముద్రం దాటించే పని తప్పదు. ఒకవేళ దాడులు సాగితే, అది మరో యుద్ధభేరి అవుతుంది. అందుకే, ఈ సమస్యలన్నిటికీ అసలు పరిష్కారం గాజాలో యుద్ధానికి తెర పడడం, శాంతి నెలకొనడమే!

2023 పాఠాలు... 2024 ఆశలు

విశ్లేషణ



శ్యామ్ శరణ్

2023 సంవత్సరం ముగింపునకు వచ్చేసింది. ఒకపక్క కృత్రిమ మేధ, మరోపక్క రాజకీయ పరివర్తన జోరుగా సాగుతున్న ఈ ఏడాది మనకు మిగిల్చిన జ్ఞాపకాలేమిటి? ప్రపంచం పట్టు తప్పిపోతోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. జీపీటీ–4 రావడం ఈ ఏడాది అత్యంత కీలకమైన పరిణామం. ఇక నుంచి కృత్రిమ మేధే భౌగోళిక రాజకీయాల్లో ఒక పాత్రధారి కానుంది. ఉక్రెయిన్, గాజా యుద్ధాల నేపథ్యంలో 2024ను ఊహించుకుంటే, ప్రపంచ వ్యాప్తంగా చాలా చోట్ల ఉన్న ప్రత్యేక పరిస్థితులు మరిన్ని యుద్ధాలకు దారితీసే ప్రమాదం కనిపిస్తోంది. అయితే, వాతావరణ మార్పుల ముప్పును తట్టుకునేందుకు శిలాజ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లాలని 'కాప్' సమావేశాల్లో అంగీకారం కుదరడం శుభపరిణామం.

చాలా దేశాల పోరులు హ్రస్వదృష్టితో కూడిన జాతీయవాదానికీ, తాత్కాలిక ప్రయోజనాలకు పెద్దపీట వేసే నేతలకూ పగ్గాలు అప్పగించారు. కోవిడ్–19 పరిస్థితులు ప్రచండంగా ఉన్న సమయంలో టీకాల పేరుతో జాతీయ వాదం ప్రబలింది. ఇదెంత సంకుచితమైనదో ఆ తరువాత కానీ అర్థం కాలేదు. ఇది సాటి మానవుడి బాధను కూడా మరచిపోయేలా చేసింది. గాజాపై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నా ఎవరికీ పట్టకపోవడం కూడా దీనికి మరో నిదర్శనం. అదుపులేని హింసకు కొత్త, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలూ ఆజ్యం పోస్తున్నాయి. వేగంగా వృద్ధి చెందు తున్న ఈ టెక్నాలజీలు మానవాళి నిశ్చేష్టతకూ దారితీస్తున్నాయనడంలో సందేహం లేదు.



కల్పనకూ, వాస్తవానికీ తేడాలు చెరిగి...

ఈ ఏడాది మార్చిలో ఓపెన్‌ఏఐ జీపీటీ–4ను విడుదల చేసింది. ఇది కాస్తా రక్తమాంసాలతో కూడిన వాస్తవానికీ, కల్పనకూ మధ్య ఉన్న అంతరాన్ని చెరిపివేస్తోంది. ఈ డిజిటల్ వాస్తవాన్ని మన అనలాగ్ బుర్రలు ఎలా అర్థం చేసుకోగలవు? 2023 మొత్తమ్మీద అత్యంత కీలకమైన పరిణామం ఇదే అనడం అతిశయోక్తి కాబోదు. 2024లోనే కాదు... ఆ తరువాతి కాలంలోనూ మన జీవితాలను మార్చేసే పరిణామం. జీపీటీ–4 లాంటివి మన జియోపాలిటిక్స్‌ను కూడా ప్రభావితం చేస్తాయి. ''టెక్నాలజీ అనేది భౌగోళిక రాజకీయాలపై ప్రభావం చూపడం కొత్త కాకపోయినా, కృత్రిమ మేధ రంగ ప్రవేశంతో పరిస్థితి సమూలంగా మారనుంది. కృత్రిమ మేధే భౌగోళిక రాజకీయాల్లో ఒక పాత్రధారి కానుంది'' అని ఓ విశ్లేషకుడు ఇటీవలే వ్యాఖ్యానించారు.

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లలో ప్రస్తుతం కృత్రిమ మేధే అతిపెద్దది. దీని నియంత్రణ కేవలం కొంతమంది చేతుల్లోనే ఉంది. ఈ టెక్నాలజీ కొన్ని బహుళజాతి కంపెనీల చేతుల్లో అభివృద్ధి చెందింది. ప్రభుత్వాలకు వీటిపై అవగాహన లేదు. నియంత్రించే శక్తి లేదు. నియంత్రించాలన్నా ప్రభుత్వాలు ఈ కంపెనీలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. చైనా లాంటి దేశాలు చాలాకాలంగా సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిపై గట్టి నియంత్రణ పాటిస్తూ వచ్చిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. బహుశా చైనా ఈ కృత్రిమ మేధను ఇతరుల కంటే మెరుగ్గా నియంత్రించగలదేమో. కానీ అక్కడి ప్రభుత్వం కృత్రిమ మేధను కూడా తమ పార్టీ లక్ష్యాల సాధనకు పావుగా వాడుకున్నా ఆశ్చర్యం లేదు. అలాంటిది ఏదైనా జరిగితే అది ప్రపంచంలో అధికార అసమతౌల్యానికి దారితీయవచ్చు.

ద్వైదీ భావ పరాకాష్ఠలో ప్రపంచం...

మానవాళి సంక్షేమానికి అడ్డుగా నిలుస్తున్న సవాళ్లు అంతర్జాతీయ స్థాయికి చేరుతున్న తరుణంలో మన ఆలోచనా ధోరణులు మాత్రం అంతకంతకూ కుంచించుకుపోతున్నాయి. దేశాలకు, ప్రాంతాలకు పరిమితమైపోతున్నాయి. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల ఆధ్వర్యంలో బహుముఖీన అంతర్జాతీయ సహకారం, సమష్టి బాధ్యతల పంపిణీతోనే మనం ప్రస్తుత సమస్యలను ఎదుర్కోగలం. సమన్యాయం పాటించగలం. ప్రస్తుతం ప్రభుత్వేతర శక్తులన్నింటికీ శక్తిమంతమైన హింసాత్మక ఆయుధాలు అందుబాటులో ఉన్నాయి. ఇజ్రాయెల్‌పై హమాస్‌దాడి దీనికో తార్కాణం. బలహీనులు, నిర్వాసితులు కూడా బలంగా దెబ్బకొట్టగలరు అనేందుకు ఇజ్రాయెల్‌పై దాడి ఒక రుజువు.

ఉగ్రవాదంపై పోరు ఇప్పుడిప్పుడే అంతమయ్యేది కాదని 2023 మరోసారి నిరూపించింది. ఈ పోరు ఏకరీతిన లేదు. పైగా సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వాలకు మరింత బలం చేకూరుస్తోంది. రాజ్యాంగాలను పక్కనబెట్టిన అన్ని దేశాలూ అర్థం చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే, తిరుగుబాట్లను సమర్థంగా అణచివేసిన సంఘటనలు చరిత్ర మొత్తం వెతికినా కనిపించవూ అని! చిన్న రాపిడి మళ్లీ నిప్పు పుట్టించడం ఖాయం. ఫలితం తీవ్ర నష్టం, హింస. రాజకీయం ద్వారా హింసను చట్టబద్ధం చేయడం ఎంతమాత్రం తగని పని. అమాయకులు, మహిళలు, పిల్లలను చంపివేయడాన్ని కూడా సమర్థించే లక్ష్యం ఎంతటి ఉదాత్తమైనదైనా సమర్థనీయం కాదన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. హింసను ఆయుధంగా వాడుకోవడం ఎప్పుడూ పులి మీద స్వారీ లాంటిదే. హింస మొదలైతే అది కేవలం తాము ఉద్దేశించిన లక్ష్యాలకే పరిమితమవుతుందని అనుకోలేము. హింస అటు ఆక్రమణదారులనూ, ఇటు బాధితులనూ రాక్షసుల్లా మార్చేస్తుంది. ఈ సత్యాన్ని చాలాకాలం క్రితమే మహాత్మాగాంధీ బాగా అర్థం చేసుకున్నారు. 'అహింస' భావన ఈ ప్రగాఢమైన అవగాహన నుంచి పుట్టిందే. గాంధీ మాటలను మనం ఎంత విస్మరిస్తామో ప్రపంచంలో అంతేస్థాయిలో ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉంది.

ఒక్క సానుకూల పవనం...

ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో చూసిన ఒక సానుకూల అంశం ఏదైనా ఉందీ అంటే అది దుబాయిలో ఇటీవలే ముగిసిన కాప్ సమావేశాలని చెప్పాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు మానవాళి జరుపుతున్న కృషిలో భాగంగా జరిగిన ఈ సమావేశాల్లో కొన్ని ఆశాజనకమైన ఒప్పందాలు, నిర్ణయాలు జరిగాయి. వీటిని సక్రమంగా అమలు చేయగలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సామాజిక సుస్థిరత దిశగా మళ్లే అవకాశాలు పెరుగుతాయి. వాతావరణ మార్పుల ముప్పును తట్టుకునేందుకు శిలాజ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లాలని అందరూ అంగీకరించడం శుభపరిణామం. కృత్రిమ మేధతోపాటు వినూత్నమైన టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ఇదో చక్కటి అవకాశం. 2023లో వాతావరణ మార్పుల విషయంలో జరిగిన ఒప్పందాలు, కల్పించిన ఆశ వచ్చే ఏడాదిలో సఫలీకృతమవుతాయని ఆశిద్దాం.

దీన్ని పక్కనపెడితే... ప్రపంచం వచ్చే ఏడాది కూడా కొంత అసందిగ్ధతను ఎదుర్కొంటుందనేందుకు కొన్ని నిదర్శనాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగేది 2024లోనే. ప్రస్తుతానికి డోనాల్డ్ ట్రంప్ పోటీ చేసే అవకాశాలు తగ్గాయి. అడ్డంకులు తొలిగి ట్రంప్ పోటీ చేసి గెలిస్తే మాత్రం అగ్రరాజ్యంలో సరికొత్త స్థానిక వాదం తలెత్తే ప్రమాదం ఉంది. మరోవైపు ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంతోపాటు రష్యా ఉక్రెయిన్ జగడమూ వచ్చే ఏడాది మరింత ముదిరే అవకాశాలున్నాయి. ఉక్రెయిన్‌కు మద్దతిచ్చే విషయంలో అమెరికా కొంత అసందిగ్ధతతో వ్యవహరిస్తూండటాన్ని పుతిన్ గుర్తించక మానడు. తన దాడులను ఉధృతం చేయకుండా ఉండడు.

అమెరికా ఏకకాలంలో రెండు యుద్ధాలను పర్యవేక్షిస్తూండటం, ఆ దేశంతో మనకున్న సంబంధాలపై కూడా ప్రభావం చూపనుంది. పైగా చైనాతో తనకున్న శత్రుత్వాన్ని కొంత తగ్గించుకునే ప్రయత్నాలు చేయవచ్చు. ఇప్పటికే దీనికి కొన్ని రుజువులు కనిపిస్తున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరు కారాదని బైడెన్ నిర్ణయించుకోవడం ఇక్కడ చెప్పుకోవాలి. అలాగే క్వాడ్ సమావేశాల వాయిదాను కూడా ఈ దృష్టితోనే చూడాల్సి ఉంటుంది. కెనెడా ఉగ్రవాది పన్నూ విషయంలో వచ్చిన అభిప్రాయబేధాలూ ఈ ధోరణికి కారణం కావచ్చు. సెప్టెంబరులో విజయవంతంగా నిర్వహించిన జీ20 సమావేశాల ప్రాభవం కాస్తా ఈ పరిణామాలతో తగ్గిపోయింది. మరోవైపు దేశంలోనూ సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. నరేంద్ర మోదీకి మరోసారి ప్రధాని పదవి దక్కే అవకాశం ఉంది. ఈ రాజకీయ సుస్థిరత 2024లో అంతర్జాతీయ స్థాయిలో మనకు మేలు చేస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కన్నడ కాక...



బెంగళూరులో శాంతి భద్రతల పరిస్థితి ఏమిటి? కన్నడ అనుకూల గ్రూపులు బెంగళూరు వ్యాప్తంగా విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇంగ్లిష్ సైన్ బోర్డులను పగలగొడుతూ, బహిరంగంగా ఆస్తులకు నష్టం కలిగిస్తున్నాయి.

– నజీలా జమీల్, జర్నలిస్ట్

అంతా అనుకున్నట్టే!



సిరియా జనరల్ రజీ ముసావీ రజీ 'ఐఆర్‌జీసీ' (ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్) మిలిటరీ సలహాదారు ఇంటి మీదికి మూడు క్షిపణులు ప్రయోగించి ఇజ్రాయిల్ హత్య చేసింది. దీనిలో నిజ్జార్, పన్నూ ఛాయలు కనబడుతున్నాయి. అయినా యూఎస్ (అలాగే ఇండియా) నుంచి గట్టి మౌనం! ప్రపంచ నియమాల క్రమం నిజమైన ఆచరణలో ఉందా?

– ఎం.కె. భద్ర కుమార్, మాజీ దౌత్యవేత్త

తేలిన ఫలితం?



2024లో హిందూ రాజ్యం కావాలా, లౌకిక దేశమా అని శామ్ పిట్రోడా అడుగుతున్నారు. నిజానికి అడగాల్సింది ప్రజలను కాదు; నరేంద్ర మోదీకి గెలుపును వెండి పళ్లెంలో ఇస్తుందా, బంగారు పళ్లెంలోనా అని కాంగ్రెస్ నిర్ణయించుకోవాలి.

– అజిత్ దత్తా, రచయిత

రెండు వైపులు



ఉత్తర అరేబియా సముద్రంలో ఫైరసీని ఎదుర్కోవడానికి జలాంతర్గాములను ఉంచినప్పటికీ, సముద్ర మార్గాలను రక్షించడం నుంచి చైనా దూరంగా ఉంది. జరుగుతున్నది చూస్తూ అది ఆనందిస్తుండవచ్చు (ఇండియా నౌక మీద డ్రోన్ దాడి జరిగిన నేపథ్యంలో). అదే సమయంలో, తనను తాను గొప్ప శక్తిగా ప్రదర్శించుకుంటున్నప్పటికీ, పెద్దగా ఏమీ చేయలేని దాని పరిమితులు కూడా మనకు తెలుస్తున్నాయి.

– యూసఫ్ ఉంర్యూవాలా, జర్నలిస్ట్

అమ్మ వంటే!



ఈ మధ్య నేను ప్రతిరోజూ తింటున్న భోజనం అమ్మ వండినదే ఉండేట్టుగా చూసుకుంటున్నా. రెస్టారెంట్లు లేవు, ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇవ్వడం లేదు.

– ఓన్యేయా నువేల్యూ, నైజీరియా రచయిత

ఇన్ బాక్స్

అక్షింతలతో ఆహ్వానం!

అయోధ్యలో భవ్యమైన శ్రీరాముడి మందిర నిర్మాణం పూర్తి చేసుకొని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం సిద్ధమవుతోంది. 2019 నవంబర్ 9న చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా అయోధ్య 'రామ జన్మభూమి' విషయంలో సుప్రీం కోర్టులో రామభక్తులు విజయం సాధించారు. తదనంతరం అయోధ్యలో రాముల వారి మందిర నిర్మాణానికి 'శ్రీరామ క్షేత్ర తీర్థ ట్రస్ట్' సంకల్పించింది. ప్రస్తుతం రాముల వారి మందిర నిర్మాణం చివరి దశకు చేరుకుంది. విగ్రహ ప్రతిష్ఠ రోజున అందరూ సమీపంలో ఉన్న ఏ హిందూ దేవాలయానికైనా వెళ్లి పూజలు నిర్వహించి పండుగ చేసుకోవాలని... ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు అందించి ఆహ్వానం పలకాలని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. భద్రత, ఇతర కారణాల దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి జనవరి 22న ఎవరూ అయోధ్యకు రామదర్శనానికి రావద్దనీ, ఆ మరుసటి రోజు నుంచీ రావాలనీ ట్రస్ట్ ఆహ్వానం పలుకుతోంది.

అయోధ్య శ్రీరాముల వారి సన్నిధానంలోంచి అత్యంత భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చిన పవిత్రమైన అక్షింతలను ఇంటింటికీ అందించేందుకు సర్వం సిద్ధమయ్యింది. 'విస్తృత జనసంపర్క్ అభియాన్' పేరుతో 2024 జనవరి ఒకటి నుంచి 15 వరకు ప్రతి ఇంటికి వెళ్లి 'నివేదన' అనే కరపత్రం, అక్షింతలు అందజేసి రాముల వారి దర్శన నిమిత్తం అయోధ్యకు ఆహ్వానం పలికేందుకు రామభక్తులు సిద్ధమయ్యారు. గ్రామాల్లోని ప్రతి దేవాలయాన్ని అందంగా అలంకరించి కూడళ్ళు, చౌరస్తాలు, రద్దీ ప్రాంతాలలో కాషాయ జెండాలతో తోరణాలు కట్టి అందంగా ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్నారు రామ భక్తులు.

రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన రోజున సూర్యాస్తమయం తర్వాత, ప్రమిదలతో దీపాలంకరణ చేసి, దీపావళి మాదిరి సంబరాలు చేసుకుంటారు. అన్నప్రసాదాలు, పూలు, పండ్లు, మిఠాయిలు పంచి ఆబాల గోపాలం ఆనందంగా గడిపేలా కార్యక్రమం సిద్ధమవుతోంది. ప్రతి హిందువు ఈ కార్యంలో భాగస్వామి కావాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సాదరంగా ఆహ్వానిస్తోంది. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు అందుకొని రాముడిని తలుచుకుంటూ పూజలు నిర్వహించాలని కోరుతోంది.

– పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్, తెలంగాణ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

సంపూర్ణ స్వరాజ్య స్ఫూర్తికి శతవసంతాలు

1923 డిసెంబర్ 28, 29 తేదీలలో 38వ భారత జాతీయ కాంగ్రెస్ మహా సభలు అప్పటి బ్రిటిషర్లు 'కోకనాడ'గా పిలుచుకునే కాకినాడ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ప్రధాన సభలు రెండు రోజుల పాటు జరిగినా, మరో మూడు రోజులపాటు అనుబంధ సంస్థల సమావేశాలు ఇదే ప్రాంగణంలో జరిగాయి. 1916లో జరిగిన ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో జాతీయ మహాసభలు ఈ ప్రాంతంలో నిర్వహించేందుకు అనుమతి నివ్వవలసిందిగా జాతీయ కమిటీకి విజ్ఞప్తి చేశారు. 1922లో గయ (బిహార్)లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలలో ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ వారి అభ్యర్థనను ఆమోదించారు.

దేశభక్త కొండా వేంకటప్పయ్య అధ్యక్షులుగా, కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, దువ్వూరి సుబ్బమ్మ ప్రభృతులు ఉపాధ్యక్షులుగా, బులుసు సాంబమూర్తి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మరో ఆరుగురు ప్రధాన కార్యదర్శులుగా, లక్కరాజు సుబ్బారావు, పైడా వేంకటచలపతి కోశాధికారులుగా, మరి కొందరు సాధారణ సభ్యులుగా మొత్తం 4,181 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది.

కాకినాడ పట్టణానికి పడమర భాగంలో ఎల్విన్ పేటకు చెందిన 120 ఎకరాల ప్రదేశాన్ని 'గాంధీనగరం'గా నామకరణం చేసి సభాస్థలంగా ఎంపిక చేశారు. 150 మంది మహిళలతో పాటు మొత్తం 1,500 మంది వలంటీర్లు సేవలందించారు.

జిల్లా కలెక్టర్ బ్రాకెన్ దొర కాకినాడలో జాతీయ కాంగ్రెస్ సభలు జరగకుండా నిరోధించడానికి ఎన్నో అడ్డంకులు సృష్టించాడు. బ్రిటిష్ ప్రభుత్వంతో శత్రుత్వం పెట్టుకోవద్దనీ, వర్తకుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామనీ హెచ్చరించాడు. ఆహ్వాన సంఘం సమావేశానికి హాజరైనా, విరాళాలిచ్చినా రైతుల పంట పొలాలకు నీటి సరఫరా బంద్ చేస్తామన్నారు. అయినప్పటికీ కలెక్టర్ బెదిరింపులనెవరూ ఖాతరు చెయ్యలేదు. ఫలితంగా తమ పొలాలకు నీరు అందక ఎంతో మంది రైతులు నష్టపోయారు. అలీ సోదరుల్లో ఒకరైన మౌలానా మహమ్మద్ అలీ ఈ సభలకు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 28 మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఆయన అధ్యక్షోపన్యాసం సుదీర్ఘంగా నాలుగు గంటలపాటు సాగింది. గాంధీజీ ఎరవాడ జైలులో ఉన్నందు వల్ల ఆయన హాజరు కాలేదు. గాంధీజీ సతీమణి కస్తూర్బాగాంధీ హాజరయ్యారు.

కాకినాడ కాంగ్రెస్ సభలకెన్నో ప్రత్యేకతలున్నాయి. హిందూ– ముస్లిం సమైక్యతకు ఎంతో ప్రాధాన్యమిచ్చింది. మహమ్మద్ అలీతో బాటు ఆయన సోదరుడు షౌకత్ ఆలీ, తల్లి బీ అమ్మ కూడా పాల్గొన్నారు. స్వాగత ఊరేగింపులో నమాజు సమయం ఆసన్నమైనప్పుడు శ్రోత్రియ బ్రాహ్మణుడైన కాశీభట్ల



కాంగ్రెస్ సేవాదళ్ మొదటి అధ్యక్షుడు నెహ్రూతో కార్యకర్తలు

సుబ్రహ్మణ్య శాస్త్రి ఆహ్వానించి నమాజుకు అవకాశమిచ్చారు. అలాగే టౌన్‌హాల్ ఎదురుగా గల సీతా రామాలయంలో పురోహితుడు బొట్టుపెట్టి హారతినిచ్చారు. సభ జరుగుతుండగా అల్లూరి సీతారామ రాజు మారువేషంలో వచ్చి 'వందేమాతరం' అంటూ బిగ్గరగా అరుచుకుంటూ జనసమూహంలో కలిసిపోయి అదృశ్యమయ్యారని చెబుతారు.

మహాసభల ప్రాంగణంలో 120 దుకాణాలతో వస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. సందర్శకులకు పావలా (25 పైసలు) ప్రవేశ రుసుముగా నిర్ణయించబడింది. ప్రవేశద్వారం వద్ద టికెట్ తీసుకుని లోనికి అనుమతించే బాధ్యతను దుర్గాబాయ్ (దేశ్‌ముఖ్)కు అప్పగించారు. అప్పటికి ఆమె వయసు పద్నాలుగేళ్ళు మాత్రమే. ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొండా వేంకటప్పయ్య, మరికొందరు సభ్యులతో బాటు నెహ్రూ కూడా ఎగ్జిబిషన్ సందర్శనకు విచ్చేశారు. నెహ్రూ దగ్గర టికెట్ లేని కారణంగా దుర్గాబాయ్ ఆయనను అడ్డగించింది. వెంటనే వేంకటప్పయ్య జోక్యం చేసుకుని, 'ఆయన ఎవరనుకున్నావ్? నెహ్రూ గారు. జాతీయ కాంగ్రెస్‌కు ప్రముఖ నాయకులు' అంటూ ఆమెను మందలించబోయారు. అప్పుడు నెహ్రూ 'ఆమె తనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వహించింది. ఇలాంటి అంకితభావం గల వారే నేడు దేశ స్వాతంత్ర్యానికి అవసరం. భవిష్యత్తులో ఈమె గొప్ప నాయకురాలు అవుతుంది' అంటూ ఆశీర్వదించారు.

అప్పటివరకు 'సంపూర్ణ స్వరాజ్యం' భావన పట్ల కాంగ్రెస్ నేతలలో స్పష్టమైన అభిప్రాయం లేదు. అయితే అంతకు ముందు జరిగిన గోదావరి జిల్లా కాంగ్రెస్‌లో బులుసు సాంబమూర్తి ఈ అంశాన్ని ప్రతిపాదించారు. డిసెంబర్‌లో జరిగే జాతీయ సభలో చర్చించాలని తలపెట్టారు. డిసెంబర్ 30న దీనిపై చర్చ జరిగింది. ఆ విధంగా సంపూర్ణ స్వాతంత్ర్యం అనే మహోన్నత ఆశయానికి కాకినాడ కాంగ్రెస్‌లో పునాది పడి, ఆరేళ్ళ తర్వాత 1929లో లాహోర్ (ప్రస్తుతం పాకిస్తాన్) సమావేశంలో ఆమోదం లభించింది. 'కాంగ్రెస్ సేవాదళం' విభాగానికి కూడా కాకినాడ కాంగ్రెస్ మహాసభల్లోనే బీజం పడింది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

మహనీయులు నడిచిన నేలపై వందేళ్ల తరువాత కాకినాడ వాసులు శతాబ్ది వేడుకలు నిర్వహించుకుంటున్నారు. అలనాటి మధుర స్మృతులు నెమరువేసుకుంటున్నారు. రాబోయే తరాల వారికి ఈ వారసత్వాన్ని కొనసాగించడానికి మనమంతా కృషి చేయవలసిన తరుణమిది.

– ప్రొఫెసర్ ఐ. దోసగిరిరావు, స్పెషల్ ఆఫీసర్ (రిటైర్డ్), ఆంధ్రా యూనివర్సిటీ కేంపస్, కాకినాడ
('కాకినాడ జాతీయ కాంగ్రెస్ సభల'కు నేటితో వందేళ్లు)

హరి నామం

'... హరి నామములే అన్ని మంత్రములు, హరి హరి హరి హరి హరియనవో మనసా!' అని పరవశించి పాడాడు పద కవితా పితామహుడు. పురుషార్థాలన్నిటి సాధనకు హరినామ స్మరణమే ఉత్తమ సాధనం అని ఎందరో ఇతర భక్తాగ్రేసరులు కూడా బోధించారు. **'హరియను రెండక్షరములు/హరియించును పాతకములు, అంబుజనాభా!/ హరి! నీనామ మహత్వము,/ హరిహరి! పొగడంగతరమె, హరి, శ్రీకృష్ణా!'** అని స్తుతిస్తుంది కృష్ణశతకం. భగవన్నామాలూ, పౌరాణిక నామాలూ వ్యుత్పత్తి అర్థాలు లేకుండా ఉండవు. హరి అన్నా, హరుడన్నా, సీతా–గౌరీ– వాగీశ్వరీ అన్నా, ఆ మాటలు ఆయా దేవతల లక్షణాలను సూచించే మాటలే గానీ ఊరికే రెండు మూడు అక్షరాలు యాదృచ్ఛికంగా కలిపేసి ఏర్పరచిన పేర్లు కావు.

జ్యోతిర్మయం

నిఘంటువు హరి అనే పదానికి ముఖ్యంగా రెండు అర్థాలను చూపిస్తుంది. ఒకటి హరి వర్ణం లేక హరిత వర్ణం. రెండవ అర్థం హరించే వాడు, తీసుకొనే వాడు, స్వీకరించే వాడు, మోసుకెళ్ళే వాడు అని. ఈ రెండో అర్థంలో హరి అనే పేరు భక్తుల పాపాలనూ, హృదయాలనూ హరించగల శివ కేశవులకు ఇద్దరికీ వర్తిస్తుంది. ప్రాణాలను హరించే యముడికీ, సౌరభాలను మోసుకెళ్ళే వాయుదేవుడికీ, వస్తువులు ఎత్తుకు పోయే కోతికీ, రౌతులను మోసుకు వెళ్ళే గుర్రానికీ కూడా వర్తిస్తుంది.

హరి అంటే ఆకుపచ్చ రంగు. అంటే నీలం, పసుపూ కలిసిన రంగు. ఒక విధమైన నిగనిగ కల ముదురు దేహచ్ఛాయను కూడా 'హరి' వర్ణం, 'శ్యామ' వర్ణం అంటారు. (తెల్లని వాడు అంటే కాగితంలా తెల్లని వాడు కానట్టే, హరి వర్ణుడూ అంటే లేత ఆకులాంటి ఆకుపచ్చదనంతో ఉండేవాడని కాదు.)

మరెవరో చెప్పడం కాదు, హరిని 'హరి' అని ఎందుకంటారో శ్రీకృష్ణుడే స్వయంగా చెప్పాడు, మహాభారతం శాంతి పర్వంలో. 'నేను నన్ను స్మరించే భక్తుల పాపాన్ని హరిస్తాను. యజ్ఞాలలో హవిర్భాగాన్ని స్వీకరించి తీసుకువెళ్తాను. అంతే కాదు, నా దేహవర్ణం శ్యామ వర్ణం లేక హరి వర్ణం కావడం వల్ల కూడా, నేను హరి అనే నామంతో పిలవబడుతున్నాను' అన్నాడు. సమూలంగా సంసార బంధనాలను హరించేవాడు కనక హరి అని విష్ణు సహస్ర నామాలలో వచ్చే 'హరి'నామానికి ఆదిశంకరుల వ్యాఖ్యానం.

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.విదియ పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** పునర్వసు రా.12.34 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.11.50 నుండి 1.30 వరకు, **దుర్ముహూర్తం:** ప.10.11 నుండి 10.59 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు, **అమృత ఘడియలు:** రా.10.07 నుండి 11.47 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.33, **సూర్యాస్తమయం:** 5.30.

సమన్యాయం అందించే పార్టీనే అధికారంలోకి రావాలి

1,186వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు



తాడికొండ: అన్ని ప్రాంతాలకు, వర్గాలకు సమన్యాయం అందించే ప్రభుత్వాలే అధికారంలోకి రావాలని లేకుంటే బహుజనుల భవిష్యత్తు అంధకారమయమవు తుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులకు బాబు తీరని ద్రోహం చేశాడని చెప్పారు. వెన్నుపోటు రాజకీయాలకు అలవాటు పడిన చంద్రబాబు ఎన్నికల ముందు పేదలను మోసగించేందుకు అనేక తప్పుడు హామీలు ఇస్తారని తెలిపారు. ఎన్నికల అనంతరం తన సామాజిక వర్గానికి దోచిపెట్టినందువల్లే నేడు బహుజనులు 30ఏళ్ల వెనక్కు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 35 లక్షల ఇళ్ల స్థలాలు, 25 లక్షల ఇళ్లు నిర్మించుకుని రాష్ట్రంలో పేదలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. బహుజనులకు సీఎం జగన్ రాజధాని ప్రాంతంలో 54వేల ఇళ్ల పట్టాలు ఇస్తే.. తప్పుడు కేసులతో దాన్ని అడ్డుకున్నవారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, పులిదాసు, పల్లెబాబు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

గజరాజుల మృత్యుఘోష



దేశంలో పెరిగిపోతున్న గజరాజుల అసహజ మరణాలు

- ఐదేళ్లలో 522 ఏనుగుల దుర్మరణం
- విద్యుదాఘాతంతో 379 ఏనుగుల మృత్యువాత
- రైలు ప్రమాదాల్లో 75 మృతి
- వేటగాళ్ల వలలో చిక్కి 47 గజరాజుల మరణం
- విష ప్రయోగం ద్వారా 21 ఏనుగుల హతం

సాక్షి, అమరావతి: దేశంలో గజరాజుల మరణాలు ఇటీవల పెరిగాయి. విద్యుదాఘాతం, రైళ్లు ఢీకొనడం వంటి కారణాలతో పెద్ద ఎత్తున ఏనుగులు మరణిస్తున్నాయి. వీటికితోడు వేటాడటం, విష ప్రయోగం వంటి కారణాల వల్ల ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 522 ఏనుగులు మృత్యువాత పడ్డాయని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ రాజ్యసభలో ఇటీవల వెల్లడించింది. విద్యుదాఘాతాల కారణంగా ఐదేళ్లలో (2018–19 నుంచి 2022–23 వరకు) అత్యధికంగా 379 ఏనుగులు మృతి చెందినట్టు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆ తరువాత రైలు ప్రమాదాల బారినపడి ఐదేళ్లలో 75 ఏనుగులు మరణించాయి. వేటాడటం ద్వారా 47 గజరాజులను చంపేశారు. దంతాల కోసం విష ప్రయోగం చేసి 21 ఏనుగులను హతమార్చినట్టు కేంద్ర మంత్రిత్వ శాఖ వివరించింది.

విద్యుత్ కంచెలతోనే తీవ్ర సమస్య

విద్యుదాఘాతంతో అత్యధికంగా ఒడిశాలో ఐదేళ్లలో 80 ఏనుగులు, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లో ఒక్కొక్కచోట 53 చొప్పున ఏనుగులు మృతి చెందాయి. రైళ్లు ఢీకొట్టిన ఘటనల్లో అత్యధికంగా అసోంలో 24 ఏనుగులు మృత్యువాత పడ్డాయి. ఒడిశాలో 18 ఏనుగులను రైలు ప్రమాదాలు పొట్టనపెట్టుకున్నాయి. వేటాడటం ద్వారా ఒడిశాలో అత్యధికంగా 15 ఏనుగులను హతమార్చారు. మేఘాలయలో 15 ఏనుగులను చంపేశారు. అసోంలో విషప్రయోగంతో ఏకంగా 17 ఏనుగులను హతమార్చారు. అలాంటి వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తెలిపింది. అటవీ ప్రాంత సమీప పొలాల్లో పంటల్ని కాపాడుకునేందుకు విద్యుత్ కంచెల్ని ఏర్పాటు చేస్తుండటంతో విద్యుదాఘాతానికి గురై ఏనుగులు మృత్యువాత పడుతున్నాయి.

రైల్వేతో సమన్వయ కమిటీ

రైలు ప్రమాదాల్లో ఏనుగుల మరణాల నివారణకు రైల్వే మంత్రిత్వ శాఖ, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలతో శాశ్వత సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. రైళ్లు నడిపే పైలట్లకు స్పష్టమైన వీక్షణను అందించడానికి రైల్వే ట్రాక్‌ల వెంట వృక్ష సంపదను తొలగించడం, ఏనుగుల ఉనికి గురించి పైలట్లను హెచ్చరించడానికి తగిన పాయింట్ల వద్ద సూచిక బోర్డులను ఉపయోగించడం, రైల్వే ట్రాక్‌ల ఎలివేటెడ్ విభాగాలను ఆధునికీకరించడం, ఏనుగుల సురక్షిత మార్గం కోసం అండర్ పాస్, ఓవర్ పాస్‌లను ఏర్పాటు చేయడం, అటవీ శాఖ ఫ్రంట్‌లైన్ సిబ్బంది, వన్యప్రాణుల పరిశీలకులు రైల్వే ట్రాక్‌లపై రెగ్యులర్ పెట్రోలింగ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

2018-19 నుంచి 2022-23 వరకు వివిధ రాష్ట్రాల్లో ఏనుగుల అసహజ మరణాలిలా..!

రాష్ట్రం	విద్యుత్ ప్రమాదాలు	రైలు ప్రమాదాలు	వేటాడటం	విష ప్రయోగం
ఆంధ్రప్రదేశ్	13	-	-	-
అరుణాచల్‌ప్రదేశ్	1	-	-	-
అసోం	53	24	2	17
ఛత్తీస్‌గఢ్	28	-	-	2
ఝార్ఖండ్	21	3	2	-
కర్ణాటక	48	4	-	-
కేరళ	25	6	2	1
మేఘాలయ	7	-	15	-
నాగాలాండ్	8	-	2	-
ఒడిశా	80	18	16	-
తమిళనాడు	53	4	7	-
ఉత్తరప్రదేశ్	8	-	-	-
ఉత్తరాఖండ్	8	4	1	-
పశ్చిమ బెంగాల్	26	12	-	1
మొత్తం	379	75	47	21

కేంద్రం చేసిన సూచనలివి!

- విద్యుదాఘాతాల నుంచి ఏనుగులు, ఇతర వన్యప్రాణులను రక్షించేందుకు అక్రమంగా వేసిన విద్యుత్ కంచెల్ని తొలగించాల్సిందిగా అన్ని రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ట్రాన్స్‌మిషన్ ఏజెన్సీలకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.
- భూమిపై విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్రాలకు సూచించింది. అండర్ గ్రౌండ్ లేదా పోల్స్‌పై మాత్రమే విద్యుత్ లైన్లు ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.
- 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' కేంద్ర ప్రాయోజిత పథకం కింద ఏనుగుల పరిరక్షణ, వాటి ఆవాసాల్లో చర్యలకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని రాష్ట్రాలకు అందిస్తోంది.
- 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' కేంద్ర ప్రాయోజిత పథకం కింద ఏనుగుల పరిరక్షణ, వాటి ఆవాసాల్లో చర్యలకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని రాష్ట్రాలకు అందిస్తోంది.
- ఏనుగుల కదలికలను పర్యవేక్షించడానికి స్థానిక సంఘాలతో ట్రాకర్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మానవుల వల్ల నష్టాన్ని నివారించడానికి స్థానిక ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తోంది.
- మానవ–వన్యప్రాణుల సంఘర్షణల హాట్ స్పాట్‌లను గుర్తించడంతోపాటు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించింది.
- అడవి జంతువులకు రుచించని పంటల్ని వేయాల్సిందిగా సూచనలు జారీ చేసింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఆరుగురు ఏపీ వాసుల దుర్మరణం

మృతుల్లో ఐదుగురు ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పినతండ్రి కుటుంబ సభ్యులు



పొన్నాడ నాగేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతులు(ఫైల్)

అమలాపురం టౌన్: అమెరికాలోని టెక్సాస్‌లో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన ఐదుగురు, విశాఖకు చెందిన మరో వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఇందులో మృతుడు నాగేశ్వరరావు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు స్వయాన పినతండ్రి. నాగేశ్వరరావు(65)తో పాటు ఆయన భార్య సీతామహాలక్ష్మి(60) కుమార్తె పోతాబత్తుల నవీనగంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిధ(9)తో పాటు నాగేశ్వరరావు అల్లుడైన పోతాబత్తుల లోకేశ్ స్నేహితుడు బత్రి రిషీల్(28) మృత్యువాతపడ్డారు. పోతాబత్తుల లోకేశ్ తీవ్రంగా గాయపడి అక్కడే ఓ ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. టెక్సాస్ జాతీయ రహదారిపై నాగేశ్వరరావు కుటుంబం కారులో వెళుతున్నారు. పక్కనే వస్తున్న ట్రక్కు కారును బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని టెక్సాస్‌లోని ఓ న్యూస్ చానల్ ప్రకటించింది. ట్రక్కులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కూడా మరణించినట్టు పేర్కొంది. అమలాపురంలో పొన్నాడ నాగేశ్వరరావు టింబర్ డిపో వ్యాపారిగా కోనసీమలో గత మూడున్నర దశాబ్దాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె నవీన గంగ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. రెండు నెలల కిందట అమలాపురం వచ్చిన నవీన గంగ తిరిగి ఆ దేశానికి వెళుతూ తన తండ్రి నాగేశ్వరరావు, తల్లి సీతామహాలక్ష్మిని వెంట తీసుకుని వెళ్లింది. అమెరికాలో కూతురు ఇంటికి నాగేశ్వరరావు దంపతులు ఎంతో ఆనందంగా వెళ్లారు. గత రెండు నెలలుగా కూతురు, అల్లుడు, మనమళ్లతో నాగేశ్వరరావు దంపతులు సరదాగా గడుపుతున్నారు. మంగళవారం సాయంత్రం ఓ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లే సమయంలో వారిని మృత్యువు కబళించింది.

ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఇంట విషాదం

నాగేశ్వరరావు కుటుంబం అమెరికా రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిందన్న వార్తతో అమలాపురంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఇంట్లో విషాదం అలుముకుంది. ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను ఓదార్చారు.

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు



మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దొరబాబు, చిత్రంలో ఎండీ జి.లక్ష్మీశా

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. బుధవారం చైర్మన్ దొరబాబు అధ్యక్షతన 34వ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే 6.30 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వైఎస్సార్, జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు నీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయిన్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 5,684 కాలనీలకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎండీ జి.లక్ష్మీశా మాట్లాడుతూ ఈ పథకం కింద 17 వేల కొత్త పంచాయతీలు రూపొందుతున్నాయన్నారు. ఈ సమావేశానికి బోర్డు డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. జేఎండీ శివప్రసాద్, ఈడీ చంద్రశేఖర్, సీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం


స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధిష్టానం వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచే పోటీ చేస్తానని.. పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. 'వై నాట్ 175' కోసమే సీఎం జగన్ అభ్యర్థుల మార్పులు, చేర్పులు చేస్తున్నారన్నారు. తన స్థానంలో మార్పులు ఏమున్నా తనకు అభ్యంతరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయాలని సీఎం జగన్ ఆదేశిస్తే పోటీ చేస్తానన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల్ని మార్చుకుంటే తప్పేంటని.. వైఎస్సార్‌సీపీలో సవాలక్ష మార్పులు జరిగితే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, లోకేశ్‌లకు నొప్పేంటని ఆమె ప్రశ్నించారు. మోదీతో మొదలుకుని చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ పోటీచేసే స్థానాలకు ఎలా వచ్చారని, గతంలో ఎన్టీఆర్ మహబూబ్‌నగర్‌లో పోటీ చేయలేదా అని ప్రశ్నించారు. చంద్రగిరి నుంచి కుప్పం వచ్చిన చంద్రబాబు తమ పార్టీ అభ్యర్థుల మార్పుపై మాట్లాడటానికి సిగ్గుండాలన్నారు. ఒక ఇంట్లో వ్యవహారంతో మనకేం పని, ముందు చంద్రబాబు తన ఇంటిని చక్కబెట్టుకోవాలని హితవు పలికారు.

సీఎం జగన్ ఆదేశాలను తప్పక పాటిస్తా

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో తనకు సీటు ఇవ్వడం లేదంటూ.. తనను మారుస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పు, చేర్పులు ఎన్నికల కసరత్తులో ఒక భాగమని ధర్మశ్రీ పేర్కొన్నారు. తిరిగి గెలిచేందుకే సీఎం జగన్ మార్పులు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. సీఎం జగన్ ఆదేశాలను తప్పక పాటిస్తానని తెలిపారు. 'చోడవరం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం కాబట్టి రైతులకు చెల్లించాల్సిన సొమ్ముల అంశంపై సీఎంవోకు వచ్చాను. రూ.12.5 కోట్లు విడుదల చేయాలని సీఎం జగన్ ఇప్పటికే ఆదేశాలిచ్చారు. కేవలం నిధుల విడుదల కోసమే సీఎంవోకి వచ్చాను తప్ప విజయవాడలో నాకు మరో పనిలేదు. నా సీటులో ఎలాంటి మార్పు ఉండదని భావిస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో సీఎం ఎక్కడి నుంచి పోటీ చేయమన్నా చేస్తాను. ఏదైనా కారణంతో వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కొందరు నాయకులు స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ అటు ఇటూ వెళ్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు' అని ధర్మశ్రీ పేర్కొన్నారు. తాను మొదటి నుంచీ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతోనే ఉన్నానని.. ఇకపైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని స్పష్టం చేశారు.

వెహికిల్స్‌కు నో ఎంట్రీ.. ఎందుకంటే ఇది...

కిస్సింగ్ బ్రిడ్జి

వియత్నాంలో నిర్మాణం ● పర్యాటకుల విశేషాదరణ



వియత్నాంలో అది అనగనగా ఓ వంతెన. కానీ దాన్ని కట్టింది అన్ని వంతెనల మాదిరిగా అటూ ఇటూ దాటడానికి కాదు. ముద్దులు పెట్టుకోవడానికి! అవును. వినడానికే విచిత్రంగా ఉంది కదూ! దక్షిణ వియత్నాంలోని ఫూక్వోక్ ద్వీపం అందమైన బీచ్‌లకు ప్రసిద్ధి. అక్కడి సన్‌సెట్ సిటీలో ఇటీవల నిర్మించిన 800 మీటర్ల పై చిలుకు పొడవైన బ్రిడ్జి అందరినీ ఎంతగానో అలరిస్తోంది. ఇది ముద్దుల బ్రిడ్జి కావడమే ఇందుకు కారణం. దీని డిజైన్‌ను ఇటలీకి చెందిన ఆర్కిటెక్ట్ మార్కో కాసామోంటీ రూపొందించాడు. లగ్జరీ టూరిజం డెవలపర్ సంస్థ సన్ గ్రూప్ నిర్మించింది. ఆడమ్ సృష్టికి సంబంధించి ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు మైకేలాంజిలో సిస్టిన్ చాపెల్‌లో సృజించిన ఫ్రెస్కో పెయింటింగ్ స్ఫూర్తితో దీని డిజైన్‌కు రూపకల్పన చేశారు. రెండు సగాలుగా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఆ పెయింటింగ్‌లోని రెండు చూపుడు వేళ్ల మాదిరిగానే బ్రిడ్జి తాలూకు రెండు సగాలు కూడా పరస్పరం తాకవు. వాటి మధ్య 30 సెంటీమీటర్ల దూరముంటుంది. దూరం నుంచి చూస్తే ఆ రెండు కొనలూ ఒకదాన్నొకటి చుంబించుకుంటున్నట్టుగానే ఉండటం మరో విశేషం! ముద్దులాడాలనుకునే జంటలో ఒకరు ఆ సగం నుంచి, మరొకరు ఈ సగం మీద నుంచుని వీలైనంతగా ముందుకు వంగాలన్నమాట! ఆ మీదట పెదాలకు పని చెబుతూ తమ ప్రేమను వ్యక్తపరుచుకోవచ్చు. పెళ్లికి ప్రపోజ్ చేసుకోవచ్చు. ఈ బ్రిడ్జి పేరు చౌ హోన్. దాని అర్థం కూడా 'పెళ్లికి ప్రపోజ్ చేసుకోవడం' కావడం మరో విశేషం. వారం క్రితం ప్రారంభించిన ఈ బ్రిడ్జి చూస్తుండగానే ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారింది. దాన్ని చూడటానికి, చెరోవైపు నుంచి రొమాంటిక్‌గా ముద్దులాడటానికి జంటలు భారీగా వస్తున్నాయట!

- సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'

- తూర్పు నుంచి పశ్చిమ భారతదేశానికి బస్సుయాత్ర, పాదయాత్ర
- జనవరి 14న ప్రారంభం
- మణిపూర్‌లో శ్రీకారం.. మార్చి 20న ముంబైలో ముగింపు
- 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల్లో 6,200 కిలోమీటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరో సుదీర్ఘయాత్రకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నూతన జవసత్వాలు అందించే దిశగా రెండో విడత యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. 'భారత్ న్యాయ యాత్ర' పేరిట తూర్పున మణిపూర్ నుంచి పశ్చిమాన మహారాష్ట్ర వరకు పాదయాత్ర జరుగనుందని కాంగ్రెస్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వచ్చే ఏడాది జనవరి 14న మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ప్రారంభం కానున్న ఈ యాత్ర 67 రోజుల పాటు కొనసాగి, మార్చి 20వ తేదీన మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగుస్తుంది. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని అందించడమే ధ్యేయంగా రాహుల్ గాంధీ భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తెలిపారు. ఈ యాత్రను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇంఫాల్‌లో జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం షెడ్యూల్ ఖరారు చేసింది. రెండో విడత యాత్ర చేపట్టాలని రాహుల్ గాంధీని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ నెల 21న ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన సంగతి తెలిసిందే.

చాలావరకు బస్సు యాత్ర.. అవసరమైన చోట పాదయాత్ర

రాహుల్ గాంధీ తన తొలి విడత భారత్ జోడో యాత్రను 2022 సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభించారు. 12 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల గుండా 136 రోజులపాటు 3,970 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఈ ఏడాది జనవరి 30న జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో యాత్ర ముగిసింది. మొదటి యాత్రకు కొంత భిన్నంగా చాలావరకు బస్సు ద్వారా భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నప్పటికీ, అవసరమైన చోట పాదయాత్ర సైతం ఉంటుందని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ యాత్ర 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల మీదుగా మొత్తం 6,200 కిలోమీటర్ల మేర సాగనుంది. మణిపూర్‌లో ప్రారంభమై నాగాలాండ్, అస్సాం, మేఘాలయా, పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలో ముగియనుంది. భారత్ జోడోయాత్ర 136 రోజులపాటు 3,970 కిలోమీటర్లు జరిగింది. భారత్ న్యాయ యాత్ర 67 రోజుల్లోనే 6,200 కిలోమీటర్లు సాగనుంది.

ఈశాన్య రాష్ట్రాల ప్రజల గాయాలు మాన్పాలన్నదే ఆకాంక్ష

ఇటీవల నెలల తరబడి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్న మణిపూర్ నుంచి యాత్రను ప్రారంభిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందన్న సందేశాన్ని ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ పెద్దల ఉద్దేశమని తెలుస్తోంది. ఈశాన్య రాష్ట్రాల ప్రజల గాయాలను మాన్పాలన్నదే తమ ఆకాంక్ష అని కాంగ్రెస్ అగ్రనేత కె.సి.వేణుగోపాల్ వివరించారు. యాత్ర సందర్భంగా 12 బహిరంగ సభల్లో రాహుల్ ప్రసంగిస్తారు. 100కుపైగా స్ట్రీట్-కార్నర్ సమావేశాలు ఉంటాయి. 13 ప్రెస్ కాన్ఫరెన్స్‌లు సైతం నిర్వహిస్తారు. మహిళలు, యువతతోపాటు అణగారిన వర్గాల ప్రజలతో ముఖాముఖి భేటీ అవుతారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న మహారాష్ట్రలోని నాగపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఈ సభకు హమ్ తయ్యార్ హై(మేము సిద్ధంగా ఉన్నాం) అని నామకరణం చేసినట్లు పేర్కొన్నారు.



రెజ్లర్ బజరంగ్ పూనియాతో సరదాగా కుస్తీ పడుతున్న రాహుల్

అఖాడాలో ఒక రోజు...

- రెజ్లర్లతో గడిపిన రాహుల్
- బజరంగ్‌తో సరదా కుస్తీ

చండీగఢ్: అది హరియాణాలోని జజ్జర్ జిల్లా ఛర్రా గ్రామంలోని వీరేంద్ర అఖాడా. ఉదయం ఆరు గంటల సమయం. ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పూనియా తదితర రెజ్లర్లంతా సాధనలో మునిగిపోయారు. చలి వణికిస్తున్న ఆ సమయంలో విచ్చేసిన ఓ అనుకోని అతిథి వారందరినీ ఆశ్చర్యపరిచారు! తనతో కుస్తీ పట్టాల్సిందిగా బజరంగ్‌ను సవాల్ చేశారు. తన కుస్తీ నైపుణ్యంతో అతడిని, ఇతర రెజ్లర్లను ఆశ్చర్యపరిచిన ఆ అతిథి మరెవరో కాదు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ! ఆకస్మిక యాత్రలకు పెట్టింది పేరైన రాహుల్‌గాంధీ ఈసారి రెజ్లర్ల కార్యస్థలి అయిన 'అఖాడా'ను సందర్శించారు. బుధవారం ఉదయం ఆరింటికి అఖాడాకు వెళ్లిన ఆయన బజరంగ్ పూనియా, దీపక్ పూనియా తదితర రెజ్లర్లతో కాసేపు సరదాగా గడిపారు. బజరంగ్‌తో సరదాగా కుస్తీ పట్టారు. తనతో బజరంగ్ కుస్తీ పడుతున్న, అతని చేతుల్లో తాను మట్టి కరుస్తున్న ఫొటోలను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''ఇప్పుడు మనందరి ముందున్నది ఒకే ఒక్క ప్రశ్న. ఈ ఆటగాళ్లంతా మన దేశ పుత్రులు, పుత్రికలు. కానీ రింగ్‌లో పోటీ పడాల్సిన వాళ్లు వీధులకెక్కి తమ హక్కుల కోసం, న్యాయం కోసం పోరాడుతున్నారు. ఇదంతా చూశాక ఎవరైనా తమ పిల్లలను రెజ్లింగ్ లాంటి క్రీడల్లో ఎలా ప్రోత్సహిస్తారు?. ఈ క్రీడాకారిణులంతా రైతు కుటుంబాల నుంచి వచ్చిన ముక్కుసూటి అమాయక మనుషులు. వారి గౌరవమర్యాదలను వారికి దక్కనిద్దాం. సగర్వంగా దేశానికే సేవ చేయనిద్దాం'' అని ట్వీట్‌చేశారు. లైంగిక వేధింపుల ఉదంతంపై పలువురు మహిళా రెజ్లర్లు చాలా రోజులుగా రెజ్లింగ్ ఫెడరేషన్‌తో పోరాడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని రాహుల్ కలిశారు.

బాగా కుస్తీ పట్టారు: బజరంగ్

రెజ్లర్ల రోజువారీ రొటీన్ ఎలా ఉంటుందో స్వయంగా చూసేందుకు రాహుల్ ఆకస్మికంగా తమ అఖాడాకు వచ్చారని దీపక్ పూనియా చెప్పారు. ''రాహుల్ నాతో బాగా కుస్తీ పట్టారు. రెజ్లింగ్‌పై ఆయనకున్న అవగాహన మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. పలు రెజ్లింగ్ టెక్నిక్‌లు ఆయనకు తెలుసు'' అని బజరంగ్ చెప్పారు. వారిద్దరూ వీరేంద్ర అఖాడాలో రెజ్లింగ్‌లో ఓనమాలు దిద్దుకున్నారు.

సజ్జ రొట్టెలు తిన్నారు

అఖాడాలో రాహుల్ రెండు గంటలకుపైగా గడిపారని స్థానిక కాంగ్రెస్ చెప్పారు. ''ఆటగాళ్లతో కలిసి రాహుల్ సజ్జ రొట్టెలు, ఆకుకూర తిన్నారు. పాలు తాగారు. ఆటగాళ్లు ప్రేమతో ఇచ్చిన స్థానిక కూరగాయలు తనతో పాటు తీసుకెళ్లారు'' అని వెల్లడించారు. రెజ్లింగ్ సమాఖ్య గొడవలను ఆటగాళ్లు రాహుల్ దృష్టికి తెచ్చారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుని చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్లకు న్యాయం జరగకపోవడం తమను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోందని బజరంగ్, దీపక్ తదితరులు చెప్పారని వివరించారు. ఆకస్మిక పర్యటనలు రాహుల్‌కు కొత్తేమీ కాదు. ట్రక్కు డ్రైవర్ల సమస్యలు తెలుసుకునేందుకు గత మే నెలలో ఢిల్లీ నుంచి చండీగఢ్‌కు ట్రక్కులో ప్రయాణించారు. జూలైలో హరియాణాలోని సోనేపట్‌లో పంటపొలాల్లో దిగి అక్కడ పొలం పనులు చేసుకుంటున్న మహిళలతో ఆయన మాటలు కలిపారు.

మనసులు గెలవండి

సైనికులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ పిలుపు

రాజౌరీ/జమ్మూ: జమ్మూ కశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని సైన్యం కూకటివేళ్లతో పెకిలించి వేస్తుందని తమకు పూర్తి విశ్వాసముందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. అయితే ఆ క్రమంలో పౌరులను ఇబ్బంది పెట్టే ఎలాంటి పొరపాట్లకూ తావీయొద్దని సైనిక బలగాలకు సూచించారు. విధులు నిర్వహిస్తూనే ప్రజల మనసులూ గెలవడం సైనికుల బాధ్యతని గుర్తెరగాలన్నారు. బుధవారం ఆయన జమ్మూ కశ్మీర్‌లో ఒక్క రోజు పర్యటనలో పాల్గొన్నారు. రాజౌరీ ఆర్మీ క్యాంప్‌లో సైనికులనుద్దేశించి ప్రసంగించారు. కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఇటీవల నలుగురు సైనికులు ఉగ్ర దాడిలో మరణించడం, విచారణ కోసమని భద్రతా దళాలు తీసుకెళ్లిన ఎనిమిది మంది పౌరుల్లో ముగ్గురు మరణించడం తెలిసిందే. ఆ ముగ్గురు బాధితుల కుటుంబసభ్యులను మంత్రి కలిసి ఓదార్చారు. కుటుంబాలకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లతో పాటు భద్రతా పరిస్థితులను మంత్రి సమీక్షించారు.



జమ్మూకశ్మీర్‌లోని ప్రభుత్వ సైనిక వైద్య కళాశాలలో బాధితులను పరామర్శిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బెంగళూరులో ఇంగ్లిష్ ఫ్లెక్సీని చించివేస్తున్న కార్యకర్త

'కన్నడ' బోర్డుల రగడ

బనశంకరి: వాణిజ్య, వ్యాపార సంస్థల కార్యాలయంపై దర్శనమిచ్చే సైన్‌బోర్డు, నేమ్‌ప్లేట్ల(నామఫలకాల)లో 60 శాతం బోర్డులు కన్నడలోనే ఉండాలనే బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బీబీఎంపీ) నిబంధన తాజాగా బెంగళూరు నగరంలో బోర్డుల విధ్వంసానికి దారితీసింది. కన్నడ నగరంలో వ్యాపారం చేసే వారు ఎవరైనా సరే తమ కార్యాలయం బోర్డును కన్నడ భాషలోనే పెట్టుకోవాలంటూ కర్ణాటక రక్షణ వేదిక(ఎన్‌జీ) కార్యకర్తలు బుధవారం బెంగళూరులో ర్యాలీలతో వీరంగం సృష్టించారు. ఇంగ్లిష్‌లో కనిపించిన ప్రతీ సైన్ బోర్డును ధ్వంసంచేశారు. కొన్నింటిపై నలుపు రంగు పూశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేఆర్‌వీ కన్వీనర్ టీఏ నారాయణ గౌడను అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదంపై బృహత్ బెంగళూరు మహానగర ఉన్నతాధికారి తుషార్ గిరినాథ్ స్పందించారు. సైన్ బోర్డు, నేమ్‌ప్లేట్లలో 60 శాతం కన్నడలోనే ఉండాలన్న నిబంధనను ఫిబ్రవరి 28 నుంచి అమల్లోకి తెస్తామని, నిబంధనను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు.

వంద దాటిన జేఎన్1 కేసులు

న్యూఢిల్లీ: భారత్‌లో కొత్తగా వెలుగుచూసిన జేఎన్1 ఉప వేరియంట్ రకం కరోనా కేసులు మరో 40 బయటపడ్డాయి. దీంతో జేఎన్1 రకం కేసుల సంఖ్య 109కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం పేర్కొంది. ఈ 109 కేసుల్లో 36 కేసులు ఒక్క గుజరాత్‌లోనే నమోదయ్యాయి. కర్ణాటకలో 34, మహారాష్ట్రలో 9, కేరళలో ఆరు, రాజస్తాన్, తమిళనాడులో చెరో నాలుగు, తెలంగాణలో రెండు కేసులు నమోదయ్యాయి. ఢిల్లీలో తొలిసారిగా ఈ వేరియంట్ కేసు ఒకటి నమోదైంది.

మరింత పటిష్టంగా సహకార సంఘాలు: మోదీ

న్యూఢిల్లీ: గ్రామీణ ప్రజల అభివృద్ధికి తోడ్పడేలా సహకార సంఘాలను మరింత పటిష్టంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. వ్యవసాయం, అనుబంధాల రంగాల్లో సహకార సంఘాల పాత్ర పెరిగిందని అన్నారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా ప్రధాని మోదీ బుధవారం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసుకొనే సదుపాయం లేక గతంలో రైతులు తక్కువ ధరకే వాటిని విక్రయించుకోవాల్సి వచ్చేదని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి మారిందని గుర్తుచేశారు.

పొగమంచు గుప్పిట్లో ఉత్తర భారతం

- ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
- విమానాలు, రైళ్ల రాకపోకలు ఆలస్యం
- ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సున్నాకు పడిపోయిన విజిబిలిటీ లెవెల్

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బుధవారం ఉదయం పొగమంచు వల్ల నిలిచిపోయిన విమానాలు



న్యూఢిల్లీ/బాగ్‌పట్: ఉత్తర భారతదేశం పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంటోంది. దారులన్నీ దట్టమైన పొగ మంచుతో మూసుకుపోతున్నాయి. ముందున్న వాహనాలు సైతం కనిపించని పరిస్థితి. దేశ రాజధాని ఢిల్లీలో పొగ మంచుకుతోడు చలి తీవ్ర నానాటికీ పెరుగుతోంది. నగరంలో నగరంలో భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఢిల్లీలో పొగమంచు కారణంగా బుధవారం 110 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కొన్నింటిని ఇతర ఎయిర్‌పోర్టులకు మళ్లించారు. ఢిల్లీకి చేరుకోవాల్సిన 25 రైళ్లు ఆలస్యంగా వచ్చాయి. ఢిల్లీ నుంచి రాకపోకలు సాగించే విమానాలు ఆలస్యంగా నడుస్తుండడంపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. ప్రయాణికులు తమ టికెట్లను ఎలాంటి అదనపు చార్జీలు లేకుండానే రీషెడ్యూల్ లేదా క్యాన్సిల్ చేసుకోవచ్చని సూచించింది. పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో పొగమంచు తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపంలో విజిబిలిటీ లెవెల్ 25 మీటర్లుగా నమోదైంది. హరియాణా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లోనూ విజిబిలిటీ స్థాయి పడిపోయింది. ఆగ్రా, బరేలీ, భటిండాలో విజిబిలిటీ లెవెల్ సున్నాకు పడిపోవడం గమనార్హం. పొగ మంచు, కాలుష్యం వల్ల ఉత్తరాదిన వాయు నాణ్యత కూడా క్షీణిస్తోంది. తాజాగా సగటు వాయు నాణ్యత 381గా రికార్డయింది. ఇది 'వెరీ పూర్' కేటగిరీలోకి వస్తుందని అధికారులు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది.

పొగమంచు వల్ల 8 మంది మృతి

విపరీతమైన పొగమంచు వల్ల దారి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారులపై వాహనాలు ఒకదాన్ని ఒకటి ఢీకొంటున్నాయి. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత, బుధవారం ఉదయం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మరణించారు. మరో 25 మందికిపైగా గాయాలపాలయ్యారు. బరేలీ జిల్లాలోని హఫీజ్‌గంజ్‌లో మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు.

ముస్లిం లీగ్ జమ్మూకశ్మీర్(ఎంఏ)పై కేంద్రం ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: వేర్పాటువాద నేత మసరత్ ఆలం భట్ నేతృత్వంలోని ముస్లిం లీగ్ జమ్మూకశ్మీర్(మసరత్ ఆలం)ను ఐదేళ్లపాటు నిషేధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ బుధవారం ప్రకటించింది. ఈ సంస్థ ఉగ్రవాదులకు సాయపడుతూ దేశ వ్యతిరేక, ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు కేంద్రం తన నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. '' దేశ ఐక్యత, సార్వభౌమత్వం, సమగ్రతను భంగపరిచే ఎలాంటి సంస్థలు, శక్తులనైనా కేంద్రం ఊరికే వదిలిపెట్టదు. చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)(ఉపా) చట్టం కింద ఈ సంస్థపై చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటిస్తున్నాం. ఈ సంస్థ సభ్యులు కశ్మీర్‌లో భారత వ్యతిరేక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, జనాన్ని ఉగ్రవాదం వైపు ఆకర్షితులను చేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇస్లామిక్ రాజ్యస్థాపనకు ప్రయత్నిస్తున్నారు'' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. సయ్యద్ అలీ షా గిలానీ మరణం తర్వాత అతివాద హురియత్ కాన్ఫెరెన్స్‌కు మసరత్ చైర్మన్‌గా ఉన్నారు. 2010లో కశ్మీర్ అల్లర్లకు బాధ్యుల్లో భట్ కూడా ఒకరు. దీంతో అదే ఏడాది భట్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా ముఫ్తీ మొహమ్మద్ సయీద్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే భట్‌ను విడిపించారు. బీజేపీ ఒత్తిడితో అరెస్ట్ చేసి జైలులో పడేశారు.

జలాంతర్గామి నుంచి ద్వారక దర్శనం

భగవాన్ శ్రీకృష్ణుడు పరిపాలించిన నగరం ద్వారక. హిందువులకు పరమ పవిత్రమైన ఈ పురాతన నగరం వేలాది సంవత్సరాల క్రితం అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నగర ఆనవాళ్లు ఇప్పటికీ సముద్రంలో భద్రంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. సముద్ర గర్భంలోని ద్వారకను స్వయంగా దర్శించే అరుదైన అవకాశం భక్తులకు, పర్యాటకులకు లభించనుంది. జలాంతార్గమిలో ప్రయాణించి, ద్వారకను దర్శించుకోవచ్చు. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉపరితలం నుంచి 300 అడుగుల మేర లోతుకి వెళ్లి ద్వారకను చూడొచ్చు. సముద్ర జీవులను కూడా తిలకించవచ్చు. ఈ సదుపాయం వచ్చే ఏడాది జన్మాష్టమి లేదా దీపావళి నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. జలాంతర్గామి యాత్ర రెండు నుంచి రెండున్నర గంటలపాటు ఉంటుందని సమాచారం. ఈ సబ్‌మెరైన్ బరువు 35 టన్నులు. లోపల పూర్తిగా ఏసీ సౌకర్యం కల్పిస్తారు. ఒకేసారి 30 మంది ప్రయాణించవచ్చు. ఇందులో భక్తులు 24 మంది మాత్రమే ఉంటారు. మిగిలిన ఆరుగురు జలాంతర్గామిని నడిపించే సిబ్బంది, సహాయకులు. భక్తులకు ఆక్సిజన్ మాస్క్, ఫేస్ మాస్క్, స్కూబా డ్రెస్ అందజేస్తారు. అయితే, ద్వారక దర్శనానికి ఎంత రుసుము వసూలు చేస్తారన్న గుజరాత్ ప్రభుత్వం ప్రకటించలేదు. జలాంతర్గామిలో ప్రయాణం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సామాన్యుల కోసం ప్రభుత్వం రాయితీ ఇచ్చే అవకాశం లేకపోలేదు. ద్వారక కారిడార్ అభివృద్ధికి గుజరాత్ ప్రభుత్వం డాక్ షిప్‌యార్డ్ కంపెనీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎంఫిల్‌కు గుర్తింపు లేదు

విద్యార్థులను హెచ్చరించిన యూజీసీ

న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం ఎంఫిల్ కోర్సులకు ఎలాంటి గుర్తింపు లేదని, ఆ కోర్సుల్లో ఎవరూ చేరొద్దని విద్యార్థులను యూజీసీ హెచ్చరించింది. ఏ ఒక్క విశ్వవిద్యాలయం కూడా విద్యార్థులను ఎంఫిల్ కోర్సుల్లో చేర్చుకోకూడదని అన్ని విశ్వవిద్యాలయాలకు యూజీసీ ఆదేశాలిచ్చింది. '' ఎంఫిల్(మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ) ప్రోగామ్స్ కింద కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు వార్తలొచ్చాయి. యూజీసీ(పీహెచ్‌డీ పట్టాకోసం కనీస ప్రమాణాలు, ప్రక్రియ) నియమావళిలోని 14వ నిబంధన ప్రకారం ఎంఫిల్ డిగ్రీకి ప్రస్తుతం ఎలాంటి గుర్తింపు లేదు'' అని యూజీసీ కార్యదర్శి మనీశ్ జోషి బుధవారం వెల్లడించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి కొనసాగుతున్న ఎంఫిల్ అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ఆపేయాలని అన్ని యూనివర్సిటీలకు యూజీసీ ఆదేశాలిచ్చింది. 2022 నవంబర్ నుంచి ఎంఫిల్ కోర్సులను యూజీసీ రద్దుచేసిన విషయం తెల్సిందే. అయినాసరే కొన్ని వర్సిటీలు నియమాలకు తిలోదకాలిచ్చి అక్రమంగా ఎంఫిల్ కోర్సుల పేరిట విద్యార్థులను చేర్చుకుంటూ కోట్లు వసూలుచేస్తున్నట్లు వార్తలొచ్చాయి. దీంతో యూజీసీ బుధవారం స్పందించింది. '' పీహెచ్‌డీ రెగ్యులేషన్స్‌కు సంబంధించిన నోటిఫికేషన్ రావడానికి ముందే గతంలో ప్రారంభమైన ఎంఫిల్ కోర్సులు మాత్రం అలాగే కొనసాగుతాయి. అంటే ఇప్పటికే చేరిన పాత విద్యార్థులు మాత్రమే ఆ కోర్సులు పూర్తిచేసేందుకు అనుమతి ఇస్తున్నాం'' అని జోషి స్పష్టతనిచ్చారు.

ప్రాణం తీసిన రెండు జంటల గొడవ

వేరొకరి స్నేహితురాలిని కారుతో తొక్కించి చంపిన నిందితుడు

జైపూర్: రెస్టారెంట్‌లో రెండు జంటలు పడిన గొడవ చివరకు ఒక యువతి మృతికి దారితీసింది. వేరొకరి స్నేహితురాలిని నిందితుడు తన కారుతో తొక్కించి చంపేసిన ఘటన రాజస్తాన్‌లోని జైపూర్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. జైపూర్‌లోని ఎస్ఎల్ మార్గ్‌లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి తన రెస్టారెంట్‌కు తన స్నేహితురాలు ఉమతో కలిసి వచ్చాడు. ఇద్దరూ కలిసి రాత్రి 11 గంటలపుడు భోజనం చేస్తుండగా అదే రెస్టారెంట్‌కు వస్త్రదుకాణ వ్యాపారి అయిన మంగేశ్ తన స్నేహితురాలితో వచ్చి మద్యం తాగడం మొదలెట్టాడు. రెండు జంటలూ సమీప టేబుళ్లపై కూర్చున్న సమయంలో ఉమను చూస్తూ మంగేశ్ అసభ్యంగా మాట్లాడటం మొదలెట్టాడు. వారించేందుకు వెళ్లిన రాజ్‌కుమార్‌ను.. 'మనం పరిచయస్తులమే' అంటూ మాట కలిపి నలుగురూ కలిసి భోజనం చేసేందుకు ఒప్పించాడు. ఈ సమయంలో ఉమను మంగేశ్ అసభ్యంగా తాకడంతో గొడవ మొదలైంది. దీంతో తెల్లవారుజామున ఐదింటికి రాజ్‌కుమార్, ఉమ రెస్టారెంట్ బయటికొచ్చి క్యాబ్ కోసం వేచిచూస్తుండగా మంగేశ్ జంట మళ్లీ అక్కడికొచ్చి గొడవపడింది. తర్వాత వీరావేశంతో మంగేశ్ తన కారును వీరిద్దరి మీదకు పోనిచ్చాడు. మీద నుంచి కారు దూసుకెళ్లడంతో నలిగిపోయి ఉమ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రాజ్‌కుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. పరారీలో ఉన్న మంగేశ్ కోసం పోలీసులు గాలింపు మొదలెట్టారు.

తమిళనాడు డీజీపీ ఆఫీస్‌కు 'బాంబు' బెదిరింపు

సాక్షి, చెన్నై: చెన్నై డీజీపీ కార్యాలయానికి బుధవారం రాత్రి వచ్చిన ఒక ఈ మెయిల్ పోలీసులను పరుగులు తీయిస్తోంది. చెన్నైలో 30 చోట్ల బాంబులు పెట్టామని, సాహసం చేసి కని పెట్టండి అని వచ్చిన ఆ బెదిరింపు మెయిల్‌తో పోలీసులు సోదాలను ముమ్మరం చేశారు. కొత్త సంవత్సరం వేడుకల సమయం ఆసన్నం అవుతోండటంతో చెన్నై నగరంలో ఇప్పటికే భద్రతను కట్టుదిట్టం చేసే విధంగా కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఆదేశాలు ఇచ్చారు. 400 చోట్ల సోదాలు జరిపే విధంగా , 15 వేల మంది సిబ్బంది విధుల్లో ఉండే రీతిలో చర్యలు చేపట్టారు. ఈ పరిస్థితులలో బుధవారం రాత్రి డీజీపీ కార్యాలయానికి ఓ ఈ మెయిల్ వచ్చింది. చెన్నైలో 30 చోట్ల బాంబులు పెట్టినట్టు, బెసెంట్ నగర్, ఎలియట్స్ బీచ్‌లలో బాంబులు పెట్టినట్లు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో బాంబ్, డాగ్ స్క్వాడ్ ఆయా ప్రాంతాల్లో క్షుణ్ణంగా గాలిస్తున్నాయి. నగరంలో తీవ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్టుగా గతంలో వెలుగు చూసిన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేసి సోదాలు ముమ్మరం చేశారు.

ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: 2024 సీజన్‌కు సంబంధించి కొబ్బరి కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో కనీస మద్దతు ధర పెంపుపై నిర్ణయాలు తీసుకున్నారు. చక్కని, మోస్తరు నాణ్యత(ఎఫ్ఏక్యూ) కలిగిన కురిడీ కొబ్బరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.250 పెంచారు. దీంతో క్వింటాల్ కురిడీ కొబ్బరి ధర రూ.12,000కు పెరిగింది. ఇక ఎండు కొబ్బరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.300 పెంచారు. దీంతో క్వింటాల్ ఎండు కొబ్బరి కనీస మద్దతు ధర రూ.11,160కి చేరుకుంది. ఎండు కొబ్బరిని కొబ్బరి నూనె కోసం వాడుతారు. కురిడీ కొబ్బరిని డ్రైఫ్రూట్‌గా వినియోగిస్తారు. కేరళ, తమిళనాడు ఎండు కొబ్బరిని అధికంగా ఉత్పత్తిచేస్తున్నాయి. కురిడీ కొబ్బరిని కర్ణాటక అధికంగా ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుత 2023 సీజన్‌లో రికార్డు స్థాయిలో రూ.1,493 కోట్ల విలువైన 1.33 లక్షల మెట్రిక్ టన్నుల కొబ్బరిని సేకరించి సుమారు 90వేల మంది కొబ్బరి రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు కేంద్రం తెలిపింది.

భారత్ బ్రాండ్ బియ్యం.. కిలో రూ.25 !

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణాన్ని కిందకు దించి, సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే లక్ష్యంతో 'భారత్ రైస్' పేరిట బియ్యం విక్రయాలు మొదలుపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. కిలో బియ్యాన్ని ఎంత ధరకు అమ్మాలనేది ఇంకా నిర్ణయం కాలేదని ఆహార మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. ప్రభుత్వం ప్రస్తుతం ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్(ఓఎంఎస్ఎస్) కింద ఎఫ్‌సీఐ వారు ఇప్పటికే నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ.29 చొప్పున విక్రయిస్తున్నారు. దాంతో భారత్ బ్రాండ్ బియ్యాన్ని కూడా ఇదే ధరకు విక్రయిస్తారా లేదంటే ఇంతకంటే తక్కువ రేటుకు విక్రయిస్తారా అనేది తెలియాల్సి ఉంది. అయితే రూ.25 లెక్కన విక్రయించాలని కేంద్రం భావిస్తోందని బుధవారం జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'భారత్' బ్రాండ్ పేరిట గోధుమ పిండి, పప్పులను నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ ఔట్‌లెట్‌ల ద్వారా అమ్ముతున్న విషయం తెల్సిందే.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 28 । డిసెంబర్ । 2023




హరిహర సుతునికి నాణేభిషేకం

కృష్ణాజిల్లా కోడూరు అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఉత్సవమూర్తికి రెండు లక్షల కొత్త రూపాయి నాణేలతో అభిషేకాన్ని నిర్వహించారు. -8లో▸



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) బుధవారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 831.40 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

మయూర వాహనంపై ఊరేగిన సుబ్బారాయుడు



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానాల్లో ఆరుద్రోత్సవం(శివ ముక్కోటి) సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్ధు పవన్ కుమార్ శర్మ, ప్రసాద్‌శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ వేదపండితులు, అర్చకస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 30వ తేదీ (శనివారం) 10 గంటలకు విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని జిల్లా ఉపాధి కార్యాలయం ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్, సుధీర్ టింబర్ ప్రైవేటు లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ మొదలైన కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని వారి కంపెనీల్లోని ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో ఇన్ మెకానిజమ్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువతీ యువకులు ఈ మేళాకు హాజరు కావచ్చని తెలియజేశారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు శనివారం ఉదయం లోగా ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 81424 16211లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ



కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి బుధవారం పలు డిగ్రీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డిగ్రీ, మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజు ఆయన మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, నోబుల్ కళాశాల, పద్మావతి కళాశాలను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో వసతులపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడి ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలలో 25 వేల మంది విద్యార్థులు మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీసీతో పాటు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. స్వామివారికి ప్రధానహోమాలు, పవిత్ర విసర్జన, లక్ష తులసిదళ అర్చన, మహా పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాల వినియోగం, ఋత్విక్ సన్మానాల వంటి కార్యక్రమాలను అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, తిరునగరి రామకృష్ణమాచార్యులు, బృందావనం నరసింహాచార్యులు, ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దాసర శ్రీరామ వరప్రసాదరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నీ ఉంటేనే అనుమతి



జగ్గయ్యపేటలోని ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

- ప్రైవేటు ఆస్పత్రులు మెడికల్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పాటించాల్సిందే
- బెడ్స్ ఉంటే ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరి
- ఏపీ పీసీబీ వారి నుంచి అనుమతి కావాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అనుమతి లేకుండా ఆస్పత్రులు, క్లినిక్స్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. ఆస్పత్రి యాజమాన్యాలు ఫీజుల వివరాలు కూడా రోగులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తోంది. కలెక్టర్ ఆదేశాలకనుగుణంగా ఫిర్యాదులు వచ్చిన ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఏపీ మెడికల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెండ్ (ఏపీఎంఈసీ)యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు చేసి అనుమతులు, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.

రెండు నెలలు ముందుగానే..

ఇటీవల ఆస్పత్రి రిజిస్ట్రేషన్ కాలపరిమితి ముగిసినా రెన్యువల్స్ లేకుండానే నిర్వహించేస్తున్నారు. అలాంటి వాటిని తనిఖీ చేసి కొరడా ఝుళిపించడానికి వైద్య ఆరోగ్యశాఖ రంగం సిద్ధం చేస్తోంది. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ ఉన్నా, నిబంధనలు పాటించడం లేదని, ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గడువు ముగియడానికి రెండు నెలల ముందుగానే రెన్యువల్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ లోనే దరఖాస్తు చేసుకోవాలి. దీంతోపాటు డాక్యుమెంట్స్ జత చేయాలని అధికారులు చెబుతున్నారు.

- ఆస్పత్రి, క్లినిక్ ఏర్పాటు చేసిన స్థల పత్రాలు, లీజు అయితే ఒప్పందం పత్రాలు, బ్లూప్రింట్‌తో కూడిన దస్తావేజును స్కాన్ కాపీలు పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి.
- మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ యుటిలైజేషన్ సర్టిఫికెట్
- ఆస్పత్రి, క్లినిక్ ఏర్పాటు చేసిన ఫంక్షనల్ ప్రాంతం, ఓపెన్ ఏరియా ఫొటోలు
- రిజిస్ట్రేషన్ నంబర్లతో వైద్యుల పేర్లు, కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పత్రాలు
- రిజిస్ట్రేషన్ నంబర్లతో నర్సింగ్‌స్టాఫ్ పేర్లు, వారి పత్రాలు
- రిజిస్ట్రేషన్ నంబర్లతో పారామెడికల్ సిబ్బంది పేర్లు, అర్హత పత్రాలు,
- సహాయ సిబ్బంది సంఖ్య
- అందుబాటులో ఉన్న ప్రత్యేకతలు, పరికరాలు
- ఆస్పత్రి, ఇన్‌స్టిట్యూట్ ఆర్థిక స్థితి (ఆడిట్ రిపోర్టు)
- నిర్దేశిత నిబంధనలు పాటిస్తానని స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్
- ఫైర్ సేఫ్టీ అఫిడవిట్, ఫైర్ ఎన్‌ఓసీ
- కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి ఎన్‌ఓసీ

నిబంధనలకు అనుగుణంగా

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్స్, లేబొరేటరీలు, స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ కాలపరిమితి ముగిసిన వాళ్లు రెన్యువల్ చేయించుకోవాలి. బెడ్స్ ఉన్న ఆస్పత్రికి ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరి. ప్రతి ఒక్కరూ ఏపీ మెడికల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు పాటించాల్సిందే. పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ధరల బోర్డులు ఉండాలి

- ప్రతి ఆస్పత్రి, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరలు ప్రకటించాల్సి ఉంది.
- స్కానింగ్ సెంటర్లలో ఏ స్కాన్‌కు ఎంత మొత్తం చార్జి చేస్తున్నారో బోర్డు ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రిలో బెడ్‌కు ఎంత, వార్డు, రూమ్ రెంట్ ఎంత అనేది డిస్‌ప్లే చేయాలి.
- ఏ ఆపరేషన్‌కు ఎంత చార్జి చేస్తున్నారేది తెలియజేయాల్సి ఉంది.
- ఆస్పత్రిలో ఎంత మంది వైద్యులు ఉన్నారు. వారు ఏ విభాగానికి చెందిన వారో బోర్డు ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రికి అనుమతులు మంజూరు చేసేందుకు తనిఖీలకు వెళ్లిన సమయంలో అధికారులు అన్ని విషయాలను నిశితంగా పరిశీలించిన తర్వాతే మంజూరు చేస్తారు.

నిర్లక్ష్యం వహించినా..

ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు ఎక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేశారని, సర్జరీ ఫెయిల్యూర్ అయిందనే ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందనలో ఇలాంటివి అందుతున్నాయి. వీటిపై నిపుణులతో విచారణ చేసి ఆస్పత్రుల వైఫల్యం ఉంటే వారిపై చర్యలు తీసుకుంటారు. ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే, రోగి నుంచి వసూలు చేసిన మొత్తానికి పది రెట్లు ఆస్పత్రి నుంచి జరిమానా వసూలు చేస్తారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



టాస్ వేసి మ్యాచ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రీడా రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే గొప్ప లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా మెగా క్రీడల ఈవెంట్‌ను ప్రారంభించారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కృష్ణలంక ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్ మైదానంలో బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలిసి ఆడుదాం ఆంధ్రా రెండో రోజు క్రీడల పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ ఢిల్లీరావు, అవినాష్ క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ క్రీడలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో క్రీడా ప్రతిభావంతులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ మెగా ఈవెంట్ ఫిబ్రవరి 10 వరకు జరుగుతుందని, జిల్లాలో దాదాపు లక్షా 20 వేల మంది క్రీడల్లో భాగస్వాములవుతున్నారని తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ క్రీడా పరికరాలు అందించడమే కాకుండా గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వారికి నచ్చిన వారికి మాత్రమే బహుమతులు ఇచ్చి నైపుణ్యం ఉన్న క్రీడాకారులకు మొండిచేయి చూపించారని విమర్శించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ పుప్పాల కుమారి, వీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవోల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో ఎన్జీవో సంఘ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పశ్చిమ కృష్ణా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆవిష్కరించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఉద్యోగ సంఘ నేతలతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్, అసోసియేటెడ్ అధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

భవానీలు కోవిడ్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న చైర్మన్ కర్నాటి రాంబాబు, చిత్రంలో ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు

- 68 అంశాలపై దుర్గగుడి పాలక మండలి చర్చ
- దీక్ష విరమణల నేపథ్యంలో కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు విచ్చేసే భవానీలు కోవిడ్ నిబంధనలు పాటించాలని దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. పాలక మండలి 8వ సమావేశం బుధవారం జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. మొత్తం 68 అంశాలపై చర్చ సాగింది. చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఏఈవోలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, పాలక మండలి సభ్యులు హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు సాగిన సమావేశంలో ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు ఏర్పాట్లపై చర్చ సాగింది. సమావేశం అనంతరం చైర్మన్ రాంబాబు, ఈవో రామారావులతో పాటు పాలక మండలి సభ్యులు మీడియాతో వివరాలు వెల్లడించారు.

5 లక్షల మంది వస్తారని అంచనా..

వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగే భవానీ దీక్ష విరమణలకు సుమారు 5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని అంచనా వేస్తున్నామని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధికి స్వాముల రద్దీని దృష్టిలో పెట్టుకుని భవానీ దీక్ష విరమణలకు ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ చెప్పారు. భవానీలు ఎంత మంది వచ్చినా వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. భవానీల ఇరుముడులను తీసేందుకు 300 మంది గురు భవానీలు, నాలుగు హోమ గుండాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది 17 లక్షల లడ్డూలను విక్రయించాలని అంచనా వేస్తే 15.60 లక్షల లడ్డూలను విక్రయించామన్నారు. ఈ ఏడాది భవానీల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేసేందుకు అవసరమైన సరుకులు సిద్ధంగా ఉంచామన్నారు. ఈ ఏడాది క్యూలైన్ లోనే లడ్డూ టోకెన్‌లను విక్రయించాలని నిర్ణయించామని, దర్శనం అయిన తర్వాత ఆ టోకెన్లను ఏప కౌంటర్‌లోనైనా ఇచ్చి లడ్డూలను పొందవచ్చన్నారు. సీతమ్మ వారి పాదాలు, భవానీ, పున్నమీ ఘాట్‌లలో 8 వందలకు పైగా షవర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి 20 గ్రాముల చిన్న లడ్డూను ఉచితంగా అందించేందుకు పాలక మండలి ఆమోదం తెలిపిందన్నారు. మల్లికార్జునపేట పాత మెట్ల మార్గాన్ని త్వరలోనే తెరిచి భక్తుల రాకపోకలను అనుమతిస్తామన్నారు.

గిరి ప్రదక్షిణలో 14 మెడికల్ పాయింట్లు

దీక్ష విరమణకు విచ్చేసే భవానీలు గిరి ప్రదక్షిణ చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా 14 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో మెడికల్ క్యాంపులు, వాటర్ ప్యాకెట్లతో పాటు భవానీలు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రణాళికతో విజయం తథ్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ప్రసంగిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

పెనమలూరు: ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ కొనసాగించటం ద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో బుధవారం బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్–2 ఉచిత శిక్షణ తరగతులకు కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు నిపుణులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ కోసం 77 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్టడీ సర్కిల్ ద్వారా సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని విజయం సాధించాలన్నారు. నాణ్యమైన గైడ్స్, మెటీరియల్, పాత ప్రశ్న పత్రాలు విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. అభ్యర్థులు కష్టపడితే ఆశించిన ఫలితాలు సాధించగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.రుక్మాంగదయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాధికారతను ఎలుగెత్తి చాటుదాం

- నేడు కంకిపాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర
- బస్టాండు సెంటర్‌లో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్



కంకిపాడులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చేకూరిన సంక్షేమాన్ని వివరిస్తూ వారిని చైతన్యపరిచే లక్ష్యంతో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పెనమలూరు నియోజకవర్గం సిద్ధమైంది. కంకిపాడు ప్రధాన సెంటర్‌లో బహిరంగ సభ ద్వారా ప్రజలకు సంక్షేమ పాలనను ప్రజాప్రతినిధులు, నాయకులు వివరించనున్నారు. తాడిగడపలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేల మీడియా సమావేశం అనంతరం 2.30 గంటల నుంచి మోటర్ బైక్ ర్యాలీ కంకిపాడు వరకూ సాగనుంది. మోటారు బైక్‌లతో పాటుగా ఆటోలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. బస్సుయాత్ర సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా ప్రధాన రహదారి వెంబడి వైఎస్సార్ సీపీ పతాకాలను కట్టారు. పార్టీ అధినేత, బస్సుయాత్ర బృందంతో కూడిన ఫ్లెక్సీలను రోడ్డు మార్జిన్‌ల వద్ద భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం వద్ద రోడ్డుకు ఇరువైపులా సరుకుబాదులను పాతి, పార్టీ జెండాలను కట్టారు.

కంకిపాడులో పాదయాత్ర..

సాధికార బస్సు యాత్ర వాహనానికి కంకిపాడు బైపాస్ వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి బస్సుయాత్ర అండర్‌పాస్ నుంచి అయానా ఫంక్షన్ హాల్ వరకూ చేరుతుంది. ఫంక్షన్ హాలు సెంటర్ నుంచి బస్సు యాత్ర బృందం పాదయాత్రగా బహిరంగ సభ ప్రాంగణానికి చేరుతుంది. దారిపొడవునా సభకు వచ్చిన ప్రజలను పలకరిస్తూ వేదిక ప్రాంగణానికి చేరుకునేలా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నేతృత్వంలో సన్నాహాలు జరుగుతున్నాయి.

జయప్రదం చేయండి..

సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలసి ఆయన మాట్లాడారు. కంకిపాడు సభలో మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కైలే అనిల్‌కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, సింహాద్రి రమేష్‌బాబు, సామినేని ఉదయభాను, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

ఏర్పాట్ల పరిశీలన..

సామాజిక సాధికార బస్సుయాత్ర ఏర్పాట్లను ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. బస్టాండు ప్రాంగణం వద్ద గల పార్టీ కార్యాలయం నుంచి ఏటీఎం సెంటర్ వరకూ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ముందుగా గుర్తించిన పార్టీ కార్యాలయం వద్ద కాకుండా ఏటీఎం సెంటర్‌లో సభా వేదిక ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరం ఏర్పడకుండా చూసుకోవాలని ఎంపీ అయోధ్య రామిరెడ్డి సూచించారు. పరిశీలనలో జెడ్పీటీసీ బాకీ బాబు, పెనమలూరు, కంకిపాడు మండల అధ్యక్షులు సంగెపు శ్రీనివాసరావు, మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 3.22 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన భక్తులు బుధవారం రూ. 3.22 లక్షల విరాళాన్ని అందచేశారు. బెంగళూరుకు చెందిన అట్లూరి శ్రీదేవి, రజనీకాంత్, యువన్‌కృష్ణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

'పది' విద్యార్థుల ఫీజు చెల్లింపునకు తత్కాల్ స్కీమ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఒక్కసారి తప్పిన విద్యార్థులు మార్చి–2024లో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజు చెల్లింపు కోసం తత్కాల్‌స్కీమ్‌లో అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. ఈ ఫీజు చెల్లించే విద్యార్థులు ఈ నెల 28 నుంచి జనవరి రెండో తేదీ లోపు రూ.500 ఆలస్య రుసుంతో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫీజు చెల్లించేందుకు ఎట్టి పరిస్థితుల్లో తేదీల పొడిగింపు ఉండదని పేర్కొన్నారు. అలాగే మార్చి–2024 పరీక్షకు ఫీజు చెల్లించిన వారికి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు అర్హులవుతారని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ది ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర బాలికల జట్టు ఎంపిక నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా నటరాజస్వామి దివ్య లీలా కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆర్ద్రోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ శివకామసుందరీ సమేత నటరాజస్వామి వార్ల దివ్య లీలా కల్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శివకామ సుందరి, నటరాజస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణం జరిపించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దివ్య లీలా కల్యాణోత్సవం విశిష్టతను పురాణ పండితుడు చింతపల్లి వెంకటేశ్వర్లుశాస్త్రి గణాపాఠి చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోశ్చరణ నడుమ నిర్వహించిన కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. లింగోద్భవ కాలంలో నటరాజ స్వామికి విశేష అభిషేకాలు, అర్చన, అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం నటరాజ స్వామి ఆలయంలో మూలమంత్ర హవనాలు, బలిహరణ, ఔపాసన, మంటప పూజలు, హోమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఏఈఓ ఎన్.రమేష్‌బాబు, పలువురు సూపరింటెండెంట్లు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజమండ్రి జోన్-2 పరిధిలోని జిల్లాల్లో ఖాళీగా ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని రాజమండ్రి ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మాశశిధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను ఆయా జిల్లాల వెబ్‌సైట్లలో పొందుపరిచామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ntr.ap.gov.inలో చూడొచ్చని సూచించారు. వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను జనవరి 12వ తేదీ లోపు రాజమండ్రిలోని తమ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రాంగణం, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా చిరునామాకు పూర్తి చేసిన దరఖాస్తులు పంపించాలని ఆర్‌డీ డాక్టర్ పద్మాశశిధర్ కోరారు.

నాణేభిషేక ప్రియుడే.. శరణమయ్యప్ప

- రెండు లక్షల రూపాయి నాణేలతో అయ్యప్పకు అభిషేకం
- కనుల పండువగా సాగిన మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం
- వేలాదిగా తరలివచ్చి తిలకించిన భక్తజనం



కొత్త రూపాయి నాణేల మధ్య అయ్యప్ప స్వామి మూలవిరాట్



రూపాయి నాణేలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోడూరు(అవనిగడ్డ): కేరళ తరహా పూజలు.. వేద పండితుల మంత్రోశ్చరణ.. పుష్ప పరిమళాలు.. మంగళవాయిద్యాలు.. నాణేల గలగలలు.. శరణం అయ్యప్పా అంటూ భక్తుల నామస్మరణ మధ్య హరిహరసుతుడికి నాణేభిషేకం వైభవంగా జరిగింది. కోడూరు అయ్యప్ప స్వామి ఆలయంలో 19వ పడి పూజోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవ మూర్తికి రెండు లక్షల కొత్త రూపాయి నాణేలతో అభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. బెంగళూరు, హైదరాబాద్, కాకినాడ, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరుతో పాటు దివిసీమ ప్రాంతానికి చెందిన 80 మంది దంపతులు నాణేభిషేకానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. తొలుత రూపాయి నాణేలకు పూజలు చేసి, ఆలయం ప్రాంగణంలో ఊరేగించారు. 'నాణేభిషేక ప్రియుడే.. శరణమయ్యప్ప' అంటూ భక్తులు నాణేలను స్వామివారికి ఓరబోసి భక్తిభావం చాటుకున్నారు. 15 సంవత్సరాలుగా నాణేభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి తెలిపారు. కేరళ తరువాత కోడూరులో మాత్రమే రూపాయి నాణేలతో అయ్యప్పకు అభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. నాణేభిషేకాన్ని తిలకించేందుకు వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

వేడుకగా పంచామృతాభిషేకాలు

కోడూరుకు చెందిన బూరగడ్డ వంశీయులు ఉభయ దాతలుగా వ్యవహరించి అయ్యప్ప మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పండితులు శ్రీనివాసశర్మ, ముట్నూరి శాస్త్రి పర్యవేక్షణలో కలశ పూజ, సహస్ర దీపాలంకరణ సేవ, పుష్పార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు. మాలికపూరొత్తమ్మ అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. దీక్షపరులకు అన్నసమారాధన చేశారు. రాత్రికి మహాపడి పూజ, పడిహారతి జరిగాయి. గురువారం గజవాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి జేసీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో మాతాశిశు మరణాల నివారణకు వైద్య, ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషిచేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మాతాశిశు మరణాల నివారణకు అనుసరించాల్సిన ప్రణాళికపై కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం సమావేశం జరిగింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసినితో కలసి ఇన్‌చార్జి జేసీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమీక్షించారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి నవంబర్ వరకు సంభవించిన నాలుగు శిశు మరణాలు, నవంబర్‌లో జరిగిన రెండు మాత మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మాతాశిశు మరణాలు దురదృష్టకరమని, అవి పునరావృతం కాకుండా చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. జిల్లాలో హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య స్థితిపై ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవించి తల్లీబిడ్డలు క్షేమంగా తిరిగి ఇంటికి వెళ్లేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా రక్తహీనత కారణంగా గర్భిణులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకునేలా ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. సురక్షిత ప్రసవం కోసం గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్య అధికారులు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ పద్మావతి, ఎఫ్‌ఓజీఎస్ఐ ప్రతినిధి డాక్టర్ ప్రభావతి, డాక్టర్ హిమబిందు, వైద్యాధికారులు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల మేరకు దరఖాస్తుల పరిష్కారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో భాగంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా క్లెయిమ్‌లు, ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల సంక్షిప్త సవరణ- 2024 కార్యక్రమం కింద అందిన దరఖాస్తుల పరిష్కారంపై చర్చించారు. ఇప్పటి వరకు అందిన ఫారమ్-6, 7, 8 దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటరు జాబితాల స్వచ్ఛీకరణ కింద రాజకీయ పార్టీలు తెలిపిన అంశాలపై చేపట్టిన చర్యలను వెల్లడించారు. 2023, జనవరి ఐదో తేదీ నుంచి ఇప్పటి వరకు అందిన మొత్తం 4.71 లక్షల దరఖాస్తుల్లో పరిష్కరించాల్సినవి కేవలం 624 మాత్రమేనని తెలిపారు. యువత ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకునేలా చైతన్యపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో ఓటు వేసే విధానంపై ఓటరు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

రేపు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుక్ మాండవీయ పర్యటన



పనులు పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్, ఏపీహెచ్‌ఎంఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని పాత ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను బుధవారం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 29న కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్సుక్ మాండవీయ క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను పరిశీలించనున్నారు. ఈ బ్లాక్‌ను రూ.24.75 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. ఇక్కడ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు క్రిటికల్ కేర్ వైద్యాన్ని అందించనున్నారు. అందుకోసం అత్యాధునిక ఐసీయూలు అందుబాటులోకి రానున్నాయి. వాటితో పాటు డయాలసిస్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తారు. ఈ బ్లాక్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆ బ్లాక్ పరిశీలనకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా నివాస్, మురళీధర్‌రెడ్డి వచ్చి పనులు సాగుతున్న తీరు, ఇతర అంశాలను తనిఖీ చేశారు. కేంద్ర మంత్రి వచ్చిన సమయంలో సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆస్పత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సొంగా వినయ్, ఏపీహెచ్‌ఎంఐడీసీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఉపాధ్యాయుడు



బాధితురాలికి ఎస్‌ఐ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా పర్సు అందజేస్తున్న ఉపాధ్యాయుడు గంగాధర్

పమిడిముక్కల(పామర్రు): తనకు దొరికిన పర్సు, బంగారాన్ని ఓ ఉపాధ్యాయుడు పోలీస్‌స్టేషన్‌లో అందజేసి నిజాయతీ చాటున్నారు. మండలంలోని మేడూరు గ్రామానికి చెందిన గుర్విందపల్లి తిరుపతమ్మ ఇటీవల షాపింగ్‌కు నిమిత్తం ఆటోలో మంటాడ వెళ్లారు. మంటాడ నుంచి పామర్రు వెళ్లేందుకు ఆటోలోకి మారుతుండగా పర్సు పోగొట్టుకొన్నారు. ఆ సమయంలో అటుగా పామర్రు హైస్కూల్‌కు వెళ్తున్న తెలుగు పండిట్ వీర్ల శివనాగ గంగాధర్‌కు ఆ పర్సు దొరికింది. పర్సులో రూ.19,500 నగదు, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, ఏటీఎం కార్డు ఉన్నాయి. గంగాధర్ తనకు దొరికిన పర్సును పమిడిముక్కల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ కిషోర్‌కుమార్‌కు అందజేశారు. ఆ పర్సును ఎస్‌ఐ చేతుల మీదుగా తిరుపతమ్మకు బుధవారం అందజేశారు. ఉపాధ్యాయుడు శివనాగ గంగాధర్‌ను ఎస్‌ఐ అభినందించారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం



రామ్‌సింగ్ మృతదేహం



రామ్‌సింగ్ మృతదేహంపై గాయాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీను, సిబ్బంది

ఇబ్రహీంపట్నం(మైలవరం): మండలంలోని గుంటుపల్లి జెడ్పీ పాఠశాల సమీపంలో ఉన్న పంట కాలువలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం పడివుంది. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. గుంటుపల్లి జెడ్పీ పాఠశాల సమీపంలోని పంట కాలువలో మృతదేహాన్ని బుధవారం ఉదయం వ్యవసాయ కూలీలు గుర్తించి సచివాలయం ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడిని బిహార్ రాష్ట్రానికి చెందిన రామ్‌సింగ్(40)గా గుర్తించారు. భవనాలకు గ్రానైట్ రాళ్లు చేసే పనికి అతనితో పాటు మరో ఇద్దరు వచ్చారు. రామ్‌సింగ్ వంటిపై బలమైన గాయాలు ఉన్నాయి. దీంతో అతడిని హత్యచేసి కాలువలో పడేసి ఉండొచ్చని భావిస్తున్నారు. రాంసింగ్‌తోపాటు బిహార్ నుంచి వచ్చిన వారిలో ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం గుజరాత్ వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెస్ట్‌జోన్ ఏసీపీ హనుంతరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఉన్న గాయాలను బట్టి హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏసీపీ తెలిపారు. సీఐ పి.శ్రీను, ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని దంపతుల దుర్మరణం



శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ (ఫైల్)

రామవరప్పాడు(గన్నవరం): పట్టాలు దాటుతున్న దంపతులను వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విజయవాడ సమీపంలోని రామవరప్పాడు రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి జరిగింది. గుణదల కుమ్మరి బజారులో సుంకర శ్రీనివాసరావు (43), వెంకటేశ్వరమ్మ (42) దంపతులు నివసిస్తున్నారు. వారికి 17 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమారులు సంతానం. శ్రీనివాసరావు ఓ ప్రైవేటు కాలేజీలో గణిత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరమ్మ సోదరుడు చెరుకుమల్లి వేణు భార్య కంటి ఆపరేషన్ చేయించుకోవడంతో పరామర్శించేందుకు మంగళవారం గుడివాడ సమీపంలోని ఇందుపల్లికి వెళ్లింది. పరామర్శించి సాయంత్రం నర్సాపూర్ - గుంటూరు ప్యాసింజర్ ట్రైన్‌లో వెంకటేశ్వరమ్మ విజయవాడకు బయలుదేరింది. భర్త శ్రీనివాసరావుకు ఫోన్ చేసి రామవరప్పాడు రైల్వే స్టేషన్‌కు రావాలని కోరింది. సాయంత్రం 6.30 గంటల సమయంలో ట్రైన్ దిగి రామవరప్పాడు స్టేషన్ మూడో నంబరు ప్లాట్‌ఫాంపైకి చేరుకుంది. శ్రీనివాసరావు ఆ ప్లాట్‌ఫాంపైకి వెళ్లి భార్యతో కలిసి లగేజీ తీసుకుని స్టేషన్‌లోని పట్టాలు దాటి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లే క్రమంలో కొట్టాయం ఎక్స్‌ప్రెస్ దూసుకొచ్చింది. తోటి ప్రయాణికులు వారిని అప్రమత్తం చేసేందుకు కేకలు వేశారు. అయితే శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ కంగారులో పట్టాలు దాటలేకపోయారు. ఇంతలో ట్రైన్ వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పెనమలూరు: మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలపై పెనమలూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు గ్రామానికి చెందిన చేవూరి రఘునాథ్ (40) పెయింటర్‌గా జీవిస్తున్నాడు. అతను బుధవారం పెద్దగుడి మలుపు వద్ద ఉండగా పదో నంబరు సిటీ బస్సు ఢీకొట్టింది. బస్సు వెనుక చక్రాలు అతని తలపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో..

గంగూరు పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి చెందాడు. ఈడుపుగల్లుకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఇందుపల్లి సుధాకరరావు (45) ఈ నెల 25వ తేదీ రాత్రి బైక్‌పై వెళ్తుండగా గంగూరు పెట్రోల్ బంక్ డివైడర్ కటింగ్ వద్ద కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సుధాకరరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కానూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతను మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమార్తె ఇందుపల్లి సాధన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య



చిన్న పున్నయ్య మృతదేహం

వీరులపాడు(నందిగామ): ఆర్థిక ఇబ్బందులు తాళలేక కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ మహాలక్ష్మణుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గల్లా చిన్న పున్నయ్య (38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చే దారి లేక మంగళవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని చిన్నపున్నయ్యను హుటాహుటిన కంచికచర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ మహాలక్ష్మణుడు తెలిపారు.

ట్రాక్టర్ పల్టీ కొట్టి డ్రైవర్ మృతి



శివకృష్ణ మృతదేహం

వీరులపాడు(నందిగామ): ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీకొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం మండలంలోని పెద్దాపురం గ్రామంలో జరిగింది. మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన అనుమోలు శివకృష్ణ (19) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ట్రాక్టర్‌పై పెద్దాపురం బయలుదేరాడు. తెలంగాణ నుంచి కంచికచర్ల వైపు వస్తున్న లారీని తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పి కందకంలో పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శివకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు వాహనాలు ఢీ.. ప్రయాణికులకు గాయాలు



కాసానగర్ వద్ద ప్రమాదానికి గురైన బస్సు, పాల వ్యాన్

మోపిదేవి(అవనిగడ్డ): ఆర్టీసీ బస్సు, పాల వ్యాను ఢీకొన్న ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం జరిగింది. చల్లపల్లి వైపు నుంచి అవనిగడ్డ వస్తున్న ఆర్టీసీ బస్సు, అవనిగడ్డ వైపు నుంచి చల్లపల్లి వైపు వెళ్తున్న పాల వ్యాన్ కాసానగర్ వద్ద ఎదురెదురుగా ఢీన్నాయి. మంచు దట్టంగా కురుస్తుండటంతో అతి సమీపంలోకి వచ్చే వరకు ఇద్దరు డ్రైవర్లకు ఎదుటి వాహనాలు కనిపించలేదు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. బస్సులోని ప్రయాణకులు పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానమే పెనుభూతమై..

భార్య గొంతు కోసి హతమార్చిన భర్త



మేరి మృతదేహం



తల్లిమృతితో తల్లడిల్లుతున్న కుమారులు

వీరులపాడు(నందిగామ): కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకున్న భర్త కత్తితో ఆమె గొంతుకోసి హతమార్చాడు. ఈ ఘటన వీరులపాడు గ్రామంలో బుధవారం వేకువజామున వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. వీరులపాడు గ్రామానికి చెందిన బంకా మేరి (30)కి పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బంకా సుందరరావుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలం కాపురం సజావుగానే సాగింది. మూడేళ్లుగా భార్యపై అనుమానంతో సుందరరావు తరచూ ఆమెతో ఘర్షణ పడుతుండేవాడు. నెల రోజుల క్రితం భర్తతో గొడవపడిన మేరి తన ఇద్దరు కుమారులను తీసుకుని వీరులపాడులోని పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో మేరి ఇకమీదట తాను శివాపురానికి రానని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో ఇద్దరికీ సర్దిచెప్పి కొంత కాలం దంపతులిద్దరూ వీరులపాడులోనే నివాసం ఉండాలని సూచించారు. దీంతో 15 రోజుల క్రితం వీరులపాడులో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో సుందరరావు విజయవాడ నుంచి ఆటోలో వీరులపాడు చేరుకున్నాడు. ఆ సమయంలో మేరి తండ్రి మండూరి చిన్న అక్కడే ఉండటంతో రోజూ మాదిరిగా పిల్లలను తన తండ్రితో పంపించింది. ఇదే అదునుగా భావించిన సుందరరావు తనతో తెచ్చుకున్న కత్తితో భార్య గొంతు కోశాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకున్న తరువాత ఆటోలో పరారయ్యాడు. తెల్లవారుజామున మేరి తండ్రి, కుమారులు వచ్చి చూడగా ఆమె రక్తపు మడుగులో పడి ఉంది. అది చూసి కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ జనార్దన్‌నాయుడు, సీఐ నాగేంద్రకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఏసీపీ మాట్లాడుతూ.. పరారీలో ఉన్న నిందితుడు సుందరరావు కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి 4 నెలల జైలు శిక్ష

జగ్గయ్యపేట అర్బన్: చోరీ కేసులో నిందితునికి నాలుగు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 2022లో జగ్గయ్యపేటలో జరిగిన చోరీకి సంబంధించి పట్టణంలోని సత్యనారాయణపురానికి చెందిన బోనం అశోక్‌పై టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు విచారణలో అతడిపై నేరం రుజువు కావడంతో అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శోభారాణి బుధవారం నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

ఒడిదుడుకులు ఎదుర్కోవడంపై అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగం చేసే మహిళలు జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ వీరరాఘవయ్య అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న వీరరాఘవయ్య మాట్లాడుతూ దేశాభివృద్ధికి, కుటుంబంలో మెరుగైన జీవనానికి మహిళలు తప్పనిసరిగా ఉద్యోగం చేయాలన్నారు. నేడు ఉద్యోగం చేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరిస్తూ, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన విధానాలు వివరించారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత, కార్యనిర్వాహణాధికారి ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు నలంద ఎన్‌సీసీ కేడెట్



ఆర్‌డీ పరేడ్‌కు ఎంపికైన సాయిశ్రీ

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు నలంద డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌డి సాయిశ్రీ ఎంపికై ంది. ఆర్‌డీసీ క్యాంపులో పాల్గొనేందుకు బుధవారం వెళ్లినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ యం. అనురాధ తెలిపారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఏడు క్యాంపుల్లో పాల్గొన్న డి.సాయిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సెలక్ట్ అయింది. ఆ క్యాంప్‌లో సాయిశ్రీ డ్యాన్స్, సింగింగ్, స్కిట్, ఇన్‌స్ట్రుమెంట్ విభాగాల్లో సత్తా చాటింది. దీంతో రిపబ్లిక్ డే పేరేడ్‌కు ఎంపికైంది. సాయిశ్రీని నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ. విజయబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి ఉచిత గైడెన్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలకు వెళ్లే అభ్యర్థులకు సీనియర్ ఐఏఎస్ , ఐపీఎస్ అధికారులతో ఉచితంగా మాక్ ఇంటర్వ్యూస్, ఇంటర్వ్యూ గైడెన్స్ ఇవ్వనున్నట్లు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని తమ సంస్థలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత సర్వీసులు లక్ష్యాలను నెరవేర్చుకునేలా అభ్యర్థులకు తమ సంస్థలో సీనియర్ అధికారులతో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మాజీ చీఫ్ సెక్రటరీ కేవీఎస్ కుమార్, మాజీ అదనపు డీజీపీ జీహెచ్‌పీ రాజు, అడిషనల్ డీజీపీ శంఖబ్రతాలతో పాటు మరికొందరు ఆఫీసర్స్‌లో కలిసి బెంజిసర్కిల్ బ్రాంచ్‌లో ఈ నెల 30 నుంచి ఉచితంగా మాక్ ఇంటర్వ్యూస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి 9494188688 నంబరులో కానీ, శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వెబ్‌సైట్‌లో ఉచితంగా లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చునని సూచించారు.

మానవత్వం చాటుకున్న ఆత్కూరు పోలీసులు

ఉంగుటూరు: రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వృద్ధుడిని ఆత్కూరు పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం పెద అవుటపల్లి–తెంపల్లి రోడ్డులో రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి రెండు రోజులుగా సంచరిస్తున్నాడు. బుధవారం ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అటుగా వెళ్లేవారు చూస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఓ వ్యక్తి ఆత్కూరు పోలీసులకు విషయాన్ని తెలియజేయగా, తక్షణమే స్పందించిన ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందిని సంఘటనా ప్రదేశానికి పంపించారు. ఆ వ్యక్తి నీరసంగా అపస్మారకస్థితిలో ఉండటాన్ని గమనించిన పోలీసులు 108 అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స అందిస్తున్నారు. మానవత్వం చూపిన పోలీసులను స్థానికులు అభినందించారు.

యనమలకుదురులో స్కూటీ దగ్ధం

పెనమలూరు: యనమలకుదురులో ఇంటి ఎదుట ఉంచిన బైక్ దగ్ధమవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కర్నాటి లక్ష్మణరావు ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. 26వ తేదీ అర్థరాత్రి పని ముగించుకుని వచ్చి తన స్కూటీపై వచ్చి ఇంటి ముందు వాహనం నిలిపి ఉంచాడు. అయితే అర్థ రాత్రి గడిచిన తరువాత పక్కింటి వారు లక్ష్మణరావును లేపి స్కూటీ తగులబడుతోందని చెప్పారు. హడావుడిగా వచ్చి వాహనం మంటలు ఆర్పాడు. తన వాహనానికి ఎలా నిప్పు అంటుకుందో తెలియటం లేదని, ఈ ఘటనపై విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు.

అత్యాధునికం.. అతిసమీపం

- యూపీహెచ్‌సీల్లో ఆధునిక సేవలు
- విజయవాడలో 40 యూపీహెచ్‌సీలు
- తూర్పులో 12 యూపీహెచ్‌సీలు
- వాటిలో మూడింటికి కొత్త భవనాలు
- 63 రకాల పరీక్షలు నిర్వహిస్తున్న వైనం
- ప్రతిరోజూ 60 నుంచి 150 మందికి పరీక్షలు
- ప్రతి రోగికీ ఐడీ క్రియేట్



ఏపీఐఐసీ కాలనీ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో ఏర్పాటుచేసిన ల్యాబ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు పట్టణాల్లోని పేదలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, తాము నివశించే ఇంటి సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు, మందులు సైతం ఉచితంగా అందచేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని సైతం నియమించింది. దీంతో ఇప్పుడు యూపీహెచ్‌సీలు పూర్తిస్థాయి వైద్యం అందించే ఆస్పత్రులుగా రూపాంతరం చెందాయి. ప్రతిసెంటర్‌లో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు, డేటాఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్ గ్రేడ్ వర్కర్ సేవలు అందిస్తున్నారు. ప్రసవాలు సైతం చేసే స్థాయిగా చేరుకున్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసేందుకు మెషిన్‌లు, గైనకాలజిస్ట్ కూడా ఏర్పాటు చేశారు. యూపీహెచ్‌సీలో 63 రకాల పరీక్షలు, 182 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి.

తూర్పులో 12 యూపీహెచ్‌సీలు..

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 12 వైఎస్సార్ యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. భ్రమరాంబపురం, కృష్ణలంక, రాణిగారితోట, బాలాజీనగర్, రామలింగేశ్వరనగర్, లబ్బీపేట, పటమట అంబేడ్కర్‌కాలనీ, పటమటలంక, ఏపీఐఐసీ కాలనీ, క్రీస్తురాజుపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, కార్మికనగర్, గులాంమెహిద్దీన్‌నగర్‌లలో సేవలు అందిస్తున్నాయి. వాటిలో భ్రమరాంబపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, ఏపీఐఐసీ కాలనీల్లో ఒక్కో సెంటర్‌కు రూ. కోటిన్నర వ్యయంతో నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. వాటిలో డాక్టర్స్ రూమ్‌లు, పదిపడకలతో వార్డు, ల్యాబరోటరీ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

రోగుల వివరాలన్నీ సంక్షిప్తం..

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లిన ప్రతి రోగికి ఎలక్ట్రానిక్ ఐడీసీ క్రియేట్ చేస్తారు. ఆధార్ నంబరు, ఫోన్‌నంబరు ఆధారంగా క్రియేట్ చేసే ఐడీలో వారి ఆరోగ్య వివరాలు, పరీక్షా ఫలితాలను కూడా నమోదు చేయడంతో, వారు ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా గతంలో పొందిన చికిత్స వివరాలు, వ్యాధులు అందులో చూసి తెలుసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆధునిక సేవలు అందిస్తుండటంతో యూపీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఒక్కో యూపీహెచ్‌సీకి 60 నుంచి 150 మంది రోగులు వస్తున్నారు.

అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు..

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు, 172 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. అక్కడ సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, ఎల్రక్టాలసిస్ వంటి పరీక్షలను అత్యాధునిక పరికరాలపై నిర్వహిసున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చడంతో పాటు, వాటిపై పరీక్షలు చేసేందుకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్‌లతో ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇప్పించారు. దీంతో గర్భిణులు, బాలింతలు, రోగులకు అవసరమైన పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



ప్రస్తుతం యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. తాము నివశించే ప్రాంతంలోనే ఆస్పత్రులు ఉండటంతో ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు అక్కడకు వెళ్లి వైద్యం పొందవచ్చు. విజయవాడలో 40 యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల పరీక్షలు చేస్తున్నందున ప్రజలు వాటి సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

–డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

అన్ని రకాల పరీక్షలు అందుబాటులో



నగరంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం ఆధునిక పరికరాలు సమకూర్చింది. అక్కడ పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్‌కు సైతం నిపుణులైన టీచింగ్ వైద్యులతో శిక్షణ పొందారు. యూపీహెచ్‌సీల్లోనే పరీక్షలు అందుబాటులో ఉండటంతో షుగర్‌తో పాటు గర్భిణులకు అవసరమైన పరీక్షలు, కిడ్నీ పరీక్షలు, లివర్ పరీక్షలు అన్నీ చేయించుకోగలుగుతున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–పి.సౌభాగ్యం, ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

స్మృతి వనం పనులు పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణ పనులు పరిశీలించారు. బందర్ రోడ్ వైపు నిర్మాణం అవుతున్న ఫుట్‌పాత్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులన్నీ ఈ నెల 31 తేదీ నాటికి పూర్తవ్వాలని, ఫుట్‌పాత్‌కు గ్రానైట్ వేసేందుకు మరింత మంది కార్మికులను పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో నడిబొడ్డున 19 ఎకరాల విస్తర్ణంలో చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలో మ్యూజియంలో ప్రదర్శించే ఛాయాచిత్రాలు, కళాఖండాలు అంబేద్కర్ చిన్ననాటి నుంచి నాయకునిగా మారటానికి ఎదురైన అడ్డంకులను ఎలా అధిగమించారో వివరిస్తాయన్నారు. అంబేడ్కర్ జీవితంలో ముఖ్యమైన ఘటనలు ప్రదర్శించడానికి పార్కు వద్ద ఆధునిక ఏర్ కండిషన్ థియేటర్, మ్యూజియం, లైబ్రరీ ఉంటుందన్నారు. ఈ పర్యటనలో వీఎంసీ ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ (పార్క్స్) ఏఎస్ఎన్‌ప్రసాద్, నరసింహమూర్తి, ప్రాజెక్ట్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

డోజర్ ట్రాక్టర్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: డోజర్‌తో ఉన్న ట్రాక్టర్ చోరీ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన దండుగుల నాగరాజు డోజర్ ట్రాక్టర్‌తో పనులు చేస్తాడు. అతను కొద్ది రోజుల క్రితం పెనమలూరులో ప్లాట్‌ల వద్ద పనులకు డోజర్ తీసుకు వెళ్లి పనులు చేశాడు. మిగతా పనులు చేయటానికి డోజర్ అక్కడే ఉంచాడు. అతను మరునాడు డోజర్ ఉంచిన ప్రాంతం వద్దకు వెళ్లి చూడగా అక్కడ అది కనబడలేదు. డోజర్ ఆచూకీ కోసం గాలించినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసు విచారణ చేపట్టారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



13వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక గెలుపోటములతో సంబంధం లేకుండా అన్ని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పటమట 13వ డివిజన్‌లో రూ. 27 లక్షలతో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానికంగా ఉన్న నిడమనూరి వారి స్ట్రీట్, లుక్కా రామారావు స్ట్రీట్ వద్ద నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, బీటీ రోడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓడిపోయిన నియోజకవర్గల్లో అసలు అభివృద్ధి గురించి పట్టించుకొనేవాళ్లు కాదని తెలిపారు. ఓటు రాజకీయాలు తప్ప అభివృద్ధి చేసేవారు కాదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలతో సంబంధం లేకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. 13వ డివిజన్ లో ఇప్పటి వరకు సుమారు రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం గత పాలకుల మాదిరి కాకుండా శంకుస్థాపనల అనంతరం త్వరితగతిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేస్తున్నామని చెప్పారు. త్వరలో రోడ్లు అందుబాటులోకి వచ్చేలా కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,13వ డివిజన్ ఇంచార్జ్ రామాయణపు శ్రీనివాస్, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని విధాలుగా డివిజన్ అభివృద్ధి...

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రామలింగేశ్వరనగర్ కరకట్ట రహదారి నిర్మాణానికి గాను రూ.90 లక్షల వ్యయంతో బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ కేవలం 15వ డివిజన్‌లో సుమారు రూ.20 కోట్లకుపైగా నిధులతో పనులు చేశామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో రూ.600 కోట్లకు పైగా నిధులతో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యంతో పాటు కల్వర్టులు నిర్మించామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ అందరూ ఉన్నా ఒక్క పైసా అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వీరికి చేతకాని పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చేశామని పేర్కొన్నారు. టీడీపీ కి 2019 లో జరిగిన పరాభవం మరలా కొద్ది నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైపు ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీకి చమరగీతం పాడుతారన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తూర్పులో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు గెలుపొందని చోట రూ. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు

కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్



రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, బూత్‌లెవల్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఓటు వేసే క్రమంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ పై (ఈవీఎం)లపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఓటర్ నమోదు ప్రక్రియను జనవరి 17, 2024 వరకు పొడిగించిందన్నారు. ఆఖరి జాబితా పబ్లికేషన్ జనవరి 22, 2024 వరకు ఉన్నందున కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు మరొక అవకాశం ఉందని వెల్లడించారు. బీఎల్‌వోలు ఓటరు నమోదుపై మరోమారు దృష్టిసారించాలని కోరారు. కొత్త ఓట్లు నమోదు చేసిన తర్వాత ఒక పోలింగ్ బూత్ లో 1450 కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే అదే పోలింగ్ కేంద్రంలో ఇంకొక పోలింగ్ బూత్ ఏర్పాటుకు రూమ్‌లో వసతులు ఉన్నవీ లేనిదీ ముందుగానే పరిశీలించుకోవాలని సంబంధిత అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్‌వో) ఆదేశించారు. వై.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), ఎన్.సాంబశివరావు (టీడీపీ), సిటీ ప్లానర్ ప్రసాద్, జోనల్ కమిషనర్–2 మల్యాద్రి, సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను, నార్త్ తహసీల్దార్ ఎం.మాధురి, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) కె.రామ్మోహనరావు, వీఎంసీ ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవులు ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ కుర్వే, వేదిక మీద సూరేపల్లి రవికుమార్ కలిమిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: కవులు, రచయితలు ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలని నోబుల్ పీస్ ప్రైజ్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ కుర్వే అన్నారు. నవభారత నిర్మాణ సంఘం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ పీస్ డిటైర్‌మెంట్ అండ్ ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్, గాంధీదేశం సోషల్‌వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం రైటర్స్ మీట్, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కుర్వే మాట్లాడుతూ నేడు ప్రపంచం మొతం ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని తెలిపారు. మానవాళిని కాపాడాల్సిన బాధ్యత కవులు మీద ఉందన్నారు. ప్రజలను చైతన్య పరిచే రచనలు రావాలని అందుకోసం కవులు కృషి చేయాలన్నారు. నవభారత నిర్మాణ సంఘం చైర్మన్ సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ కవులు సమాజంలో భాగస్వాములని సమాజం కోసం సాహితీ సృజన చేయాలని సూచించారు. మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్, భాషా పరిశోధకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సాహితీవేత్తలు సత్యస్వాతి, పంతుల వెంకటేశ్వరరావు, చిత్రకారుడు కళాసాగర్ ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. నిర్వాహకులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

సాంస్కృతిక రంగ అభివృద్ధికి కృషి



గాయని షబానాను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రతినిధుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి సౌత్ సెంట్రల్ రైల్వే సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన షబానాకు ఆత్మీయ సత్కర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందని తెలిపారు. గాయని మల్లాది స్వాతి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని చెప్పారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు ప్రసంగించారు. నిర్వాహకులు షబానాను ఆత్మీయంగా సత్కరించారు. శ్యాంప్రసాద్, దుర్గానాగమణి, డేవిడ్‌రాజు, శ్రావణి చిత్ర గీతాలను ఆలపించారు.

సామాజిక బాధ్యతగా సమాజ సేవ



ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కుక్కల అనిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): తోచినంతలో సేవ చేయటం అలవాటుగా చేసుకోవాలని, సమాజ సేవను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని పనిచేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం పర్యటన సమయంలో పలువురు పేదలు తమ కుటుంబ పోషణ నిమిత్తం దారి చూపాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో 16 మంది వీధి వ్యాపారులకు మల్లాది వేంకట సుబ్బారావు, సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన తోపుడు బండ్లును కార్పొరేటర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని.. అప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ విషయంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెప్పిన మాటలు తనకు మార్గదర్శకమని తెలిపారు. ఆయన స్ఫూర్తితో 2013లో మల్లాది వేంకట సుబ్బారావు సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గిరిపురానికి చెందిన 14 కుటుంబాలకు గతంలో ఆమోదింపబడిన రెగ్యులరైజ్ పట్టాలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ (సెంట్రల్) శ్రీనివాస్ వెన్నెల, కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, కుక్కల అనిత, శర్వాణి మూర్తి, ఉమ్మడి రమాదేవి తదితరులున్నారు.

కాకాని ఆశయ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న తరుణ్ కాకాని, చిత్రంలో సమితి కార్యదర్శి గోగినేని ధనశేఖర్, లావణ్య

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):స్వాతంత్ర్య సమర యోధుడు, జైఆంధ్ర ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం ఆశయ సాధనే తమ లక్ష్యమని కాకాని ఆశయ సాధన సమితి చైర్మన్ కాకాని తరుణ్ చెప్పారు. రమేష్ ఆసుపత్రి రోడ్డులోని ఆయన కార్యాలయంలో విలేకరులతో కాకాని తరుణ్ మాట్లాడారు. బందరురోడ్డు విస్తరణలో భాగంగా కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని అధికారులు తొలగిస్తున్న సమయంలో తాము అడ్డుకుని నిరసన తెలియజేశామని పోలీసులు అరెస్ట్ చేసి అక్కడ నుంచి పంపిచేశారన్నారు. కాకాని వెంకటరత్నం విగ్రహం పునఃప్రతిష్టించాలని అప్పటి నుంచి తమ సమితి ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందచేస్తూనే ఉన్నామని చెప్పారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగకూడదని, ప్రభుత్వ ధనం వృథా కాకూడదనే కాకాని వెంకటరత్నం ఆలోచనల ప్రకారమే ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు మార్జిన్‌లో కాకాని విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. విగ్రహం ఏర్పాటు, పునఃప్రతిష్ట విషయాలను రాజకీయం చేయడం సరికాదన్నారు. ఆశయాల సాధనే తమ సమితి లక్ష్యమని సమితి కార్యదర్శి దనశేఖర్, సభ్యురాలు లావణ్య చెప్పారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం జి.సి.జి.టి.ఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే.ఆర్.జి.శేషుకుమార్ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధ్యాపకులకు రీడిజిగ్నేషన్‌ను కల్పించాలని, దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అసిస్టెంట్/ అసోసియేట్ ప్రొఫెసర్లుగా 'రీ డిజిగ్నేషన్ ' అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా యూజీసీ మార్గదర్శకాల మేరకు అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కల్పలతారెడ్డి హామీ ఇచ్చారు. డిగ్రీ లెక్చరర్లకు గత 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'రెక్కనింగ్ ఆఫ్ జూనియర్ లెక్చరర్స్ సర్వీసు సమస్యను పరిష్కరించినందుకుగానూ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొల్లేటి రమేష్ , పద్మనాభం పాల్గొన్నారు.

దుర్గాదేవి స్తుతి లోకానికి రక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అఖిల లోకానికి శక్తిని అనుగ్రహించే దుర్గాదేవి సుత్తి లోకానికి రక్షగా నిలుస్తుందని ఇచ్చాపురం నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి ప్రవచించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రికి ధర్మ ప్రచారంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కథావేదికపై బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామిజీ అమ్మవారి శక్తి, అమ్మవారి రూపాల విశిష్టతను వివరించారు. అమ్మవారి చల్లటి చూపుతో సకల శుభాలు కలుగుతాయన్నారు.

- విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువుల భారతీ తీర్థ మహాస్వామి సన్యాశ్రమ స్వీకార స్వర్ణోత్సవం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించిన ఉత్సవాలు 29 వతేదీ ముగుస్తాయని ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 రోజులపాటు శృంగేరీ జగద్గురువల వైభవం అంశంగా ప్రసంగాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్ట్ జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా...

నేడు శ్రీవారి ప్రణయ కలహ మహోత్సవం

తిరుమల: శ్రీవేంకటేశ్వరస్వామి తన దేవేరులతో కలిసి పాల్గొనే ప్రణయ కలహ మహోత్సవం గురువారం తిరుమలలో నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు బంగారు పల్లకిలపై వేర్వేరుగా వైభవోత్సవ మండపం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీ వరాహస్వామి ఆలయం వద్ద ఒకరికొకరు ఎదురేగుతారు. ఇక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్ల తరపున వేర్వేరుగా ఆళ్వారు దివ్యప్రబంధంలోని పాశురాలను స్తుతిస్తారు. ఆ తరువాత అమ్మవార్లు స్వామి వారిని నిందాస్తుతి చేసిన అనంతరం ఒకరిపై ఒకరు పూలబంతులను విసరడం, స్వామి వారు పుష్పఘాతం నుంచి తప్పించుకోవడం వంటి ఆసక్తికరమైన సన్నివేశాలతో ఈ ప్రణయ కలహ మహోత్సవం నిర్వహిస్తారు.

వైభవంగా భూతప్పల ఉత్సవం



భక్తులను తొక్కుకుంటూ వస్తున్న భూతప్పలు

మడకశిర: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలంటే భక్తులకు గుర్తుకొచ్చేది భూతప్పల ఉత్సవం. ఇలాంటి ఉత్సవం రాష్ట్రంలో మరెక్కడా ఉండదేమో! ఏటా మార్గశిర శుద్ధపౌర్ణమిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. వారం రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో భూతప్పల ఉత్సవం, జ్యోతుల ఉత్సవం ముఖ్యమైనవి. బుధవారం నిర్వహించిన భూతప్పల ఉత్సవానికి కర్ణాటకలోని బెంగళూరు, తుమకూరు, కోలార్, చిత్రదుర్గ, దావణగెరె, మన రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, తమిళనాడులోని కొన్ని జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తులు తడి దుస్తులతో బోర్లా పడుకుని భూతప్పల కాలి స్పర్శ కోసం ఎదురు చూసిన దృశ్యం ఆకట్టుకుంది. వారి కాలి స్పర్శ తగిలితే తమ కోర్కెలు, కష్టాలు తీరతాయని భక్తుల నమ్మకం.

ముక్కంటి సేవలో లోక్‌సభ అంచనాల కమిటీ చైర్మన్



ధ్వజస్తంభం వద్ద కమిటీ చైర్మన్, సభ్యులు

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని లోక్‌సభ అంచనాల కమిటీ చైర్మన్ సంజయ్ జైశ్వాల్, సభ్యులు సుదర్శన్ భగత్, మోహన్‌లాల్ కల్యాణీజి కుందారియా, ప్రతాప్ సింహ, ప్రశాంత్ రాజన్, కేశినేని శ్రీనివాస్, ప్రశాంత్ రాజన్ బుధవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు.

'వ్యూహం' ప్రదర్శన ఆపండి

హైకోర్టులో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిల్

సాక్షి, అమరావతి: 'వ్యూహం' సినిమా ప్రదర్శనను అడ్డుకోవాలని కోరుతూ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యాన్ని విచారణకు పిలవగా.. పిటిషనర్ తరపు న్యాయవాది ఎవరూ రాకపోవడంతో ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 24కి వాయిదా వేసింది. రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో 'వ్యూహం' సినిమాను రూపొందించిన విషయం తెలిసిందే.

ప్రజాప్రతినిధులపై పెండింగ్‌లో 78 కేసులు

- హైకోర్టుకు నివేదించిన విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: ప్రజా ప్రతినిధులపై 78 కేసులు తమ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం బుధవారం హైకోర్టుకు నివేదించింది. కొన్ని కేసుల్లో స్టేలు, మరి కొన్నింటిలో సమన్లు జారీ అయ్యాయని పేర్కొంది. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయని, కొందరు నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించింది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, అడ్వకేట్ జనరల్ (ఏజీ) హాజరు నిమిత్తం విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద రావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసుల్లో సత్వర విచారణ నిమిత్తం తగిన చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు హైకోర్టు ఈ చర్యలు చేపట్టింది. సుప్రీం ఈ వ్యవహారాన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా మలిచిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గత వారం విచారణ చేపట్టిన ధర్మాసనం, ప్రజా ప్రతినిధులపై ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో తెలియజేయాలని ప్రత్యేక కోర్టును ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ప్రత్యేక కోర్టు కేసుల వివరాలను ధర్మాసనం ముందుంచింది.

1,555 కి.మీ. జలమార్గాల్లో సరుకు రవాణా



సమావేశంలో పాల్గొన్న 'చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అధికారులు, ప్రతినిధులు

- కోస్టల్ షిప్పింగ్‌ను ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్‌తో అనుసంధానం
- ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంతర్గత జలరవాణా అభివృద్ధిపై దృష్టిసారిస్తున్నట్టు ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ చెప్పారు. త్వరలోనే జలరవాణా, కార్గో రవాణాలో భాగంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) తీసుకొస్తామన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ సంయుక్తంగా బుధవారం విజయవాడలో వివిధ స్టేక్ హోల్డర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సరుకు రవాణా రంగంలో జలరవాణా గ్రోత్ ఇంజన్‌గా మారుతోందన్నారు. కాలుష్యంతోపాటు ప్రతి కిలోమీటరుకు టన్ను సరుకు రవాణాలో రైలు కంటే 18 శాతం, రోడ్డు మార్గం కంటే 54 శాతం ఖర్చు తగ్గుందని చెప్పారు. ఈ క్రమంలోనే లాభదాయక వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని నదీమార్గాల సామర్థ్యాల పెంపుపై సాంకేతిక పద్ధతిలో సర్వేలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కృష్ణా, గోదావరితో పాటు సుమారు 57 చిన్న, పెద్ద నదులున్నాయన్నారు. వీటిద్వారా 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరరేఖలోని కోస్టల్ షిప్పింగ్‌ను ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్‌తో అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. వీటిల్లో దాదాపు 1,555 కిలోమీటర్ల పొడవైన 11 నదులు/కాలువలు సరకు రవాణాకు అనువైన జలమార్గాలుగా మారతాయని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంతర్గత జలరవాణాలో ఏటా 8 మిలియన్ టన్నుల సరుకు

ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ సీఈవో ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏపీకి నేషనల్ వాటర్‌వేస్ (ఎన్‌డబ్ల్యూ)4 నంబరును కేటాయించగా.. దాదాపు 90 శాతం జలమార్గం ఏపీలోనే ఉందని చెప్పారు. కృష్ణానదిలో (వజీరాబాద్-విజయవాడ) 157 కిలోమీటర్లు, గోదావరిలో (భద్రాచలం-రాజమహేంద్రవరం) 171 కిలోమీటర్లు, కాకినాడ కెనాల్ (కాకినాడ పోర్టు-ధవళేశ్వరం) 50 కి.మీ., ఏలూరు కెనాల్ (రాజమహేంద్రవరం-విజయవాడ) 139 కి.మీ., కొమ్మమూరు కెనాల్ (విజయవాడ-పెదగంజాం) 113 కి.మీ., నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ (పెదగంజాం-తడ) 258 కి.మీ. మేర ఏపీ జలమార్గం విస్తరించిందని వివరించారు. వీటితో పాటు ఎన్‌డబ్ల్యూ 79 కింద పెన్నానది (పోతిరెడ్డిపాలెం-కుడితిపాలెం/బంగాళాఖాతం) 32 కిలోమీటర్లు, ఎన్‌డబ్ల్యూ 104 కింద తుంగభద్ర నది (కిండి సింగవరం-జోహ్రాపురం) 58 కి.మీ. ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఏపీలో ఏడాదికి ఎనిమిది మిలియన్ టన్నుల అంతర్గత జలరవాణా జరుగుతోందన్నారు. సిమెంట్ పరిశ్రమల క్లస్టర్లలో భాగంగా ముక్త్యాల నుంచి మచిలీపట్టణం, కాకినాడ పోర్టుకు సరుకు రవాణా చేసేలా అనుసంధానం చేస్తున్నామన్నారు. కడప ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలు, పవర్ ప్లాంట్లకు పెన్నా నది ద్వారా కృష్ణపట్నం ఓడరేవుకు జలమార్గం కలిసొస్తుందన్నారు. గండికోటలో క్రూజ్ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. కృష్ణానది తీరంలోని 8 ప్రముఖ ఆలయాల సందర్శనకు టెంపుల్ టూరిజం ప్రాజెక్టు చేపట్టామని చెప్పారు. తొలుత రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వర్చ్యువల్‌గా మాట్లాడారు. సమావేశంలో జలవనరులశాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, హెరిటేజ్ క్రూజ్ కోల్‌కత్తా ప్రతినిధి రాజ్‌సింగ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నన్ను అరెస్ట్ చెయ్యిరా.. చెయ్..

- పోలీసులపై జేసీ ప్రభాకర్‌రెడ్డి దుర్భాషలు
- రోడ్డుపై పడుకుని హంగామా



ఎస్‌ఐ ధరణీబాబుపై చిందులు తొక్కుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: 'రేయ్.. అరెస్టు చెయ్.. నీ యమ్మా.. ఖాకీ డ్రెస్సులేసుకుని సిగ్గులేదు.. రేయ్ నేను రెడీగున్నా.. అరెస్ట్ చెయ్.. చెయ్ రా చెయ్' అంటూ అనంతపురం జిల్లా తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసులను నానా దుర్భాషలాడారు. రోడ్డుపై పడుకుని హంగామా సృష్టించారు. రెండు రోజుల కిందట జేసీ ప్రభాకర్‌రెడ్డి పట్టణ సుందరీకరణ పేరుతో సీబీ రోడ్డులోని విద్యుత్ స్తంభాలకు డెకరేషన్ బల్బులను ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ కమిషనర్ జి.రవిని అనుమతి కోరారు. తర్వాత మునిసిపల్ సిబ్బందితో కలసి దగ్గరుండి డెకరేషన్ లైట్లు వేయించడానికి బయలుదేరారు. అయితే స్తంభాలకు ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాలను పనిగట్టుకుని తొలగిస్తుండటంతో ఆ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని జేసీ ప్రభాకర్.. తన అనుచరులతో కలిసి నడిరోడ్డుపై బైఠాయించి నానా హంగామా సృష్టించాడు. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఎస్‌ఐలు రామకృష్ణ, గౌస్‌మహ్మద్‌లు అక్కడికి చేరుకుని మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి జెండాలను తొలగింపజేస్తామంటూ హామీ ఇవ్వడంతో జేసీ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కానీ బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో వెంకటేష్‌ను టీడీపీ కౌన్సిలర్లు కలసి సీబీ రోడ్డులోని విద్యుత్ స్తంభాలకు ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాలు తొలగించాలంటూ వినతిపత్రం ఇవ్వడమే కాకుండా.. అక్కడే బైఠాయించారు. ఇది తన పరిధిలోని అంశం కాదని, అనవసరంగా రాద్ధాంతం చేయకుండా మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆర్డీవో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. బుధవారం సాయంత్రం జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలసి అర్బన్ పోలీస్‌స్టేషన్ వద్దకొచ్చారు. వచ్చీ రాగానే గట్టిగా కేకలు వేస్తూ నానా హంగామా సృష్టించాడు. ఎస్‌ఐ ధరణీబాబు, రామకృష్ణ, గురుప్రసాద్‌రెడ్డి వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. వారిపై తిట్ల దండకాన్ని అందుకున్నారు. పోలీసులు సంయమనం పాటిస్తూ నచ్చజెప్పేందుకు ఎంత ప్రయత్నించినా వినలేదు. చివరకు ఆయనను అరెస్ట్ చేసేందుకు జీపును తీసుకొచ్చేందుకు పోలీసులు సిద్ధమవగా నడిరోడ్డుపై పడుకుండిపోయాడు. పోలీసులు అతన్ని జీపులోకి ఎక్కించుకుని స్థానిక పుట్లూరు రోడ్డులో వదిలేయడంతో అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయాడు.

ఏపీ కాంగ్రెస్ నేతలతో అధిష్టానం మంతనాలు

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై సీనియర్లకు దిశానిర్దేశం
- 700 పేజీల యాక్టివిటీ రిపోర్ట్ అందించిన ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు
- ఏపీ సభలకు రావాలని ఖర్గే, రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధత, వ్యూహాలు, పొత్తులు, చేరికలు, పార్టీ బలోపేతం, ప్రజలకు గ్యారెంటీలపై రాష్ట్ర నాయకులకు కాంగ్రెస్ అధిష్టానం దిశానిర్దేశం చేసింది. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏపీ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం రెండున్నర గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు సహా రాష్ట్ర నేతలు పలువురు పాల్గొన్నారు. ఏపీలో కాంగ్రెస్ విజయానికి రూపొందించిన యాక్షన్ ప్లాన్ నివేదికను రుద్రరాజు అధిష్టానం ముందుంచారు. 700 పేజీల యాక్టివిటీ రిపోర్ట్‌ను కూడా ఇచ్చారు. జనవరి నెలలో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న మూడు సభలకు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించారు. హిందూపురంలో ఖర్గే, విశాఖలో రాహుల్ గాంధీ, అమరావతిలో ప్రియాంక గాంధీ సభలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు హైకమాండ్ పెద్దలకు వివరించారు. ఈ సమావేశంలో రుద్రరాజుతో పాటు సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, ఇతర నేతలు పళ్లంరాజు, డా.చింతామోహన్, కొప్పుల రాజు, హర్ష కుమార్, తులసిరెడ్డి, సుంకర పద్మశ్రీ, మస్తాన్ వలీ, మధు యాదవ్ పాల్గొన్నారు.


ఏపీలో ఎన్నికలకు ప్రణాళిక : మాణిక్కం ఠాగూర్

సమీక్ష సమావేశం అనంతరం ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ మాట్లాడుతూ.. ఏపీలో 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. మోదీ వివక్షాపూరిత వైఖరి కారణంగా ఏపీ నష్టపోయిందన్నారు. యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ భావజాలం కలిగిన అందరినీ కాంగ్రెస్ కుటుంబానికి తిరిగి రావాలని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ షర్మిల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని, ఆమెను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తామని, ఆమె చేరికపై ఖర్గే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్‌తో కలిసొచ్చే పార్టీలను ఆహ్వానిస్తున్నామన్నారు. సీట్ల సర్దుబాటు, పొత్తులపై చర్చ జరగలేదన్నారు. గత రెండు పర్యాయాలు ఏపీలో కాంగ్రెస్ వరుసగా ఓడిపోయినప్పటికీ, ఇప్పుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఈ పదేళ్లలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏపీకి ఏదీ చేయకపోగా, అన్యాయం చేసిందని అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తున్నారని, పోలవరం ముందుకు సాగలేదని తెలిపారు.ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం రానున్న 100 రోజుల్లో ప్రజాక్షేత్రంలో ఎలా పని చేయాలి, విపక్ష కూటమి పార్టీలతో ఎలా సమన్వయం చేసుకోవాలో ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. కర్ణాటక, తెలంగాణలో ఇచ్చిన గ్యారంటీలను ఉదహరిస్తూ ఏపీలో ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు.

పండుగలా రూ.3 వేల పింఛన్ పంపిణీ

ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు

- సంక్షేమ పథకాలను మరింత బలంగా జనంలోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ
- వైఎస్సార్‌సీపీకి డిమాండ్ ఉంది.. ఫామ్‌లో ఉన్నాం
- ఇమడలేని వారు పోతుంటారు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా.. వివక్షకు తావు లేకుండా.. అందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. జనవరి 1 నుంచి పింఛన్‌ను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచి.. పంపిణీ చేసే కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుమారు 66 లక్షల మందికి పింఛన్ ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత ఫైనల్ ఇన్‌స్టాల్‌మెంట్‌ను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏం చెప్పారంటే..

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో కూడా అందరి భాగస్వామ్యం ఉండేలా చేస్తాం.
- ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. అభ్యర్థులు ఎక్కడైనా మార్పులు జరిగి ఉంటే వారిని పరిచయం చేయడం, బలోపేతం చేయడం, పార్టీ మొత్తం వారితో సమన్వయం చేయడంపై చర్చ జరిగింది. అభ్యర్థుల మార్పు వీలైనంత త్వరగా జరిగిపోతుంది. మార్పు తర్వాత రీజనల్ కోఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటారు.
- వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉంది. ఏ కారణాల వల్లనైనా ఎవరైనా పక్కకు వెళ్తుంటే, ఇక్కడ ఇంతకు మించి ఎదుగుదల లేదని వాళ్లు అనుకుంటే అలాంటి వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాం. మా పార్టీకి డిమాండ్ ఉంది. ఫామ్‌లో ఉన్నాం. ఇమడలేని వారు పోతుంటారు. 23 మందిని చంద్రబాబు అడ్డంగా కొంటే అప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా.. పోతేపోనీ కొత్తవారు వస్తారనే ఉద్దేశంతోనే జగన్ చూశారు. ఇలాంటి చిన్నచిన్న వాటికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. పోయిన వారి గురించి మేం కామెంట్ చేయదలచుకోలేదు.
- ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆ మధ్య నలుగురిని సస్పెండ్ చేశాం. పార్టీ విధానాలు కుదరడం లేదనుకునే వారు పోతుంటారు. ఇలాంటి వారు ఉంటే పార్టీకి పోనుపోనూ ఇంకా నష్టం కలిగే అవకాశం ఉంటుంది. అలాంటి వారి మీద చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పటి నుంచి జగన్ ఆలోచన విధానాన్ని గమనిస్తే, పార్టీనుంచి ఎవరైనా వారి ప్రయోజనాల కోసం వెళ్తుంటే దాన్ని అంతే బ్రాడ్ మైండ్‌తో చూడటం అనేది అలవాటు అయ్యింది. ఒక నాయకుడితో అనుబంధం ఉన్నాక అందులో మార్పులు జరిగినప్పుడు కిందవాళ్లకు కొత్తవారితో అడ్జస్ట్ కాగలమా అనేది ఒక డైలమా రావచ్చు. అప్పుడు అసంతృప్తులు రావొచ్చు. వారికి నచ్చజెప్పేందుకే ఈ యంత్రాంగం అంతా నాతో సహా రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు పని చేస్తున్నాం. చాలావరకు విజయవంతం అవుతాయి.

మేత భూముల్లో మైనింగా?

అనుమతి ఇచ్చిన అధికారులను ప్రతివాదులుగా చేర్చండి ● హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పశువుల మేతకు ఉద్దేశించిన భూముల్లో మైనింగ్ కార్యకలాపాలకు తహసీల్దార్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనుమతినివ్వడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయా భూములను మేత బీడు భూములుగా వర్గీకరించిన రెవెన్యూ అధికారులే ఆ భూముల్లో మైనింగ్ కార్యకలాపాలకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయడం ఏంటని నిలదీసింది. ఎన్‌వోసీ జారీ చేసిన తహసీల్దార్, మైనింగ్‌కు అనుమతినిచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్‌ను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చాలని పిటిషనర్‌ను ఆదేశించింది. వీరిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామంది. విచారణను జనవరి 24కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కదిరివీడులోని మేత బీడు భూముల్లో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులివ్వడంపై హైకోర్టులో పిల్ దాఖలైన సంగతి తెలిసిందే.

19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ, సీఎం జగన్
- అంబేడ్కర్‌ను ఓ సిద్ధాంతంగా మనసావాచా నమ్మిన నేత జగన్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- తాడేపల్లిలో విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశం

సాక్షి, అమరావతి: జనవరి 19న విజయవాడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తాడేపల్లిలోని ఒక హోటల్‌లో బుధవారం జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఏ మూల నుంచి చూసినా రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ కనిపిస్తారని చెప్పారు. సామాజిక న్యాయానికి వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేసినట్లు తెలిపారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోయే బహుమానమని పేర్కొన్నారు. భారతజాతి గురించి, మనదేశం గురించి చెప్పాలనుకున్నా మొదట చెప్పాల్సిన పేర్లలో అంబేడ్కర్ పేరు ఉంటుందన్నారు. అది ప్రతి రాజకీయనేత తలుచుకునే పేరన్నారు. అంబేడ్కర్‌ని ఓ సిద్ధాంతంగా తీసుకుని మనసావాచా నమ్మిన ఏకైక నాయకుడు ఎవరైనా ఉన్నారంటే.. అది సీఎం జగన్ మాత్రమేనని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో వైఎస్ జగన్ సంకల్పం కనిపిస్తుందన్నారు. అంబేడ్కర్ ఎక్కడో ఊరిబయట కాదు.. నగరం నడిబొడ్డున ఉండాలని సీఎం జగన్ భావించారన్నారు. అదృష్టవశాత్తు విజయవాడ నగరం కూడా అందుకు చాలా సానుకూలమైందన్నారు. ప్రోగ్రెసివ్ ఆలోచనలకు పుట్టినిల్లు అయిన విజయవాడ రాజకీయపరమైన ఆలోచనలో అత్యంత అభ్యుదయకరమైన ఆలోచనలకు, స్వాతంత్ర పోరాటానికి యూనివర్సల్‌గా అన్నింటిని యాక్సెప్ట్ చేసిన నగరమని చెప్పారు. అందుకే అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి మాట్లాడుతూ రూ.400

ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి

చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్, పచ్చమీడియా కలసి ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని, విమర్శలను పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకత్వాలు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు పేదరికాన్ని ఏ విధంగా తగ్గిస్తున్నాయి, రాష్ట్రాన్ని ఏ విధంగా ప్రగతిపథంలోకి తీసుకెళ్తున్నాయనే విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం ద్వారాగానీ, ప్రెస్‌మీట్ నిర్వహించిగానీ ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని అరికట్టేవిధంగా పనిచేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో పార్టీ విధానాలు, ప్రభుత్వ విధానాలపై పార్టీ రాష్ట్ర బాధ్యులు, మంత్రులు మాట్లాడుతుంటారని, కిందిస్థాయిలో ఎస్సీ సెల్ నేతలు, జిల్లా బాధ్యులు చంద్రబాబు, లోకేశ్, టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలపై సమాధానం చెప్పాలని సూచించారు. ఎన్నికలు రానున్న తరుణంలో ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పనిచేయాలన్నారు. మన ఇంట్లో పని సానుకూలం చేసుకునేందుకు ఓ సంకల్పంతో, పట్టుదలతో ఎలా పనిచేస్తామో.. అదేవిధంగా 2024లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు.


కోట్లతో సీఎం జగన్ విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయడం పెద్ద చరిత్ర సృష్టిస్తోందన్నారు. చంద్రబాబు ఎక్కడో ముళ్లకంపల్లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తే సీఎం జగన్ మాత్రం విజయవాడలో ఎంతో విలువైన స్థలంలో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. దళితులను అన్ని రంగాల్లో పైకి తీసుకురావాలనే ఆలోచనతో ఉన్న సీఎం జగన్‌కి అందరూ అండగా నిలవాలన్నారు. దళితులంతా ఐకమత్యంగా ఉండాలని సూచించారు. టీడీపీలోని ఎస్సీ లీడర్లు కూడా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో చేయాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రతి దళిత కుటుంబాన్ని ఇన్వాల్వ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పేట, ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ గురించి తెలియజేయాలని సూచించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో సీఎం జగన్ ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. గతంలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తానని చెప్పిన చంద్రబాబు దళితులను మోసం చేశారన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని వ్యాఖ్యానించిన చంద్రబాబు.. దళితులంటే అసహ్యంగా భావిస్తారని చెప్పారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ప్రతి దళితుడు గర్వంగా ఫీలవ్వాల్సిన అంశమని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున పెట్టాలని సీఎం జగన్ గొప్ప ఆలోచన చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ దళితవర్గాలను పైకి తీసుకురావాలనేది సీఎం జగన్ దృఢసంకల్పమని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు నందిగం సురేష్, గురుమూర్తి, రెడ్డప్ప, ఎమ్మెల్సీలు ఇజ్రాయేల్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్తులు లేకపోతే అది చెల్లని పార్టీ అనుకుంటారు

ఎన్నికలు వచ్చినప్పుడు గెలిచే పార్టీలో పోటీచేయాలని చాలామంది ఆశపడతారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. టికెట్ల కోసం డిమాండ్ కూడా ఉంటుందన్నారు. నాయకులు ఎక్కువగా ఉన్నప్పుడు పోటీకి ఆశపడతారన్నారు. ఏ పార్టీలోనైనా కొన్ని అసంతృప్తులు సహజమని చెప్పారు. తాడేపల్లిలో బుధవారం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ.. తమ పార్టీ మంచి ఫామ్‌లో ఉంది కాబట్టే, పోటీచేయటానికి నాయకులు పెద్దసంఖ్యలో వస్తున్నారని తెలిపారు. అసంతృప్తుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అసంతృప్తులు లేకపోతే అది చెల్లని పార్టీ అనుకుంటారని చెప్పారు. ఎవరూ టికెట్లు అడగలేదు, డిమాండ్ లేదు.. అంటే ఆ పార్టీ ప్రజల మనసుల్లో లేనట్లేనన్నారు. నిరసనలు సాధారణమని పేర్కొన్నారు. టీడీపీ లాంటి ఎత్తిపోయిన పార్టీల్లో అయితే నిరసలు ఉండవని చెప్పారు. పోటీకి ఆశపడే వారితో మాట్లాడతామని, అందరిని ఒక తాటిపైకి తెస్తామని, అదేమీ పెద్ద విషయం కాదని ఆయన తెలిపారు.

పత్రికల ద్వారా నోటీసులు ఇచ్చేందుకు అనుమతినివ్వండి

- స్కిల్ స్కామ్ కేసులో హైకోర్టును కోరిన ఉండవల్లి
- పరిశీలన చేసి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామన్న హైకోర్టు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ తాము దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో నోటీసులు అందుకోని ప్రతివాదులకు పత్రికా ప్రకటనల ద్వారా నోటీసులు అందజేసేందుకు అనుమతినివ్వాలని పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్ తరపు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి హైకోర్టును కోరారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే నోటీసులు తీసుకోవడంలేదని, మరికొందరు నోటీసులకు విముఖత చూపుతున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో పత్రికా ప్రకటనల ద్వారా నోటీసులు అందజేసేందుకు అనుమతినివ్వాలని అభ్యర్థించారు. ఈ మేర అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేశామన్నారు. అలా అయితే ఈ అనుబంధ పిటిషన్‌ను పరిశీలించి, ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద రావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే.

పాలనా వికేంద్రీకరణతోనే

సర్వతోముఖాభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న అనంతపురం ఎంపీ తలారి రంగయ్య. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, బొజ్జా దశరథరామిరెడ్డి, ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్, కేవీ రమణ తదితరులు

సమాన, సమగ్రాభివృద్ధే రాయలసీమ ప్రజల ఆకాంక్ష

- రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు వికేంద్రీకరణ తప్పనిసరి
- సీమతోపాటు ఉత్తరాంధ్రలోనూ సుస్థిరాభివృద్ధి జరగాలి
- ఒకే రాజధానిగా అమరావతికి వంతపాడే పార్టీలను వెలివేయాలి
- వికేంద్రీకరణకు మద్దతు తెలిపే పార్టీకే అండగా ఉండాలి
- అనంతపురంలో 'సమాన, సమగ్రాభివృద్ధి' రాష్ట్ర సదస్సులో వక్తలు

అనంతపురం: పరిపాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని వివిధ రంగాలకు చెందిన మేధావులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలతోపాటు సమాన, సమగ్రాభివృద్ధే రాయలసీమ ప్రజల ఆకాంక్ష అని తేల్చి చెప్పారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పరిపాలనా వికేంద్రీకరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రాయలసీమతోపాటు ఉత్తరాంధ్రలోనూ సుస్థిరాభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు అనంతపురంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం 'సమాన, సమగ్రాభివృద్ధి' పేరుతో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతాలూ సమాన అభివృద్ధి చెందాలన్నారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు మేలు జరిగేలా రాజకీయ పక్షాలు అండగా నిలవాలని కోరారు.

హైదరాబాద్ నమూనా వద్దే వద్దు..

ఒకే రాజధానిగా అమరావతికి వంతపాడే పార్టీలను వెలివేయాలని వక్తలు పిలుపునిచ్చారు. వికేంద్రీకరణకు మద్దతు తెలిపే పార్టీకే అండగా నిలబడాలన్నారు. హైదరాబాద్‌లో మొత్తం అభివృద్ధిని కేంద్రీకరించడం వల్ల జరిగిన పరిణామాలను గుర్తు చేశారు. అదే నమూనాను అమరావతి కేంద్రంగా అమలు చేయాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. కేవలం న్యాయ రాజధానిని రాయలసీమకు ఇవ్వడానికే అంగీకరించనివారు.. సీమ వాసులకు వాటా కింద ఇవ్వాల్సిన నీళ్లు ఇస్తారా అనే అనుమానం ఈ ప్రాంత ప్రజల్లో ఉందన్నారు. తరతరాలుగా కరువుకాటకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాయలసీమకు న్యాయం జరగాలంటే పరిపాలన, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు నిర్మాణాత్మక కార్యాచరణ రూపొందించాలని కోరారు. కాగా ఈ సదస్సులో విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొని వికేంద్రీకరణకు మద్దతుగా నినదించారు. కార్యక్రమంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి, పరిపాలన వికేంద్రీకరణ ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హెచ్. లజపతిరాయ్, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి, కేసీ కెనాల్ ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు దేవగుడి చంద్రమౌళీశ్వరరెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరి రామిరెడ్డి, వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, కదలిక ఎడిటర్ షేక్ ఇమాం, సాగునీటి రంగ నిపుణులు పాణ్యం సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ హెచ్.నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, భానూజా (రెడ్‌క్రాస్ సొసైటీ, అనంతపురం), వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస రవీంద్రరెడ్డి, విద్యార్థి సంఘం నేత చంద్రశేఖర్ యాదవ్ ప్రసంగించారు. అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల భారీ ర్యాలీ..

మూడు ప్రాంతాల అభివృద్ధి- మూడు రాజధానులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురంలోని టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు.. రామాంజి, శ్రీనాథ్, బాలు, సాయికిరణ్ రెడ్డి, మంజునాథరెడ్డి, సురేష్, లివిత్, నవీన్, ఖాజా, ఇస్మాయిల్, అఫ్జల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి..

వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి, అన్ని ప్రాంతాల ప్రజలు సగౌరవంగా జీవించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక వనరులు, సాగు, తాగునీరుతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి. వివిధ సంస్థలను కూడా ఏర్పాటు చేయాలి. అధికార వికేంద్రీకరణకు చర్యలు తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. సమగ్ర వికేంద్రీకరణ ఆవశ్యకతను అందరికీ చాటి చెబుదాం.

– కేవీ రమణ, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగన్‌కు గొప్ప దార్శనికత ఉంది..

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల భావనను తెరపైకి తెచ్చారు. గొప్ప దార్శనికతతో తీసుకున్న నిర్ణయం ఇది. రాష్ట్ర ప్రజలు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అధికార కేంద్రీకరణతో తీరని నష్టం జరుగుతోంది. నవ్యాంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖను నిర్ణయించడం స్వాగతించదగ్గ విషయం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం హర్షణీయం. వెనుకబడిన ప్రాంతాలకు దక్కాల్సిన నిధులను అడ్డుకునేలా కొన్ని పార్టీల నాయకులు కుట్రపన్నుతున్నారు. వీటిని అరికట్టి వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించాం. ప్రజల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకోవాలని విన్నవించాం.

– ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్, పరిపాలన వికేంద్రీకరణ, ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్

వికేంద్రీకరణకు కట్టుబడాలి

పాలనా వికేంద్రీకరణకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి అనే నినాదాన్ని వదిలిపెట్టాలి. అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడేలా అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టో ప్రకటించాలి. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలి. కృష్ణా జలాలు ఏపీలో మొట్టమొదటిగా రాయలసీమలో ప్రవేశిస్తున్నప్పటికీ, ఈ ప్రాంతం నీటి వనరుల వినియోగంలో నిరంతరం వివక్షకు గురవుతోంది. అసమానతలు చాలా ఎక్కువగా ఉండడం సీమ ప్రాంత సమగ్రాభివృద్ధికి అవరోధంగా మారింది.

– బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

అధికార వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి

అధికార వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. అన్ని రంగాల అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం కావడంతో విభజన తర్వాత మనం చాలా నష్టపోయాం. మళ్లీ అలా కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ జరిగి రాయలసీమ, ఉత్తరాంధ్రలో కూడా వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి జరగాలి. కర్నూలులో హైకోర్టు ఏర్పాటును స్వాగతిస్తున్నాం.

– తలారి రంగయ్య, ఎంపీ, అనంతపురం

భవిష్యత్తు బాగుండాలంటే వికేంద్రీకరణ జరగాల్సిందే..

అధికార వికేంద్రీకరణ, సమాన అభివృద్ధి జరిగితేనే అందరి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వికేంద్రీకరణ, సమగ్రాభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి ఆలోచించడం సంతోషదాయకం. టీడీపీకి పరిపాలన వికేంద్రీకరణ ఇష్టం లేదు. రాష్ట్ర విభజన తరువాత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించింది. రాష్ట్ర విభజన అనంతరం గుణపాఠం నేర్చుకోవడానికి బదులుగా అమరావతి పేరిట అభివృద్ధి కేంద్రీకరణ చేయాలని నిర్ణయించి అసమానతలను పెంచి పోషించింది.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

సంతోషంగా ఉండటం అభివృద్ధి కాదా?

రాష్ట్రంలో నిష్పక్షపాతంగా అర్హులందరికీ పథకాలు

- ప్రజల్లో పెరిగిన కొనుగోలు శక్తి
- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- గత ప్రభుత్వంలో పేదలకు దక్కని సంక్షేమ ఫలాలు
- పంచాయతీల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు
- ఏపీలో పాలన ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఆదర్శం
- మళ్లీ జగన్‌కే అధికారం తథ్యం
- 'వై నాట్ 175' చర్చా వేదికలో మేధావులు

సాక్షి, అమరావతి: ''కుటుంబం బాగుంటే దేశం బాగుపడ్డట్టే.. ప్రతి మనిషికీ కనీస అవసరాలైన కడుపునిండా తిండి, ఒంటి నిండా దుస్తులు, ఉండటానికి ఇల్లు ఉంటే ఆ రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరిగినట్టే. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటం కన్నా అభివృద్ధి ఏముంటుంది.''అని ముక్తకంఠంతో మేధావులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో 'వై నాట్ 175' అనే అంశంపై రాష్ట్ర స్థాయి చర్చా వేదిక నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన పలువురు మేధావులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వాటిని కొనసాగించడానికి తిరిగి అధికారంలోకి రావాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లు ఆ పదవిలో ఉంటే రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా మారడం ఖాయమని వారు స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఎవరు ఏమన్నారంటే..

ఆట మొదలైంది

ఏపీలో రాజకీయ ఆటలపోటీ మొదలైంది. వాస్తవానికి అవాస్తవానికి మధ్య ఆట మొదలైంది. వాస్తవం జగన్ మోహన్ రెడ్డి అయితే.. అవాస్తవం ప్రతిపక్ష పార్టీలది. ఈ ఆటలో జగన్ విజయం సాధించడం ఖాయం.

– డాక్టర్ పి.ముత్యం, గుంటూరు ఏసీ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి

సమ న్యాయం

సీఎం వైఎస్ జగన్ ఆల్ రౌండర్. పక్షపాతం లేకుండా అన్ని వర్గాలకూ సమానంగా న్యాయం చేస్తున్నారు. సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆంగ్ల మాధ్యమం విద్యార్థుల అభివృద్ధికి అవసరం. తల్లిదండ్రులు ఇంగ్లిష్ మీడియాన్ని ఆహ్వానిస్తున్నారు.

–పూలబాట వెంకట్, సాహితీవేత్త

పేదలకు కార్పొరేట్ విద్య

టీడీపీ, ఇరత ప్రభుత్వాలు విద్యను వ్యాపారం చేసేశాయి. కార్పొరేట్ స్కూళ్ల అధిపతులే క్వశ్చన్ పేపర్‌ను డిసైడ్ చేసేవారు. ఇప్పుడు సామాన్య నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందేలా చేశారు సీఎం జగన్. పేద విద్యార్థులను అంతర్జాతీయ వేదికలకెక్కించారు. విద్యపై పెడుతున్న పెట్టుబడి ఫలాలు భవిష్యత్‌లో వస్తాయి. వాస్తవాలను ప్రజల వద్దకు తీసుకువెళితే 175 కష్టం కాదు.

–అశోక్‌కుమార్, కన్వీనర్, ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం

ఏపీలోనే పాలన బాగుంది

విదేశాల్లో ఉండి ఆన్ లైన్ లో తెలుగు పత్రికలు చదువుతుంటే కొన్నింటిలో శ్రీలంకలా ఏపీ మారిపోతోందని రాశారు. ఇక్కడికి వచ్చి చూస్తే జగన్ పుణ్యమా అని సంతోషంగా బతుకుతున్నామని ప్రజలు చెప్పారు. పింఛన్ కోసం పంచాయతీ వద్ద పడిగాపులు కాసే వారు. ఇప్పుడు ఉదయమే వలంటీర్ వచ్చి పింఛన్ చేతిలో పెడుతున్నారు. ఇది కదా నిజమైన సంక్షేమం. ఇప్పుడు విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల వల్ల రాష్ట్రంలో 90 శాతం విద్యావంతులు ఉంటారు. మంచి చేశానని నమ్మితేనే ఓటేయ్యండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్. కోవిడ్ లో అమెరికా లాంటి దేశాల్లోనే మొత్తం ఆగిపోయాయి. ఏపీలోనే పాలన బాగా నడిపారు.

–అగ్గి రామయ్య దేవరపల్లి, ప్రవాస భారతీయుడు

కొనుగోలు శక్తి పెరిగింది

అవినీతి లేకుండా డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్ ద్వారా నేరుగా ప్రజలకు సంక్షేమ ఫలాలిస్తున్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది. 175 నియోజకవర్గాల్లో ఎందుకు గెలవరు? జగన్ మళ్లీ అధికారంలోకి రాకుంటే సంక్షేమ పథకాలన్నీ పోతాయనే భావన ప్రజల్లో ఉంది. 40 లక్షల బోగస్ ఓట్లను ఏరేస్తుంటే అదేదో తప్పన్నట్టు మాట్లాడుతున్నారు. ఏపీకి 46 పరిశ్రమలు వచ్చాయి . చంద్రబాబు కియా, అమరావతి గ్రాఫిక్స్ పేరు చెప్పుకుని బతికేస్తున్నారు.

– ఆర్.కె. చిన్నం, ఏపీ ఇంటిలెక్చ్యువల్, సిటిజన్ ఫోరం సభ్యులు



చర్చా వేదికలో పాల్గొన్న మేధావులు

సిఫారసులు లేకుండా సంక్షేమ ఫలాలు

మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించే వ్యక్తి సీఎం జగన్. సిఫారసులు లేకుండా సంక్షేమ ఫలాలు అందేలా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఇతర రాష్ట్రాలు, విదేశీయులు సైతం ఆచరిస్తామంటున్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ అని సున్నం పెట్టారు. ఈ ప్రభుత్వంలో రైతుకు భరోసా ఇస్తున్నారు. కరోనాలోనూ కార్పొరేట్ వైద్యం అందించారు. వరదల్లో తడిసిన ప్రతిగింజా కొన్నారు. నాలుగు పోర్టులు సిద్ధమవుతున్నాయి. వందరోజుల్లో ఎన్నికలున్నాయని అశాంతి రేపడం కోసం వివిధ వర్గాలను సమ్మె వైపు రెచ్చగొడుతున్నారు.

– కె. రవిచంద్రారెడ్డి, చైర్మన్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్

మూడు ప్రాంతాల అభివృద్ధి

దేశ వ్యాప్తంగా ఏపీ వై నాట్ 175 మీద చర్చ జరగడం విశేషం. బాబొస్తే జాబొస్తుందన్నారు.. ఎవరికి వచ్చింది.అద్భుతంగా పాలన చేస్తే లోకేశ్ మంగళగిరిలో ఎందుకు ఓడిపోతాడు. 2014లో ప్యాకేజీ తీసుకుని పవన్ సపోర్ట్ చేశారు. 2019లో నేరుగా ఎన్నికలకొచ్చి ఒకేఒక సీటు గెలుచుకున్నారు. విశాఖ కేంద్రంగా పాలన జరుగుతుంది. మూడు ప్రాంతాల అభివృద్ధి జరుగుతుంది.

–మాదిగాని గురునాథం, అధ్యక్షుడు, సోషల్ డెమోక్రాటిక్ ఫ్రంట్

ఫేక్ ఫొటోలతో తప్పుడు ప్రచారం

అసత్యాలను ప్రజల మెదళ్లలో జొప్పించే ప్రయత్నాన్ని ఎల్లో మీడియా చేస్తోంది. జగన్ వస్తున్నారని రోడ్లపై గుంతలు పూడుస్తున్నారని, చెట్లు కొడుతున్నారని ఫేక్ ఫొటోలతో తప్పుడు వార్తలు రాస్తున్నారు. చంద్రబాబు హయాంలో పెట్టుబడులన్నీపేపర్లకే పరిమితమయ్యాయి.

– మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు, బెటర్ ఆంధ్రప్రదేశ్ సంస్థ

ఇది పేదలకు స్వర్ణయుగం

అన్ని స్థానాలో గెలుస్తామని చెప్పిన పార్టీ ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇది జగన్‌కు ప్రజలు ఇచ్చిన ఆత్మస్థైర్యం. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం జరుగుతోంది. ఇది పేదలకు స్వర్ణయుగం వంటిది.

–వి.వి.ఆర్.కృష్ణంరాజు, అధ్యక్షుడు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్

సగర్వంగా సర్కారు స్కూలుకు..

మా పిల్లలు సర్కారు స్కూళ్లలో చదువుకుంటున్నారని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఇప్పుడు ఉంది. ఐదు పైసలు ఖర్చు లేకుండా వైద్యం అందుతోంది. ఈనాడు పత్రిక తెలంగాణలో ఒకలా, ఏపీలో మరోలా రాస్తోంది. రాజధాని భూముల్లో రూ.కోట్ల అవినీతి జరిగింది.

– తుళ్లూరు సూరిబాబు, రియల్ ఎస్టేట్ రంగ నిపుణుడు, అడ్వకేట్

ఎందరు పీకేలొచ్చినా చేసేదేమీ లేదు

చంద్రబాబు అనలిస్ట్ ప్రశాంత్ కిషోర్‌ను తీసుకొచ్చారు. ఆయన వచ్చి ఆరేడు పాయింట్లు ఇచ్చి అవి చేస్తే తప్ప టీడీపీకి పాజిటివ్ వచ్చే అవకాశం లేదని చెప్పారట. అదొక్కటి చాలు జగన్ కు 175 సీట్లు వస్తాయని చెప్పడానికి. ఎంత మంది పీకేలు వచ్చినా చేసేదేమీ లేదు.

–పి. వరలక్ష్మి, రచయిత, సామాజిక కార్యకర్త

ఆ శక్తి జగన్‌కు ఉంది

లక్షల కోట్ల రూపాయలు గతంలో నాయకుల జేబుల్లోకి వెళ్లేవి. కాని ఇప్పుడు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళుతున్నాయి. స్వార్థపరులు, దుర్మార్గులకే జగన్ నచ్చకపోవచ్చు. కానీ 175కి 175 స్థానాలు సాధించే శక్తి జగన్‌కు ఉంది. ''

–కంబాల కృష్ణారావు, బ్యాంకింగ్ రంగ నిపుణుడు

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- అనారోగ్యం వల్ల కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు
- అందుకే పోటీ నుంచి తప్పుకుంటున్నా
- వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా.. సీఎం జగన్‌తోనే నా ప్రయాణం
- గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కంచుకోట
- పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా
- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు వెల్లడి



మార్కాపురం: అనారోగ్య కారణాలతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీచేయడం లేదని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ప్రకటించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను ఇటీవల సర్వైకల్ ఆపరేషన్ చేయించుకున్నాను. రెండు నెలలుగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాను. మళ్లీ డాక్టర్ల వద్దకు వెళ్లినప్పుడు మరో 2 నెలలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు వస్తున్న సమయంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటే బయట తిరగడం సాధ్యం కాదు. అందుకే నేను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాను. ఇటీవల సీఎం జగన్‌ను కలిసినప్పుడు నన్ను పోటీ చేయాలని ఆదేశించారు. కానీ అనారోగ్య కారణాల వల్ల పోటీలో నిలవలేకపోతున్నాను. నేను 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ఆశీస్సులతోనే పోటీ చేసి.. ఆయన కటౌట్ పెట్టుకుని ప్రచారం చేశాను. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా నా విజయానికి కృషి చేయడంతో 80,500 ఓట్ల మెజారిటీతో గెలుపొందాను. గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కంచుకోట. వైఎస్సార్‌సీపీ తరఫున ఎవరు పోటీ చేసినా కచ్చితంగా గెలుస్తారు' అని ఎమ్మెల్యే అన్నా రాంబాబు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా..

ఇటీవల తన కుటుంబాన్ని కొందరు టార్గెట్ చేసి కులం పేరుతో కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడం బాధ కలిగించిందని అన్నా రాంబాబు అన్నారు. టీడీపీ నాయకులు, మరికొందరు కలిసి తనను ఎందుకు దూషిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తాను ఏనాడూ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోనికి రానీయలేదని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉన్నానని చెప్పారు. తన ప్రయాణం సీఎం జగన్‌తోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనపై ఎటువంటి అవినీతి ఆరోపణలు కూడా రాలేదన్నారు. సీఎం జగన్ సహకారంతో గిద్దలూరు నియోజకవర్గానికి వెలిగొండ లిఫ్టు కెనాల్‌తో పాటు అర్థవీడు, రంగాపురం రోడ్డు మంజూరు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేశానని వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. తాను ఏ పార్టీలో చేరనని.. వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు.

దగ్గుబాటిది అధికారదాహం

రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: గత ఎన్నికల్లో తాను ఓడిపోవడం అదృష్టమని, గెలిచి ఉంటే తలదించుకోవాల్సి వచ్చి ఉండేదని, భగవంతుడు తనకు మేలు చేశాడని చంద్రబాబు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. బాపట్లలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. దగ్గుబాటి వ్యాఖ్యలు అక్కసు, ద్వేషంతో కూడుకున్నవన్నారు. చంద్రబాబు నాయకత్వం పనికిరాదని, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం కావాలని వైఎస్సార్‌సీపీ టికెట్ అడిగి తెచ్చుకుని పోటీచేసిన విషయం అప్పుడే మరిచావా? అని ప్రశ్నించారు. అయినా పర్చూరు నియోజకవర్గ ప్రజలు నిన్ను నమ్మక ఓడించారని పేర్కొన్నారు. దగ్గుబాటికి అధికార దాహం తప్ప మరొకటి లేదని, అందుకోసమే ఆయన భార్య ఒక పార్టీలో ఉంటే ఆయన వేరొక పార్టీలో ఉంటారని ఎద్దేవా చేశారు. అధికారం అనుభవించేందుకే వైఎస్ జగన్‌ను ఆశ్రయించారన్నారు. సీనియర్ ప్రజాప్రతినిధి అయిన దగ్గుబాటికి జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించే మనసు లేకపోతే ఎలా? అని నిలదీశారు. జగన్ ప్రభుత్వం కారంచేడులో రోడ్లు కూడా వేయలేదన్న దగ్గుబాటి విమర్శలను ఖండించారు. కారంచేడులో జగన్ ప్రభుత్వం సీసీరోడ్లు, సచివాలయం, రైతుభరోసా, హెల్త్‌క్లినిక్, నల్లకుంట డొంక అభివృద్ధి, తాగునీటి పైపులైన్, వాటర్‌ట్యాంక్ తదితర పనులకు రూ.12.08 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇప్పటికైనా దగ్గుబాటి తన వయసును దృష్టిలో ఉంచుకుని విద్వేషంతో దిగజారుడు మాటలు మాట్లాడవద్దని బత్తుల హితవు పలికారు. ఈ సమావేశంలో బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కోసం ఖర్చు చేయడం ఇదే మొదటిసారి కాదు

- ఎన్నో ఏళ్ల నుంచి నిధుల ఖర్చు
- భక్తుల ప్రయోజనాల కోసమే..
- రాజకీయ, స్వీయ ప్రయోజనాలకే పిల్.. దాన్ని కొట్టేయండి
- హైకోర్టులో టీటీడీ ఈవో కౌంటర్ దాఖలు



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం తిరుపతిలో పారిశుద్ధ్య పనులకు నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి కాదని తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ) కార్యనిర్వాహక అధికారి (ఈవో) ఏవీ ధర్మారెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఎన్నో ఏళ్ల నుంచి టీటీడీ నిధులను తిరుపతిలో పారిశుద్ధ్య, ఇతర పనులకు వెచ్చిస్తున్నామని వివరించారు. ఈ మేరకు ఆయన కౌంటర్ దాఖలు చేశారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో రోడ్ల నిర్మాణానికి, పారిశుధ్య పనులకు టీటీడీ నిధులను వెచ్చించేందుకు టీటీడీ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ నేత జి.భానుప్రకాశ్‌రెడ్డి ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం పారిశుధ్య పనుల టెండర్ ప్రక్రియ కొనసాగించవచ్చని, కాంట్రాక్ట్‌ను మాత్రం ఎవరికీ కేటాయించవద్దని ఆదేశించింది. ధర్మాసనం ఆదేశాల మేరకు టీటీడీ తరఫున ఈవో ధర్మారెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ తరఫున కమిషనర్ డి.హరిత కౌంటర్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి సీజే ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది.

ఇది టీటీడీ బాధ్యత

భక్తులు, యాత్రికుల రాకపోకలు ఎక్కువగా ఉండే టీటీడీ దేవస్థానాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ తదితరాల పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత టీటీడీపైనా ఉందని ఈ సందర్భంగా ధర్మాసనానికి ఈవో ధర్మారెడ్డి నివేదించారు. తద్వారా తిరుమల పవిత్రతను, ప్రశాంతతను కాపాడినట్లవుతుందని తెలిపారు. తిరుమలకు తిరుపతి ప్రవేశ మార్గమని, అందువల్ల తిరుపతిలో పారిశుధ్య పనులకు సహాయ, సహకారాలు అందించాలని తిరుపతి మునిసిపల్ కమిషనర్ రాతపూర్వకంగా కోరగా, ఆయన అభ్యర్థనపై టీటీడీ పాలక మండలి సమావేశంలో చర్చించామని చెప్పారు. తిరుపతిలో ప్రధాన రహదారుల నిర్వహణ బాధ్యతలన్నింటినీ మునిసిపల్ కార్పొరేషన్ చేపడుతున్నందున, పారిశుధ్య పనులకు సాయం అందించాలని పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానించిందని, దాని ప్రకారమే టెండర్లు పిలిచామన్నారు. భక్తుల విస్తృత ప్రయోజనాల నిమిత్తమే పారిశుధ్య పనులకు నిధులు కేటాయించామని, ఇందుకు చట్ట నిబంధనలు అనుమతిస్తున్నాయన్నారు. ఇందుకయ్యే వ్యయంలో మునిసిపల్ కార్పొరేషన్ 33 శాతం, టీటీడీ 67 శాతం భరిస్తాయన్నారు. గతంలో తిరుపతి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, నగరానికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం కూడా నిధులిచ్చామన్నారు. రోడ్డు విస్తరణ పనులు కూడా చేపట్టామన్నారు. భానుప్రకాశ్‌రెడ్డి వ్యాజ్యంలో ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేవని, కేవలం రాజకీయ, ప్రచార, స్వీయ ప్రయోజన వ్యాజ్యమన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యాన్ని భారీ జరిమానాతో కొట్టేయాలని ఆయన కోర్టును కోరారు.


మధ్యంతర ఉత్తర్వులు ఎత్తేయండి...

కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, వాదనలు వినిపించారు. టీటీడీ, మునిసిపల్ కార్పొరేషన్ కౌంటర్లకు తిరుగు సమాధానం ఇవ్వడానికి గడువు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది యలమంజుల బాలాజీ కోరారు. ఇందుకు సీజే ధర్మాసనం అంగీకరించింది. విచారణను జనవరి 10కి వాయిదా వేసింది.

రైతు బాగు నచ్చని బాబు బ్యాచ్

అందుకే వ్యవసాయ యాంత్రీకరణపై రామోజీ కుటిల రాతలు.. వాస్తవాలు విస్మరించి డ్రోన్లపై అవాస్తవాలతో కథనం

- సర్టిఫైడ్ పైలెట్ లేకుండా డ్రోన్ యూనిట్ల ఏర్పాటు కుదరదు
- అందుకే రైతులు, యువతకు డ్రోన్ల వినియోగంపై ప్రభుత్వం శిక్షణ
- చంద్రబాబు హయాంలో యంత్రాల కొనుగోలులో రైతులకు స్వేచ్ఛే లేదు
- నేతలు చెప్పిన కంపెనీది, చెప్పిన డీలర్ వద్దే, చెప్పిన రేటుకే కొనాల్సిన దుస్థితి
- జగన్ సీఎం అయ్యాక అన్ని అధికారాలూ రైతు సంఘాలకే
- నచ్చిన పరికరాలను నచ్చిన కంపెనీని ఎంచుకునే వెసులుబాటు
- సబ్సిడీ మొత్తం నేరుగా రైతు సంఘాల ఖాతాలకే జమ



ఏదైనా వాహనం నడపాలంటే ఆ యజమానికి తగిన శిక్షణ అవసరం. కనీస శిక్షణ, నిర్వహణపై అవగాహన లేకుండా వాహనం కొన్నా, మూలన పెట్టడం తప్ప చేసేది ఏమీ ఉండదు. ఇంత చిన్న విషయం కూడా తెలియకుండా ఈనాడు రామోజీ రావు కథనాలు అచ్చేసి ప్రజల మీదకు వదిలేస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా డ్రోన్స్ ఎగురుతోందెక్కడ? అంటూ రైతులను తప్పుదోవ పట్టించేలా ఓ కథనాన్ని ప్రచురించారు. సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్ లేకుండా డ్రోన్ యూనిట్లు ఏర్పాటు చేయడం కుదరదన్న విషయం అందరికీ తెలిసిందే. ఇందుకోసం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కిసాన్ డ్రోన్స్ కోసం ఎంపిక చేసిన రైతులకు, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తోంది. మరో వైపు అధిక సామర్థ్యంతో కూడిన డ్రోన్స్ రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న సంకల్పంతో ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే తొలుత పైలెట్ శిక్షణ పూర్తి చేయడం, తర్వాత డ్రోన్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు, మరీ ముఖ్యంగా ఎక్కువ సామర్థ్యం కలిగిన డ్రోన్స్‌ను రైతులకు అందించాలన్న సంకల్పంతో పటిష్ట ప్రణాళిక అమలుచేస్తోంది. రాష్ట్రంలో రైతు బాగుపడితే చూడలేని చంద్రబాబు, రామోజీ బ్యాచ్‌కి ప్రభుత్వ చర్యలు కంటగింపుగానే ఉంటాయి. అందుకే రామోజీ కుటిల రాతలు. అసలు ఈ కథనంలో వాస్తవం ఎంత.. ఈ నాలుగున్నరేళ్లలో ఈ ప్రభుత్వం యాంత్రీకరణకు ఏ స్థాయిలో పెద్ద పీట వేసిందో ఒక్కసారి పరిశీలిద్దాం..

- సాక్షి అమరావతి

చిత్తశుద్ధితో కిసాన్ డ్రోన్స్ ఏర్పాటుకు కసరత్తు

రైతుల పెట్టుబడులను మరింతగా తగ్గించడమే లక్ష్యంగా ఆర్బీకే స్థాయిలో వ్యవసాయ డ్రోన్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. తొలి విడతగా 2023–24లో 2వేల గ్రామాల్లో 40 శాతం రాయితీతో డ్రోన్లు ఏర్పాటు చేస్తోంది. వాణిజ్య పంటలు, ఒకే పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే మండలాలను జిల్లాకు 3 చొప్పున ఎంపిక చేసింది. ఈ మండలాల్లో కనీసం 3 గ్రామాల్లో డ్రోన్స్‌తో కూడిన యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఐదారుగురు రైతులతో సంఘాలు (సీహెచ్‌సీ) కూడా ఏర్పాటు చేసింది. తొలుత ఈ సంఘాల్లోని ఎంపిక చేసిన రైతులను డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. వీరితోపాటు గ్రామ స్థాయిలో డ్రోన్ పైలెట్‌గా ఉత్సాహవంతులైన నిరుద్యోగ యువతకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, తాడేపల్లిలోని డ్రోగో డ్రోన్స్‌ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి 369 మంది రైతులకు, 160 మంది యువతకు మొత్తం 529 మందికి శిక్షణ ఇచ్చారు. మరోపక్క డ్రోన్ల ఎంపికకు కసరత్తు చేపట్టారు. పౌర విమానయాన శాఖ ధ్రువీకరణ పొందిన వివిధ కంపెనీల డ్రోన్ల పనితీరును వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా పరీక్షించి రైతులకు ఉపయోగపడే వాటి ఎంపిక జరుగుతోంది.

అధిక సామర్థ్యం కల్గిన డ్రోన్ల కోసమే..

కనీసం 10 లీటర్ల ట్యాంక్‌తో కూడిన డ్రోన్లు 10 నుంచి 22 నిముషాలు మాత్రమే ఎగురగలవని గుర్తించారు. వీటి కంటే మెరుగైన డ్రోన్స్‌ను రైతులకు అందించే సంకల్పంతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్లను గుర్తించి అదే యూనిట్ ధరకు సరఫరా చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇలా రైతులకు పూర్తి స్థాయిలో సమర్థవంతంగా సేవలందించే డ్రోన్లను తయారు చేసేందుకు వ్యవసాయ వర్సిటీకి చెందిన అప్సరా డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ద్వారా పైలెట్ పరిశోధనలు జరుగుతున్నాయి. ఇలా డ్రోన్స్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే, వాస్తవాలను తెలుసుకోకుండా పనిగట్టుకొని రైతులను రెచ్చగొట్టేలా కుట్రపూరిత కథనాలు అచ్చేయడం ఈనాడుకే చెల్లింది.

సీఎం జగన్ పాలనలో ఎంపిక, కొనుగోలు, నిర్వహణ అంతా పారదర్శకమే

ఆధునిక యంత్ర పరికరాలను తక్కువ అద్దెకు సన్న, చిన్నకారు రైతుల ముంగిట తీసుకు రావడం ద్వారా సాగు వ్యయం తగ్గించి వారికి నికర ఆదాయం పెంచాలన్న సంకల్పంతో సీఎం జగన్ ప్రభుత్వం గ్రామ స్థాయిలో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు సంఘటితంగా ఏర్పాటు చేసుకున్న గ్రూపులకే యంత్ర పరికరాలను అందించింది. ఇందులో దళారులెవరూ ఉండరు. 2021–22లో శ్రీకారం చుట్టిన వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా విత్తు నుంచి కోత వరకు గ్రామ స్థాయిలో ప్రతి రైతుకు ఉపయోగపడేలా అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్బీకే, క్లస్టర్ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు సంఘాల (సీహెచ్‌సీ)కు 40 శాతం సబ్సిడీతో ఈ యంత్రాలని సమకూర్చింది. ఆర్బీకే స్థాయిలో రూ.15 లక్షల విలువైనవి, క్లస్టర్ స్థాయిలో రూ.25 లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్స్‌తో కూడిన పరికరాలను ఇచ్చింది. వీటి వ్యయంలో 40 శాతం సబ్సిడీ ఇవ్వగా, 10 శాతం సంబంధిత రైతు సంఘాలు సమకూర్చుకుంటే మిగిలిన 50 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా ప్రభుత్వమే కల్పించింది. ఇప్పటివరకు రూ.1052.42 కోట్ల అంచనాతో 10,444 ఆర్బీకే, 492 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో 6,362 ట్రాక్టర్లు, 492 కంబైన్డ్ హార్వెస్టర్లతో పాటు 31,356 ఇతర యంత్రాలను సమకూర్చింది. సబ్సిడీ మొత్తం రూ.366.25 కోట్లను నేరుగా సీహెచ్‌సీ రైతు సంఘాల ఖాతాల్లో జమ చేసింది. వీటి ఎంపిక, కొనుగోలు, నిర్వహణ బాధ్యతలను రైతు సంఘాలకే అప్పగించింది. ఇందులో ప్రభుత్వం లేదా ఇతర వ్యక్తుల ప్రమేయం ఉండదు. అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. ఎక్కడా పైసా అవినీతి ఉండదు. పైగా, మార్కెట్ అద్దె కంటే తక్కువ అద్దెకు వారి ప్రాంతంలో డిమాండ్ ఉన్న పరికరాలను సంఘాలే ఎంపిక చేసుకొంటాయి. అంతేకాదు.. నచ్చిన కంపెనీల నుంచి, నచ్చిన పరికరాలను కొనుక్కొనే స్వేచ్ఛనిచ్చింది. దీంతో రైతులు వారికి అవసరమైన యంత్రాలను నాణ్యత, మన్నికను పరిశీలించి మరీ కొనుక్కున్నారు. ప్రైవేటుగా యంత్ర పరికరాలకు వసూలు చేస్తున్న అద్దె కంటే తక్కువ అద్దెకు రైతులకు అందుబాటులో ఉంచారు. గ్రామంలోనే కాదు మండల స్థాయిలో ఎక్కడి నుంచైనా రైతుకు అవసరమైన యంత్రాలను బుక్ చేసుకున్న 15 రోజుల్లో పొందేందుకు వీలుగా వైఎస్సార్ యంత్ర సేవా యాప్‌ని తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రైతు సంఘాల రుణాల చెల్లింపులను కూడా పర్యవేక్షిస్తున్నారు. 2021 జనవరి నుండి ఇప్పటి వరకు 26 జిల్లాల్లో 5.15 లక్షల మంది రైతులు ఈ కేంద్రాల ద్వారా యంత్ర సేవలు పొందారు. వీరు 14.68 లక్షల ఎకరాల్లో యంత్రాలను వినియోగించారు. అద్దె రూపంలో సీహెచ్‌సీలు ఇప్పటి వరకు రూ.87.64 కోట్లు ఆర్జించాయంటే ఏ స్థాయిలో పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

బాబు హయాంలో రైతు రథాల పేరిట అంతా దోపిడీయే

చంద్రబాబు సీఎంగా ఉండగా రైతు రథాల పేరిట వ్యవసాయ యాంత్రీకరణ ఓ ఫార్సుగా నడిచింది. ఈ పథకం కొంతమందికే పరిమితమయ్యేది. అందులోనూ అనేక అవకతవకలు, అవినీతే. 2014–2019 మధ్య కేవలం 3,584 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. వీటిలో రైతులు తక్కువ, దళారులెక్కువ. వీటి ద్వారా రూ.239.16 కోట్ల సబ్సిడీతో కూడిన ట్రాక్టర్లు పంపిణీ చేశారు. రుణ సహాయానికి రైతే బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఏ కంపెనీ యంత్రం లేదా పరికరం ఏ డీలర్ వద్ద ఎంత రేటుకు కొనాలో కూడా టీడీపీ నేతలే నిర్ణయించేవారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా డీలర్లకే జమ చేసేవారు. టీడీపీ నేతలు, డీలర్లు కుమ్మక్కై మార్కెట్ రేటు కంటే 30 శాతం ఎక్కువకు అమ్మి, ఆ సొమ్మును జేబుల్లో వేసుకున్నారు. రైతు రథాల పేరిట రూ.100 కోట్లకుపైగా సబ్సిడీ సొమ్మును టీడీపీ నేతలు స్వాహా చేశారు. పైగా, రైతులకు నాసిరకం యంత్రాలు ఇచ్చారు. అవి నాలుగు రోజులకే మరమ్మతులకు గురైతే, రైతులే బాగు చేయించుకోవాల్సి వచ్చేది.

తెలంగాణ

వర్మను చంపుతాం

- బాబు, పవన్ అనుచరులమంటూ బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్జీవీ పీఏ

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మను చంపుతామంటూ నినాదాలు చేయడమే కాకుండా ఆయన అంతు చూస్తామంటూ బెదిరిస్తూ కార్యాలయం ముందు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన పీఏ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.71లోని రామ్‌గోపాల్‌వర్మ కార్యాలయం వద్దకు ఈనెల 25న రాత్రి 12 నుంచి 15 మంది వరకు వచ్చి నినాదాలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తూ ఆర్జీవీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారని తెలిపారు. ఆ సమయంలో తమతో పాటు ఆర్జీవీ గన్‌మెన్, ఇతర సిబ్బంది అడ్డుకోవడానికి యత్నించగా తమపై దాడికి పాల్పడ్డారని పీఏ జిలాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తామంతా చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్ అనుచరులమని చెప్పారన్నారు. ఈ ఘటనలన్నీ తాము వీడియో తీశామని ఇక్కడ సీసీ ఫుటేజీల్లో కూడా నమోదయ్యాయని జిలాని వెల్లడించారు. పథకం ప్రకారం ఆర్జీవీ కార్యాలయానికి వచ్చిన వీరంతా హత్యాయత్నానికి పాల్పడ్డారని, వారి నుంచి ఆర్జీవీకి ప్రాణ హాని ఉందని పేర్కొన్నారు.

కొలికపూడిపై రామ్‌గోపాల్ వర్మ ఫిర్యాదు

- నా తల నరికి తెస్తే రూ.కోటి ఇస్తానన్న కొలికపూడి
- ఈ ఆఫర్‌కు కిరాయి హంతకులు ప్రభావితమయ్యే అవకాశం..
- అందుకే పోలీసులకు ఫిర్యాదు చేశా
- సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ


డీజీపీకి ఫిర్యాదు చేస్తున్న రామ్‌గోపాల్ వర్మ

సాక్షి, అమరావతి: 'నా తల నరికితే రూ.కోటి ఇస్తానని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు చెప్పిన మాటలను 24 గంటలు గడిచినా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు ఖండించలేదు. అంటే ఆయన మాటలను వారు సమర్థిస్తున్నట్టే భావించాలి'అని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. టీవీ 5 చానల్లో ఓ డిబేట్‌లో కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రామ్‌గోపాల్ వర్మ తల నరికి తెస్తే రూ.కోటి ఇస్తానని ఆఫర్ ఇవ్వడం తీవ్ర కలకలం సృష్టించింది. దీనిపై ఈ సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో కలసి రామ్‌గోపాల్‌వర్మ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం బయట మాట్లాడారు. తనను చంపడానికి కొలికపూడి శ్రీనివాసరావు టీవీలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్న డిబేట్‌లోనే ఓపెన్ ఆఫర్ ఇచ్చారన్నారు. ఆయన మాటలతో కిరాయి హంతకులు, ఇతరులు ఎవరైనా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు ఆ డిబేట్‌కు వ్యాఖ్యాతగా సాంబశివరావు, టీవీ 5 చానల్ యజమాని బీఆర్ నాయుడుపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇలాంటి వ్యక్తులతో ఇలా హత్యకు ఓపెన్ ఆఫర్ ఇచ్చేలా కార్యక్రమాలను ఉద్దేశపూర్వకంగా ప్రసారం చేస్తున్నారని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. రోజూ పొద్దున్న లేస్తే సీఎం జగన్‌ను తీవ్ర పదజాలంతో దూషిస్తున్న లోకేశ్.. వ్యూహం సినిమాలో తాను ఏదో చెప్పానని ఊహించుకుని సినిమాను అడ్డుకునేందుకు యత్నిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బహిరంగ సభల్లో మాట్లాడటం, టీవీ డిబేట్‌లలో మాట్లాడటం, పత్రికల్లో రాయడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం అన్నవి రాజకీయపరమైన భావ వ్యక్తీకరణ అయినప్పుడు.. సినిమా ద్వారా తాను చేసేది కూడా తన భావ వ్యక్తీకరణే అవుతుందన్నారు. సినిమా చూడకుండా అందులో ఏదో ఉందని ముందుగానే విడుదలను అడ్డుకోవాలని చూడటం విడ్డూరంగా ఉందన్నారు. తాను చంద్రబాబు, లోకేశ్‌ల వ్యక్తిత్వ హననానికి పాల్పడినట్టు టీడీపీ విమర్శలను రామ్‌గోపాల్ వర్మ కొట్టిపారేశారు. రాజకీయ నేతలు రోజూ మీడియాలో మాట్లాడుతూ ప్రత్యర్థులను విమర్శిస్తుండటం కూడా వ్యక్తిత్వ హననమే అవుతుందా అని ప్రశ్నించారు. వ్యూహం సినిమా ఎప్పుడు విడుదల అన్నది కోర్టు పరిధిలోని అంశమని ఆయన చెప్పారు.

విద్యుదాఘాత బాధితులకు పరిహారం చెల్లించాల్సిందే

- చెల్లింపుల్లో మానవతాదృక్పథంతో వ్యవహరించాలి
- విద్యుత్తు సంస్థలకు స్పష్టం చేసిన విద్యుత్తు నియంత్రణ మండలి

సాక్షి, అమరావతి: విద్యుత్ ప్రమాదం ఎలా జరిగినా.. దానికి కారకులు ఎవరైనా బాధితులకు పరిహారం విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఆంధ్రప్రదేశ్ గెజిట్ విడుదల చేసింది. మనుషులు, జంతువుల ప్రాణాలు పోవడం, గాయపడటం వంటివి జరిగినప్పుడు ప్రమాదానికి గల కారణాలను విచారించి, విద్యుత్ సంస్థల తప్పిదం ఉన్నట్లు తేలితే బాధితులకు సంబంధిత సంస్థ నష్ట పరిహారాన్ని నిబంధనల మేరకు అందించడమనేది ఇన్నాళ్లూ జరుగుతోంది. ఆ ప్రమాదంలో సంస్థకు ఎలాంటి ప్రమేయం లేకపోయినప్పటికీ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని మండలి అభిప్రాయపడింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఫస్ట్ ఎమెండ్‌మెంట్ రెగ్యులేషన్స్, 2023 పేరుతో కాంపన్సేషన్ ఆఫ్ విక్టిమ్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ యాక్సిడెంట్స్ రెగ్యులేషన్స్ 2017లో సవరణలు చేపట్టింది. ఇందులో ఇటీవల లోకాయుక్త వ్యక్తీకరించిన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. ఈ డ్రాఫ్ట్ ఎమెండ్‌మెంట్‌పై ఎవరైనా తమ అభ్యంతరాలుగానీ, సూచనలుగానీ చెప్పాలనుకుంటే కమిషన్ సెక్రటరీకి ఈ మెయిల్ ద్వారా ఈ నెల 11వ తేదీలోపు వెల్లడించాల్సిందిగా కమిషన్ సూచించింది. ఇందుకు అనుగుణంగా వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ముసాయిదాలో సవరణలు చేసింది. ఈ సవరణలు అనంతరమే కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని వెల్లడించింది. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతలను ఏపీఈఆర్‌సీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. వినియోగదారుల నివాస సముదాయాల్లోనూ, విద్యుత్‌ను వినియోగించే ప్రతిచోటా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఖచ్చితంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎలాంటి లోపం లేదని నిర్ధారించుకున్న తరువాతే అనుమతినివ్వాలని ఆదేశించింది. అలాగే విద్యుత్ సంస్థలు పరిహారం చెల్లింపు విషయంలో మానవతాదృక్పథంతో వ్యవహరించాలని కమిషన్ సూచించింది. ఈ ఆదేశాలు తక్షణమే రాష్ట్రమంతటా అమలులోకి వస్తాయని ఏపీఈఆర్‌సీ స్పష్టం చేసింది.

జనసేనలో చేరిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ

- పవన్ సమక్షంలో పార్టీలో చేరిక
- ప్రత్యక్ష రాజకీయాల కోసమే పార్టీ మారినట్లు వెల్లడి

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ వంశీకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పవన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. వంశీకృష్ణ రాజకీయంగా మరింత ఉన్నత స్థితికి చేరాలని, అందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వంశీకృష్ణ మాట్లాడుతూ.. తనకు వైఎస్సార్‌సీపీలో ఎలాంటి కష్టాలు లేవని, సీఎం వైఎస్ జగన్ బాగానే చూసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కోరుకున్న స్థానంలో పోటీ చేసే పరిస్థితి లేకపోవడం వల్ల, ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలనే కారణంతో పార్టీ మారాల్సి వచ్చిందని, ఇంకో ప్రత్యేక కారణం ఏదీ లేదని చెప్పారు.

నేటి నుంచి పుస్తక మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి జనవరి 7 వరకు పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.మనోహరనాయుడు, కె.లక్ష్మయ్య చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంది జగనే





సాక్షి, అమరావతి: ప్రజల బాధలు చంద్రబాబుకు పట్టవు. సీఎం వైఎస్ జగన్ బాధితులకు మేలు చేస్తే రామోజీరావు మనసు ఒప్పుకోలేదు. ఏదో ఒక బురద కథతో బాధితులను పక్కదోవ పట్టించాలన్న దుగ్ధ ఆయనది. అందుకే ఈనాడులో ఓ అసత్య కథనం అచ్చేశారు. అసలు అగ్రిగోల్డ్ కుంభకోణం వెలుగుచూసింది చంద్రబాబు ప్రభుత్వం హయాంలోనే. అయినా లక్షలాది అగ్రిగోల్డ్ బాధితులను చంద్రబాబు గాలికి వదిలేశారు. పైగా, ఆ కుంభకోణం సాకుగా చూపి అగ్రిగోల్డ్‌కు చెందిన అమరావతిలోని అత్యంత విలువైన హాయ్‌ల్యాండ్‌ను ఆ సంస్థ నుంచి చేజిక్కించుకోవాలని చంద్రబాబు, లోకేశ్ పన్నాగాలు పన్నారు. కొన్ని ఆస్తులను మరికొందరు నేతలు అక్రమంగా గుంజుకున్నారు. అంతే తప్ప బాధితుల కోసం వీసమెత్తు కూడా పనిచేయలేదు. ఈ విషయాలన్నీ రామోజీకి ఎరుకే. కానీ, చంద్రబాబు కోసమే పనిచేసే ఆయనకు ఇవేమీ పట్టవు. సీఎం వైఎస్ జగన్ మేలు చేసిన ఏదో రకంగా బురద వేసి, బాధితులను పక్కదారి పట్టించడానికే ప్రయత్నిస్తున్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులపైనే టీడీపీ కన్ను

టీడీపీ ప్రభుత్వంలో వెలుగుచూసిన అగ్రిగోల్డ్ కుంభకోణాన్ని చంద్రబాబు, టీడీపీ నేతలు ఆస్తుల సంపాదనకు అక్షయ పాత్రగా మలచుకోవాలని పన్నాగం పన్నారు. తమను ఆదుకోవాలని అగ్రిగోల్డ్ బాధితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసినా కనికరించలేదు. కేసులను బూచిగా చూపి అగ్రిగోల్డ్ ఆస్తులను చవగ్గా కొట్టేయడానికి ఆ సంస్థ యాజమాన్యంతో తెరచాటు మంతనాలు సాగించారు. ప్రధానంగా రాజధాని అమరావతి పరిధిలో ఉన్న వందల కోట్ల విలువైన హాయ్‌ల్యాండ్‌ను హస్తగతం చేసుకోవాలని చంద్రబాబు తనయుడు లోకేశ్ పంతం పట్టారు. టీడీపీ ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరించిన ఇంటెలిజెన్స్ విభాగం ఉన్నతాధికారి ద్వారా మంత్రాంగం చేశారు. 85 ఎకరాల్లో విస్తరించిన హాయ్‌ల్యాండ్‌లో దాదాపు 25 ఎకరాల్లో భవనాలు, సామగ్రి ఉన్నాయి. ఆ భూములు, భవనాలు, సామాగ్రిని అడ్డదారిలో రూ.200 కోట్లకే హస్తగతం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అందుకోసం అగ్రిగోల్డ్ ఆస్తులను సంస్థ యాజమాన్యం అమ్మేసుకుని వ్యక్తిగత ఖాతాలకు మళ్లించేందుకు టీడీపీ ప్రభుత్వం సహకరించింది. ప్రతిఫలంగానే అగ్రిగోల్డ్ యాజమాన్యం కోట్లు విలువ చేసే కొన్ని కీలక ఆస్తులను కారు చౌకగా టీడీపీ ముఖ్యులకు విక్రయించింది. అగ్రిగోల్డ్ మాజీ వైస్ చైర్మన్ డొప్పా రామ్‌మోహన్‌రావు 2016 ఏప్రిల్ 30న టీడీపీలో చేరడం ఆ సంస్థ యాజమాన్యానికి చంద్రబాబుతో ఉన్న సన్నిహిత సంబంధాలకు నిదర్శనం. అగ్రిగోల్డ్ ఆస్తుల అటాచ్‌మెంట్ జీవో రాక ముందే 2015 జనవరి 19న టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు భార్య వెంకాయమ్మ పేరుతో అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీ అయిన రామ్ ఆవాస్ రిసార్ట్స్, హోటల్స్ గ్రూప్ డైరెక్టర్ ఉదయ్ దినకర్ నుంచి 14 ఎకరాలు కొనడం గమనార్హం. అగ్రిగోల్డ్ డైరెక్టర్లు, వారి భార్యలు, బంధువులు, బినామీల పేరుతో ఉన్న వందల కోట్ల విలువైన ఆస్తులపై అప్పట్లో సీఐడీ దృష్టి పెట్టలేదు. రూ. 976 కోట్లను 156 కంపెనీలకు మళ్లించిన విషయాన్నీ పట్టించుకోలేదు. బాధితుల గోడునూ పట్టించుకోలేదు. తక్షణం రూ.300 కోట్లు విడుదల చేసి అగ్రిగోల్డ్ బాధితులకు ఎంతో కొంత ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఒక్క పైసా విదల్చలేదు. బాధితులు మూడున్నరేళ్లపాటు పోరాటం చేసినప్పటికీ టీడీపీ ప్రభుత్వం పైసా సాయం చేయలేదు. అయినా ఈనాడు రామోజీరావు ఏనాడూ ప్రశ్నించలేదు. ఒక్క ముక్కా రాయలేదు. బాధితులపై సానుభూతీ చూపలేదు.

బాధితులను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులకు రెండు దశల్లో రూ.929.75 కోట్లు చెల్లించారు. 10.37లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకున్నారు. రాష్ట్రంలో 11,57,497 మంది డిపాజిటర్లు అగ్రిగోల్డ్ సంస్థలో రూ.3,944.70కోట్లు డిపాజిట్ చేశారు. వారిలో రూ.10వేలు లోపు డిపాజిట్ చేసినవారికి మొదటి విడతలో, రూ.20వేలు లోపు డిపాజిట్ చేసినవారికి రెండో విడతలో ప్రభుత్వం వారి డిపాజిట్ మొత్తాలను చెల్లించింది. మిగిలిన వారికి కూడా డిపాజిట్ మొత్తం చెల్లించేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే, న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాలు అడ్డంకిగా మారాయి. ఈ సమస్యల పరిష్కారానికి జగన్ ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. సీఐడీ అటాచ్ చేసిన ఆ సంస్థ భూములను వేలం ద్వారా విక్రయించి, బాధితులకు చెల్లించడానికి వేగంగా చర్యలు చేపట్టింది. అందుకోసం ఏలూరు ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. సీఐడీ అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను ఈడీ కూడా తరువాత అటాచ్ చేయడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. సీఐడీ అటాచ్ చేసిన ఆస్తులను ఈడీ అటాచ్ చేయడానికి వీల్లేదని ప్రభుత్వం న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లింది. దీనిపై ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన వెంటనే ఆస్తులు వేలం వేసి మిగిలిన బాధితులకు డిపాజిట్ మొత్తం చెల్లించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

ప్రైవేటు సంస్థ బాధితులకు అండగా నిలిచింది దేశంలో జగనే

ఓ ప్రైవేటు సంస్థ డిపాజిటర్లను మోసం చేస్తే బాధితులను ఆదుకున్న చరిత్ర దేశంలో ఎక్కడా లేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే చేసి చూపించారు. దేశంలోని మిగతా ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేశారు. అగ్రిగోల్డ్ సంస్థ 8 రాష్ట్రాల్లో 19,18,865 మంది డిపాజిటర్ల నుంచి రూ.6,380.29 కోట్లు వసూలు చేసి, వారందరినీ నిలువునా ముంచింది. ఏ ఒక్క రాష్ట్రం కూడా అగ్రిగోల్డ్ బాధితుల గోడును పట్టించుకోలేదు. రాష్ట్రంలో 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలోని పెద్దలు అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను చేజిక్కించుకునేందుకు యత్నించారు తప్ప, బాధితులకు అండగా నిలవాలని మాత్రం భావించ లేదు. కానీ, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీకి కట్టుబడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలిచారు. అయినా ఈనాడు రామోజీరావుకు కంటగింపుగానే ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి ప్రచారంలోకి వస్తే.. చంద్రబాబు చేసిన చెడు ప్రజలకు మరింతగా గుర్తుకు వస్తుందన్నదే ఆయన ఆందోళన. అందుకే అగ్రిగోల్డ్ బాధితులపై అన్యాయమంటూ రామోజీ మొసలి కన్నీరు కార్చారు.


అగ్రిగోల్డ్ బాధితులు.. వారికి ప్రభుత్వం తరపున చెల్లింపులు రాష్ట్రాలవారీగా..

రాష్ట్రం	డిపాజిటర్లు	డిపాజిట్ల మొత్తం (రూ.కోట్లలో)	ప్రభుత్వ చెల్లింపులు	లబ్ధిపొందిన డిపాజిటర్లు
ఆంధ్రప్రదేశ్	11,57,497	3,944.70	రూ.929.75 కోట్లు	10,37,877
తెలంగాణ	1,66,488	446.27	–	–
కర్ణాటక	4,81,703	1,649.39	–	–
ఒడిశా	70,820	200.07	–	–
తమిళనాడు	28,646	101.61	–	–
మహారాష్ట్ర	8,688	23.42	–	–
అండమాన్-నికోబార్	3,84212.28	–	–	
చత్తీస్‌ఘడ్	1,181	2.55	–	–
మొత్తం	19,18,865	6,380.29	రూ.929.75 కోట్లు	10,37,877

2023 - తెలంగాణ మహిళ

తమను తాము బాగు చేసుకోవడంతోపాటు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను కూడా తీర్చిదిద్దితే ఎలా ఉంటుందో ఈ యేడాది తెలుగు మహిళ నిరూపించింది. విభిన్న రంగాలలో విశేషమైన కృషి చేసి, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన తెలంగాణ మహిళను మరోసారి స్ఫురణకు తెచ్చుకుందాం. రాబోయే సంవత్సరానికి ప్రేరణగా వీరితో కలిసి మరెన్నో అడుగులు వేద్దాం.

ఈ ఏడాది స్ఫూర్తి వీరే!




ఊరంతా బాగు // మీనాక్షి గాడ్గె, సర్పంచ్

మూడేళ్లక్రితం వరకు ఒక మామూలు పల్లె అది. కానీ, నేడు దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచే స్థాయికి ఎదిగింది. దానికి కారణం సర్పంచ్ మీనాక్షి గాడ్గె. ఆమె కృషి, పట్టుదల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా గ్రామాన్ని అద్భుతమైన గ్రామంగా తీర్చిదిద్దాయి. ఇంటర్మీడియెట్ వరకు చదివిన మీనాక్షి ఏకగ్రీవంగా సర్పంచ్ పదవికి ఎన్నియ్యింది. మరుగుదొడ్లు కట్టించడం, తాగునీరు ప్రతి ఇంటికి అందేలా చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వాన నీరు ఆ గుంటలో పోయేలా చేసిందామె. వాగుపైన వంతెన కట్టించింది. పక్కా రోడ్ల నిర్మాణం, సైడు కాలవల శుభ్రత, స్కూల్‌కు కొత్త భవనం, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనను ఏర్పాటు చేయించింది. ఊళ్లో సంపూర్ణ మద్య నిషేధం అమలుతోపాటు హరిత హారంలో భాగంగా పదివేల మొక్కలు నాటించి, వాటి బాధ్యతను గ్రామస్తులే తీసుకునేలా చేసింది. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి, పంచాయితీకి లాభం చేస్తోంది. సోలార్ గ్రిడ్లు ఏర్పాటు చేసింది. ఊళ్లోనే నర్సరీ ఉంది. ఊళ్లో జరిగే అంగడిలో నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు, తడిచెత్త- పొడి చెత్త విభజనను ఇప్పుడు ప్రతి ఒక్కరూ పాటిస్తున్నారు. ఇన్ని మార్పులు తీసుకు వచ్చిన మీనాక్షిని కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఈ యేడాది స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్ అవార్డ్‌తో సత్కరించింది.

భారతజట్టులో స్థానం
గొంగడి త్రిష (యువ క్రికెటర్)



భద్రాచల వాసి త్రిష అండర్-19 మహిళల వరల్డ్ కప్ -2023 ఫైనల్లో టీమిండియాను జగజ్జేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించింది. ఫిట్‌నెస్ కోచ్ అయిన తండ్రి రామిరెడ్డి ద్వారా మూడేళ్ల వయసులోనే క్రికెట్‌లో ఓనమాలు దిద్దిన త్రిష ఎనిమిదేళ్ల వయసులో హైదరాబాద్ అండర్ -16 జట్టులో చేరింది. తర్వాత హైదరాబాద్ స్పోర్ట్స్ అకాడమీలో చేరి, క్రికెటర్‌గా తనను తాను మెరుగుపరుచుకుంటూ భారతజట్టులో స్థానం దక్కించుకుంది. చదువు, ఆటలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లడమే తన ముందున్న లక్ష్యాలు అని చెప్పే త్రిష నవతరపు అమ్మాయిలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది.

సాహసమే ఊపిరి
అన్వితారెడ్డి (పర్వతారోహకురాలు)



రాష్ట్రానికి చెందిన 24 ఏళ్ల అన్వితారెడ్డి పర్వతారోహణలో సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. ఎవరెస్టు శిఖరాన్ని ఐదురోజుల్లోనే లక్ష్యాన్ని పూర్తి చేసి వార్తల్లో నిలిచింది. పడమటి అన్వితారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లావాసి. ప్రస్తుతం భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షకురాలిగా పనిచేస్తోంది. ఎంతోమంది ఔత్సాహిక యువతీయువకులకు మెలకువలు నేర్పిస్తూనే అడ్వాన్స్‌డ్ కోర్సులను పూర్తి చేసింది. పర్వతారోహణలో మొదటి ప్రొఫెషనల్ కోచ్‌గానూ గుర్తింపు పొందింది. గతంలో సిక్కింలోని రీనాక్, బీసీరాయ్, కిలిమంజారో, లదాక్‌లోని కడే, ఎల్బ్రూస్ పర్వతాలు అధిరోహించింది. పర్వతారోహణలో ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, సవాళ్లను అధిగమించే స్థాయికి చేరుకోవడానికి ఎంతో కృషి, సాధన అవసరం. అన్విత ఏర్పరుచుకున్న ఆశయాలు ప్రతి ఆడపిల్లకు ఆదర్శం. అన్విత సాహసాలు ఎందరికో మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

అవగాహనే ప్రధానం
రేగట్టె వెంకటరమణ (అంగన్‌వాడీ టీచర్)



జాతీయ స్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, ఖాసింపేట గ్రామం నుంచి రేగట్టె వెంకటరమణ ఎంపికయ్యింది. విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డును అందుకొని వార్తల్లో నిలిచింది వెంకటరమణ. ఇంటింటికీ వెళ్లి మహిళలు, పిల్లల ఆరోగ్యం గురించి కనుక్కోవడం, జాగ్రత్తలు సూచించడం, కౌన్సెలింగ్స్ ఇవ్వడం దిన చర్యగా చెబుతుంది. గర్భిణులకు సీమంతాలు, స్కూల్ డే, చిల్డ్రన్ డే వంటి కార్యక్రమాలను పురస్కరించుకొని అందరికీ ఆరోగ్యం కోసం అవగాహన కల్పించడంలో ముందుండే వెంకట రమణ చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించింది.

ప్రైవేటుకు దీటుగా
నూగూరి అర్చన (ప్రధానోపాధ్యాయురాలు)



మంచిర్యాల జిల్లా రెబ్బెనపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నూగూరి అర్చన ఈ యేడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అర్చన తీర్చిదిద్దారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతోపాటు ఆమె సొంత ఖర్చులతో పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ రెబ్బెనపల్లి ప్రాథమిక పాఠశాల అంటే అందరూ మెచ్చుకునేలా తీర్చిదిద్దారు. గిరిజన చిన్నారులకు ప్రత్యేకంగా స్కూల్‌కి ఆటోలు ఏర్పాటు చేసి, మరీ చదువుకు ఊతమిస్తున్నారు. అర్చన విద్యాసేవకు ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ పురస్కారం అందుకున్న అర్చన ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

2023కు వీడ్కోలు

365 రోజులు...
జీవితమనే అంతులేని ప్రయాణంలో
2023వ సంవత్సరం ఈ 365 రోజులు
మనకెన్నో జ్ఞాపకాలు, అనుభవాలు,
సంతోషాలు, సవాళ్లు ఇచ్చి ఉంటుంది.
ఈ ప్రయాణం మనం ఒక్కరమేచేయగలమా?
ఎందరో సాయం చేసి ఉంటారు.
వారికి మనస్ఫూర్తిగా థ్యాంక్యూ చెప్పామో
లేదో. ఇప్పుడు చెబుదామా.
కొందరిని తెలిసో తెలియకో హర్ట్ చేసి ఉంటాం.
ఎంత బాధ పడ్డారో ఏమో.. సారీ చెబుదామా.
పాత సంవత్సరం అకౌంట్లు సెటిల్ చేసుకొని
కొత్త సంవత్సరంలోకి అడుగు పెడదామా?

వాళ్లకు సారీ చెప్పారా? వీళ్లతో థ్యాంక్యూ అన్నారా?



ఏదో హెల్త్ ఇష్యూస్ వచ్చి ఉంటాయి. ఎవరినో సలహా అడిగి ఉంటాం. హాస్పిటల్‌కు తోడు రమ్మని చెప్పి ఉంటాం. అప్పు అడిగి ఉంటాం. వారు ఇచ్చి ఉంటారు. ఆ హడావిడిలో వారికి సరైన థ్యాంక్యూ చెప్పి ఉండం. పట్టించుకోరులే అనుకుంటాం. కాని పట్టించుకుంటారు. మనకు ఈ సంవత్సరం ఇంత సాయం చేసిన వారికి ఈ సంవత్సరాంతంలో కాల్ చేసి, లేదా ఇంటికి వెళ్లి, ఈ సంవత్సరం ఫలానా టైమ్‌లో మీరు నాకు ఈ సాయం చేశారు... థ్యాంక్యూ అని చెప్పి చూడండి... వాళ్ల కళ్లల్లో నీళ్ల చిప్పిల్లుతాయి... మీ కళ్లల్లో కూడా. చెబుదామా?

సాయం చేసిన వాళ్లు అవతలి వారి నుంచి కృతజ్ఞతను ఆశించరు కానీ అలాగని కృతజ్ఞత తెలియచేయడం కనీస బాధ్యత కదా! అసలు మేలు చేస్తేనే థ్యాంక్యూ చెప్పాలా? మీ ఇరుగున ఒక ఇల్లు, పొరుగున ఒక ఇల్లు ఉంటుంది. వారితో ఏ తగాదా గొడవా లేకుండానే హ్యాపీగా ఈ సంవత్సరం గడిచిపోయింది. వాళ్లను పలకరించి 'ఈ సంవత్సరమంతా మనం స్నేహంగా ఉన్నాం. అందుకు థ్యాంక్యూ. వచ్చే సంవత్సరం కూడా ఇలాగే ఉందాం' అని చిన్న స్వీట్ ఇచ్చి చూడండి. ఆ మేజిక్ ఎలా ఉంటుందో. మీ ఆఫీస్‌లో కలీగ్స్‌తో 'థ్యాంక్యూ... ఈ సంవత్సరమంతా మనం కలిసి మెలిసి పని చేసినందుకు' అని టీకి పిలవండి... అదీ చిన్న మేజిక్ కాదు. ఒక సంవత్సరం దాటి వచ్చినందుకు ఎందరికో కృతజ్ఞత ప్రకటించాలి. తల్లిదండ్రులకు, తోడ బుట్టిన వారికి, మిత్రులకు... వీరున్నారనే ధైర్యం వల్లే కదా... ప్రతి రోజునూ చులాగ్గా దాటాం.

వీరికి థ్యాంక్స్ చెప్పండి: ఈ సంవత్సరమంతా మనకు ఇంటి సాయం చేసిన పని మనిషికి, కారు డ్రైవర్‌కు, ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసిచ్చిన ఏజెంట్‌కు, పిల్లలకు ట్యూషన్ చెప్పిన టీచర్‌కు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు, ఫ్యామిలీ డాక్టర్‌కు... డబ్బు చెల్లించే పని చేయించుకుని ఉండొచ్చు. డబ్బు ఇచ్చినా అలాంటి పని చేసేవారు దొరకనప్పుడు తెలుస్తుంది వారి విలువ. అందుకే థ్యాంక్స్ చెప్పండి. బాగుంటుంది. ఇక మీకు సపోర్ట్‌గా నిలిచిన స్నేహితులకు కాల్ చేసి, వారు ఏ సందర్భంలో ఎంత సపోర్ట్ చేశారో చెప్పి థ్యాంక్స్ చెప్పండి. ఊళ్లో ఉన్న అమ్మా నాన్నలను ఎవరో ఒక పక్కింటి పిన్ని పలకరించి బాగోగులు గమనిస్తుంటుంది. ఆమెకు థ్యాంక్స్ చెప్పండి. మన పిల్లలను రోజూ ఆటకు పిలిచి వారితో స్నేహంగా ఆడుతున్న పిల్లలకూ థ్యాంక్స్ చెప్పండి. వారు ఇంకా విలువైన వారు. అన్నింటికి మించి మన పట్ల కనికరంగా ఉన్న ప్రకృతికి. కరుణతో ఉన్న రుతువులకి, తిన్న ప్రతి అన్నం ముద్దకి, మీరు విశ్వసించే ఈశ్వరునికి థ్యాంక్స్ చెప్పండి.

వీరితో సారీ చెప్పండి: ఈ సంవత్సరం రెండు మూడుసార్లు కూడా వెళ్లి చూడటం కుదరని తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, అన్నదమ్ములకు... 'సారీ.. మీరంటే ఎంతో ప్రేమ... కాని కలవడం కుదరలేదు' అని చెప్పండి. మనసు తేలిక అవుతుంది. ఎందరో స్నేహితులు, బంధువులు శుభకార్యాలకు పిలిచి ఉంటారు. వెళ్లి ఉండరు. వారికి పనిగట్టుకుని ఫోన్ చేసి సారీ చెప్పండి. ఇకపై తప్పక వస్తామని చెప్పండి. బాగా ఆత్మీయులు కొందరు స్వర్గస్తులై ఉంటారు. ఏదో కారణాన వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ఉండరు. ఇప్పుడు ఫోన్ చేసి వీలైతే కలిసి సహేతుకమైన కారణం చెప్పి సారీ చెప్పండి. కొందరు మీరు చేయదగ్గ సాయం అడిగినా మీరు నిర్లక్ష్యంతో చేసి ఉండరు. వారు బాధ పడిన విషయం కూడా మీకు తెలిసి ఉండదు. గుర్తు తెచ్చుకుని సారీ చెప్పండి. ఎవరికో ఏవో వాగ్దానాలు చేసి తప్పి ఉంటారు. సారీ చెప్పండి. భార్య భర్తను బాధించిన సందర్భాలకు, భర్త భార్యను కష్టపెట్టిన సందర్భాలకు తప్పక ఒకరికొకరు సారీ చెప్పాలి. పిల్లల్ని చిన్నబుచ్చిన సందర్భాలకు కూడా వారికి సారీ చెప్పాలి. చేజారిన బంధాలు, స్నేహాలు... పలచబడిన బాంధవ్యాలు కేవలం 'థ్యాంక్యూ', 'సారీ' అనే రెండు పదాలతో తిరిగి అతుక్కుంటాయి.

రెండు మూడు రోజులు టైమ్ ఉంది. తెమిలి కూచుని ఇతరుల ఒప్పులను, మీ తప్పులను లిస్ట్ చేసుకుని ఎవరికి ఏం చెప్పాలో అది చెప్పి కొత్త సంవత్సరాన్ని ఉత్సాహంగా మొదలెట్టండి.

గెలుపు దారి

మనీమంత్ర కవితాగానం

'కష్టపడగానే సరిపోదు... ఆ కష్టానికి తగిన ఫలితం ఉండాలి. ప్రతిభ ఉండగానే సరిపోదు... దానికి తగిన ప్రతిఫలం ఉండాలి' అంటుంది కవితా షెనాయ్.

అడ్వర్‌టైజింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన కవితకు వినియోగదారుల నాడి తెలుసు.

తగిన ప్రతిభ, సామర్థ్యాలు ఉండి కూడా నష్టాలతో చతికిల పడుతున్న కంపెనీలను చూసిన తరువాత 'వోయిరో' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

ఈ సాస్(సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) స్టార్టప్ దక్షిణ ఆఫ్రికాలోని 'డీఎస్‌టీవీ' చానల్‌తో సహా మనదేశంలోని పెద్ద వోటీటీ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ పబ్లిషర్‌లతో కలిసి పనిచేస్తోంది....



కవితా షెనాయ్

మేకప్ ఆర్టిస్ట్, వీడియో ఎడిటర్‌గా మంచి పేరు తెచ్చుకున్న కవిత షినాయ్ ఆ తరువాత ఎడ్వర్‌టైజింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఆనంద్ గోపాల్, అనీల్ కారట్, జితిన్ జార్జ్‌లతో కలిసి బెంగళూరు కేంద్రంగా 'వోయిరో' సాస్ స్టార్టప్ మొదలుపెట్టింది. దీనికిముందు కంటెంట్ క్రియేటర్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకోవడానికి తన బృందంతో కలిసి స్వయంగా కంటెంట్ క్రియేట్ చేసేది.

ముంబై యూనివర్శిటీలో ఎకనామిక్స్ చదువుకున్న కవిత మార్కెటింగ్ కమ్యూనికేషన్ కంపెనీ 'లోవ్ లింటస్' తో కలిసి పనిచేసింది. ఆ తరువాత యూట్యూబ్ టీమ్‌తో పనిచేసింది. చదివిన చదువు, పెద్ద సంస్థలతో కలిసి పనిచేసిన అనుభవం 'వోయిరో' ప్రయాణంలో తనకు ఉపకరించాయి.



ఒక స్టార్టప్‌కు తొలి విజయ సంకేతం... నిధుల సమీకరణ. నిధుల సమీకరణకు సంబంధించి 'వోయిరో'కు ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదు. ఇక రెండో సవాలు ఇతరులు తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం. ఎంతోమందితో మాట్లాడి, ఎన్నో సలహాలు తీసుకోవడం ద్వారా రెండో సవాలును కూడా అధిగమించింది. డిజిటల్ పబ్లిషర్స్, వోటీటీ ప్లాట్‌ఫామ్‌ల ఆదాయ వృద్ధికి కంటెంట్‌ను మానిటైజేషన్ చేయడం అనేది కీలకం. మార్కెట్, సాంకేతికత, డేటా అనే మూడురకాల అంశాలలో పట్టు ఉండాలి. అది కవితా షెనాయ్ పని తీరులో కనిపిస్తుంది.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది

వ్యాపార ప్రస్థానంలో 'ఇక ముందుకు వెళ్లలేము' అని నిరాశపడే పరిస్థితి రావచ్చు. దీనికి లొంగిపోకుండా పట్టుదలతో ముందుకు వెళితే విజయం మనల్ని వెదుక్కుంటూ వస్తుంది. ఎంత పెద్ద సమస్యకైనా ఒక పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కార మార్గాలను అన్వేషించడంలో మన ఓపిక, కష్టపడేతత్వం గెలుపును నిర్ణయిస్తాయి.

'వోయిరో ప్రారంభానికి ముందు ఇండస్ట్రీ పెద్దల నుంచి కుటుంబసభ్యులు, స్నేహితుల వరకు ఎంతోమంది నుంచి సలహాలు. సూచనలు తీసుకున్నాం. అవగాహన చేసుకుంటూ, అధ్యయనం చేస్తూ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఓటీటీకి సంబంధించి మార్కెట్ తీరుతెన్నులను విశ్లేషిస్తూ మా పనితీరును మెరుగు పరుచుకుంటూ, పరిధిని విస్తరిస్తూ వెళ్లాం.

– కవితా షెనాయ్,
వోయిరో–ఫౌండర్, సీఇవో

డిజిటల్ పబ్లిషర్‌లు, వోటీటీ ప్లాట్‌ఫామ్స్‌తో 'వోయిరో'కు సంబంధించి సేల్స్ టీమ్, యాడ్ ఆపరేషన్ టీమ్, ఫైనాన్స్ టీమ్, స్ట్రాటజీ టీమ్ అనే నాలుగు బృందాలు కలిసి పనిచేస్తాయి.

మీడియా కంపెనీలకు రెవెన్యూ అనలటిక్స్‌ను అందుబాటులో తీసుకురావడం నుంచి బలమైన ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్) స్ట్రాటజీని అనుసరించడం వరకు తనదైన దారిలో ప్రయాణిస్తోంది వోయిరో.

కోవిడ్ కల్లోల సమయంలో అన్ని కంపెనీల లాగే 'వోయిరో'కు సమస్యలు ఎదురైనప్పటికి వోటీటీ పరిశ్రమ, కంటెంట్ స్పేస్ పుంజుకోవడంతో పెద్దగా ప్రభావం చూపలేదు.

'మీడియాతో అంటే నాకు ఉన్న ఇష్టం, అభిమానం వోయిరో ఆవిర్భావానికి కారణం అయింది. డిజిటల్ పబ్లిషర్‌లు, కంటెంట్ క్రియేటర్‌లకు వివిధ విషయాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం అవసరం అనే ఉద్దేశంతో ఈ వెంచర్ ప్రారంభించాం. లాభాల కంటే కూడా ఇతరులకు సహాయం చేయాలి, వారి విధానాలలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో వోయిరో ప్రారంభించాం. అయితే అది అంత సులువైన విషయం కాదని అర్థమైంది. మా ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకొని ముందుకు వెళుతున్నాం. మీడియా, డిజిటల్ పబ్లిషర్‌లు నష్టపోకుండా మార్గనిర్దేశం చేయడం మా లక్ష్యం' అంటుంది కవిత షెనాయ్.

● ముగ్గు-ముచ్చట



ఎస్.మానస
కడియం, రాజమండ్రి


9 చుక్కలు
మధ్యచుక్క
5 వచ్చేవరకు





ఎస్.శ్రీలత
కరీంనగర్

23 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



19 చుక్కలు
19 వరసలు





బెన్నూరి
ఉమాదేవి
సికింద్రాబాద్



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com



ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సహజ 5-7, 6-1, 6-2తో హైదరాబాద్‌కే చెందిన శ్రీవల్లి రష్మికపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 29 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఆరు ఏస్‌లు సంధించింది. రష్మిక సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసిన సహజ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది.

ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీల్లో...

భారత మహిళా స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో పోటీపడనుంది. జనవరి 2 నుంచి భువనేశ్వర్‌లో ఈ టోర్నీ జరుగుతుంది. 30 ఏళ్ల దీపా 2016 రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత మోకాలి గాయంతో ఆటకు దూరమైంది. పునరాగమనం తర్వాత డోపింగ్ పరీక్షలో పట్టుబడి 21 నెలలపాటు నిషేధానికి గురైంది. నిషేధం గడువు పూర్తి కావడంతో ఆమె మళ్లీ బరిలోకి దిగుతోంది.



రెండో స్థానంలో హంపి

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రెండో రోజూ అద్భుత ఆటతో ఆకట్టుకుంది. తొలి రోజు నాలుగు రౌండ్ల తర్వాత మూడు పాయింట్లతో 15వ ర్యాంక్‌లో ఉన్న హంపి... రెండో రోజు రెండో స్థానానికి ఎగబాకింది. బుధవారం హంపి మూడు గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని 8 రౌండ్ల తర్వాత 6.5 పాయింట్లతో మో జై (చైనా)తో కలిసి సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకుంది. 7 పాయింట్లతో అనస్తాసియా బొద్నారుక్ (రష్యా) అగ్రస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన యువతార నూతక్కి ప్రియాంక కూడా అద్భుతంగా ఆడింది. తొలి రోజు 2 పాయింట్లతో 61వ ర్యాంక్‌లో ఉన్న ప్రియాంక బుధవారం ఆడిన నాలుగు గేముల్లోనూ గెలిచి 6 పాయింట్లతో 10వ ర్యాంక్‌కు చేరుకోవడం విశేషం. భారత్‌కే చెందిన వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ 5 పాయింట్లతో వరుసగా 23, 31వ ర్యాంక్‌లో... ద్రోణవల్లి హారిక 4.5 పాయింట్లతో 40వ ర్యాంక్‌లో ఉన్నారు.



న్యూజిలాండ్‌లో బంగ్లాదేశ్ తొలి టి20 విజయం



నేపియర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న బంగ్లాదేశ్ జట్టు... టి20 ఫార్మాట్‌లో తొలిసారి న్యూజిలాండ్ గడ్డపై న్యూజిలాండ్‌ను ఓడించింది. గతంలో న్యూజిలాండ్‌లో ఆడిన తొమ్మిది టి20 మ్యాచ్‌ల్లోనూ బంగ్లాదేశ్‌కు ఓటమి ఎదురైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఐదు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 134 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెహదీ హసన్ (2/14), ముస్తఫిజుర్ (2/15), షోరిఫుల్ (3/26) న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు. అనంతరం బంగ్లాదేశ్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 137 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. లిటన్ దాస్ (36 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), మెహదీ హసన్ (16 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు.

ఎల్గర్ అజేయ సెంచరీతో...

'బాక్సింగ్ డే' టెస్టుపై దక్షిణాఫ్రికా ఆధిక్యం కనబరుస్తోంది. రెండో రోజు ఆటలో భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులకు ఆలౌట్ చేసిన సఫారీ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటుకుంది. దక్షిణాఫ్రికా ఆరంభానికి సిరాజ్ తూట్లు పొడిచినప్పటికీ ఓపెనర్ డీన్ ఎల్గర్ (అజేయ) శతకంతో సాఫీగా సాగిపోయింది. రెండు పటిష్టమైన భాగస్వామ్యాలతో సఫారీ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సంపాదించేందుకు ఎల్గర్ కీలకపాత్ర పోషించాడు.



ఎల్గర్

- దక్షిణాఫ్రికాకు ఆధిక్యం
- తొలి ఇన్నింగ్స్‌లో 256/5
- శతక్కొట్టిన రాహుల్
- భారత్ 245 ఆలౌట్

సెంచూరియన్: ఓవర్‌నైట్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సెంచరీ మినహా తొలి టెస్టులో రెండో రోజంతా దక్షిణాఫ్రికా హవానే నడిచింది. ఓపెనర్ ఎల్గర్ చక్కని సెంచరీతో సఫారీ భారీ స్కోరుపై కన్నేసింది. తద్వారా దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని పెంచుకునేందుకు పట్టుబిగిస్తోంది. బుధవారం రెండో రోజు ఆటలో తొలుత భారత్ తొలి ఇన్నింగ్స్ 67.4 ఓవర్లలో 245 పరుగుల వద్ద ముగిసింది. రాహుల్ (137 బంతుల్లో 101; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) టెస్టుల్లో ఎనిమిదో శతకం సాధించాడు. మొదటి రోజే రబడ 5 వికెట్లు తీయగా, రెండో రోజు మిగిలిన రెండు వికెట్లలో కొయెట్జీ (1/74), బర్గర్ (3/50) చెరొకటి తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి 66 ఓవర్లలో 5 వికెట్లకు 256 పరుగులు చేసి 11 పరుగుల ఆధిక్యం పొందింది. ఎల్గర్ (140 బ్యాటింగ్; 23 ఫోర్లు), జాన్సెన్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బుమ్రా, సిరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టాడు.

శతకం పూర్తయ్యాక ఆలౌట్!

వర్షం, గ్రౌండ్ తడి ఆరడానికి సమయం పట్టడంతో రెండో రోజు కూడా ఆట ఆలస్యంగానే మొదలైంది. ఓవర్‌నైట్ స్కోరు 208/8తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ తొలి సెషన్‌లో 8.4 ఓవర్లు మాత్రమే ఆడగలిగింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు రాహుల్, సిరాజ్ (5) తొమ్మిదో వికెట్‌కు 47 పరుగులు జోడించారు. రాహుల్ సెంచరీకి చేరువయ్యాక కొయెట్జీ 65వ ఓవర్ తొలి బంతికి సిరాజ్‌ను అవుట్ చేశాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి భారీ సిక్సర్‌తో రాహుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే బర్గర్ అతన్ని బౌల్డ్ చేయడంతో 245 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది.

సిరాజ్ దెబ్బ తీసినా...

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఆరంభంలోనే సిరాజ్ దెబ్బ కొట్టాడు. ఓపెనర్ మార్క్‌రమ్ (5) కీపర్ క్యాచ్‌తో వెనుదిరిగేలా చేశాడు. అయితే భారత శిబిరానికి ఈ ఆనందం తర్వాత శ్రమించక తప్పలేదు. క్రీజులో ఉన్న మరో ఓపెనర్ ఎల్గర్‌కు జతయిన టోనీ డి జార్జి (28; 5 ఫోర్లు) భారత బౌలర్లను తేలిగ్గా ఎదుర్కొన్నారు. 49/1 స్కోరువద్ద తొలి సెషన్ ముగియగా... రెండో సెషన్‌లోనూ ఈ జోడీ భారత బౌలింగ్ దళాన్ని కష్టపెట్టింది. ఎల్గర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... సఫారీ స్కోరు వంద దాటింది. ఈ దశలో బుమ్రా రెండు కీలక వికెట్లను (జార్జి, పీటర్సన్) పడగొట్టి టీమిండియాను ఊరడించాడు. దాంతో దక్షిణాఫ్రికా 113 పరుగుల వద్ద 3 వికెట్లను కోల్పోయి ఆత్మరక్షణలో పడింది. అయితే క్రీజులో పాతుకుపోయిన ఎల్గర్‌కు బడింగ్‌హామ్ చక్కని సహకారం ఇవ్వడంతో మరో భారీ భాగస్వామ్యం దక్షిణాఫ్రికాను నిలబెట్టింది. ఎల్గర్ శతకాన్ని పూర్తి చేసుకోగా... టీ విరామం (194/3) వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు. ఆఖరి సెషన్‌లోనూ ఎల్గర్-బడింగ్‌హామ్ జోడీ భారత బౌలర్లకు పరీక్షపెట్టింది. నాలుగో వికెట్‌కు 131 పరుగులు జోడించాక సిరాజ్ ఓవర్లో బడింగ్‌హామ్ (56; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిష్క్రమించాడు. వెరిన్ (4)ను ప్రసిధ్ అవుట్ చేశాడు. తర్వాత కాసేపటికే బ్యాడ్‌లైట్‌తో ఆటను నిలిపివేశారు.



రాహుల్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 245 ఆలౌట్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 5; ఎల్గర్ (బ్యాటింగ్) 140; టోని జార్జి (సి) యశస్వి (బి) బుమ్రా 28; పీటర్సన్ (బి) బుమ్రా 2; బెడింగ్‌హమ్ (బి) సిరాజ్ 56; వెరిన్ (సి)రాహుల్ (బి) ప్రసిధ్‌కృష్ణ 4; జాన్సెన్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (66 ఓవర్లలో 5 వికెట్లకు) 256. వికెట్ల పతనం:** 1-11, 2-104, 3-113, 4-244, 5-249. **బౌలింగ్:** బుమ్రా 16-3-48-2, సిరాజ్ 15-0-63-2, శార్దుల్ 12-2-57-0, ప్రసిధ్‌కృష్ణ 15-2-61-1, అశ్విన్ 8-3-19-0.

తొలి సిరీస్ విజయం లక్ష్యంగా...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు తొలి వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇటీవల టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై తొలి విజయం అందుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే ఫార్మాట్‌లో వరల్డ్ చాంపియన్స్‌పై తొలిసారి సిరీస్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్ల మధ్య గురువారం జరిగే తొలి మ్యాచ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. గతంలో ఆస్ట్రేలియాతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత్‌కు నిరాశ ఎదురైంది. అయితే సొంతగడ్డపై ఈసారి టీమిండియా సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో 50 వన్డేలు ఆడిన భారత్ కేవలం 10 మ్యాచ్‌ల్లో నెగ్గి, 40 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో ఈ సీజన్‌లో భారత జట్టు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన రెండు టెస్టుల్లోనూ గెలుపు రుచి చూసింది. అదే జోరు కొనసాగిస్తూ వన్డేల్లోనూ టీమిండియా సత్తా చాటుకునేందుకు సిద్ధమైంది. బ్యాటింగ్‌లో స్మృతి, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్, జెమీమా... బౌలింగ్‌లో రేణుక, పూజ రాణిస్తే భారత్‌కు సిరీస్ విజయం దక్కే అవకాశాలున్నాయి. మరోవైపు వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఏకైక టెస్టులో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగనుంది. యాష్లే గార్డ్‌నర్, అలీసా హీలీ, తాలియా, ఎలీస్ పెరీ, బెత్ మూనీ ఆటతీరుపై ఆసీస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

పాక్ జట్టుకు కమిన్స్ దెబ్బ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో 'బాక్సింగ్ డే' టెస్టులో పాకిస్తాన్ కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు సాధించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 37 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి పాక్‌ను దెబ్బ కొట్టాడు. ఒకదశలో 124/1 వద్ద పటిష్టంగా ఉన్న పాక్ 70 పరుగుల తేడాలో ఐదు వికెట్లు చేజార్చుకుంది. అబ్దుల్లా షఫీక్ (62; 5 ఫోర్లు), షాన్ మసూద్ (54; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పాక్ మరో 124 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 187/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 96.5 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌటైంది.

దబంగ్ ఢిల్లీతో జైపూర్ పింక్ పాంథర్స్ మ్యాచ్ 'డ్రా'

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు రెండో 'డ్రా' నమోదు చేసింది. బుధవారం దబంగ్ ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌ను జైపూర్ 32-32 స్కోరు వద్ద 'డ్రా'గా ముగించింది. విరామ సమయానికి జైపూర్ 11-23తో వెనుకబడి ఉంది. కానీ రెండో అర్ధభాగంలో జైపూర్ తేరుకొని ఢిల్లీని నిలువరించింది. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లు, అంకుశ్ 7 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 33-30తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో హరియాణా స్టీలర్స్; యూపీ యోధాస్‌తో బెంగళూరు బుల్స్ ఆడతాయి.



సినిమా

ఆ రోజు గోల గోల చేద్దాం

\- రవితేజ



రవితేజ, కావ్యా థాపర్

''మీ అందరి (అభిమానులు) ఉత్సాహం చూస్తుంటే ఆనందంగా ఉంది. 'ఈగల్' వైవిధ్యమైన మాసీ ఫిలిం. వినోదం అద్భుతంగా ఉంటుంది. నాకు విపరీతంగా నచ్చింది.. మీ అందరికీ తెగ నచ్చుతుంది. జనవరి 13న అందరూ థియేటర్స్‌కి వచ్చేయండి.. గోల గోల చేద్దాం'' అన్నారు హీరో రవితేజ. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రవితేజ, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా జనవరి 13న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. దేవ్ జాంద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గల్లంతే..' అంటూ సాగే రెండో పాటని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, కపిల్ కపిలన్, లిన్ పాడారు. కావ్యా థాపర్ మాట్లాడుతూ – ''గల్లంతే..' పాట నాకు చాలా ప్రత్యేకం. రవితేజగారితో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు. ''రవితేజగారికి నేను పెద్ద అభిమానిని. ఆయన సినిమాకి సంగీతం ఇవ్వడంతో నా కల నెరవేరినట్టు అయింది'' అన్నారు దేవ్ జాంద్. ఈ వేడుకలో కార్తీక్ ఘట్టమనేని, టీజీ విశ్వప్రసాద్, సహ నిర్మాత వివేక్ కూఛిబొట్ల, నటుడు నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

కోటికి రవితేజ వాయిస్

తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జనవరి 12న విడుదలవుతోంది. ఈ సినిమాలో కోటి పాత్రలో నటించిన వానరానికి హీరో రవితేజ డబ్బింగ్ చెప్పారు. ''రవితేజగారి వాయిస్‌తో కోటి పాత్ర మరింత హ్యూమరస్, ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు'' అని మేకర్స్ అన్నారు.

అలా జడ్జ్ చేయడం బాధగా ఉంది

\- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



''మంచి మ్యూజిక్ ఇవ్వడానికి ఖరీదైన మ్యూజిక్ పరికరాలు అవసరం లేదు. 'క్షణం', 'మేజర్'లో కొన్ని సీన్లకు మేం ఫోన్‌లో రికార్డ్ చేసిన వాయిస్‌నే వాడాం. ఇక ఇప్పుడు యూట్యూబ్ వ్యూస్, ఇన్‌స్టా రీల్ వ్యూస్‌తో మ్యూజిక్ డైరెక్టర్స్‌ను జడ్జ్ చేయడం కాస్త బాధగా ఉంది. అందుకే ఇప్పుడు నేను సినిమాలు తగ్గించుకున్నాను. ఇండిపెండెంట్ మ్యూజిక్, ఆల్బమ్స్‌పై ఎక్కువ దృష్టి పెడుతున్నాను'' అని అన్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. రోషన్ కనకాల, మానస జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరీ మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల మాట్లాడుతూ– ''గడిచిన పదేళ్లలో నేను చేయాల్సింది చేశాను. ఇక నన్ను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నా. 'బబుల్‌గమ్'తో ఈ ప్రయత్నం మొదలైంది. ఈ సినిమాలో హీరోది డీజే రోల్. నా ఫ్రెండ్స్‌లో ఎక్కువమంది డీజేలు ఉండటంవల్ల ఎలక్ట్రానిక్ మ్యూజిక్‌పై అవగాహన ఉంది. ట్యూన్ కంటే లిరిక్స్ ముఖ్యమని నమ్ముతాను. 'బబుల్‌గమ్' చూశాను. రోషన్ మంచి నటుడు, డ్యాన్సర్. డబ్బింగ్ కూడా బాగా చెప్పాడు. ప్రస్తుతం 'సత్యభామ', 'గూఢచారి 2' సినిమాలకు సంగీతం అందిస్తున్నాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ప్రతి రంగంలోనూ సాంకేతిక విప్లవం వచ్చింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వల్ల మ్యూజిక్ కంపోజర్స్‌కు ప్రమాదం ఉండొచ్చు. కానీ 'ఏఐ'ని అప్లై చేయడానికీ హ్యూమన్ టచ్ కావాలి. సప్తస్వరాలు ఏడే. సౌండింగ్ ఎలా ఇస్తున్నామన్నదే ముఖ్యం. 'గూఢచారి' వల్ల కాదు.. 'కృష్ణ అండ్ హిజ్ లీల' సినిమాలోని మ్యూజిక్ నచ్చి నాకు చాన్స్‌లు ఇచ్చినట్లుగా కొందరు నాతో చెప్పారు. నాకదో హ్యాపీ సర్‌ప్రైజ్'' అని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్‌లో సరిపోదా...



నాని

'అంటే సుందరానికీ!' చిత్రం తర్వాత హీరో నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్‌జే సూర్య కీలక పాత్ర చేస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''సరిపోదా శనివారం' చిత్రంలో నాని పూర్తిగా యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపిస్తారు. హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. నవంబరులో ఒక షెడ్యూల్ పూర్తి చేశాం. రెండో షెడ్యూల్‌ని హైదరాబాద్‌లో ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌తో పాటు నాని, ఇతర ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నాం. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

జతనై రమ్మంటావా..

'అచ్చట.. ఇచ్చట... ముద్దొచ్చే ముచ్చట..', 'అందంగా అల్లుకుంటే ఆనందం..' అంటూ సాగుతుంది 'టెనెంట్' చిత్రంలోని 'నా కథలో..' పాట. 'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి జంటగా వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా నుంచి 'నా కథలో నువ్వున్నావా... నీ కథనే నేనయ్యానా... నా జతగా రానున్నావా... నీ జతనై రమ్మంటావా' అంటూ సాగే 'నా కథలో..' మెలోడీ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్రం సంగీత దర్శకుడు సాహిత్యసాగర్ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఎస్‌జే సురేంద్రనాథ్, జయశ్రీ పల్లెం పాడారు. ''భార్యాభర్తల అనురాగాన్ని, ఆప్యాయతను తెలిపే పాట ఇది. జీవితం ఆడే వైకుంఠపాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ, వారిని అలర్ట్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు వై. యుగంధర్.



'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి



సంజీవ్ మేగోటి, రాశీ, శివ కంఠమనేని

ఎమోషనల్ రాఘవ రెడ్డి

శివ కంఠమనేని హీరోగా, రాశీ, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో సంజీవ్ మేగోటి దర్శకత్వంలో కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వర్ రావు నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ– ''చిన్న సినిమాల వల్లే ఇండస్ట్రీ బతుకుతుంది. ఇండస్ట్రీని బతికించుకునేందుకు 'రాఘవ రెడ్డి'లాంటి సినిమాలను ప్రేక్షకులు విజయవంతం చేయాలి. ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ కనిపిస్తున్నాయి'' అన్నారు. ''ఇంటర్వెల్ అందరికీ నచ్చుతుంది. క్లైమాక్స్ సీన్స్ ఎమోషనల్‌గా టచ్ అవుతాయి. ఆడియన్స్ కంటతడి పెడతారు'' అన్నారు శివ కంఠమనేని. ''తొమ్మిదేళ్ల గ్యాప్ తర్వాత దర్శకుడిగా 'రాఘవ రెడ్డి' అనే ఓ మంచి సినిమా తీశాను'' అన్నారు సంజీవ్. ''ఈ సినిమాలో కూతురే ప్రపంచంగా బతికే దేవకి పాత్ర చేశాను'' అన్నారు రాశీ. ''ఈ సినిమాలో క్రిమినాలజీ ప్రొఫెసర్ రాఘవ రెడ్డిగా శివగారు నటించారు. యూత్‌కి కావల్సిన ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, సోషల్ మెసేజ్ కూడా ఉన్నాయి'' అన్నారు నిర్మాతలు.

రీల్స్

వేసవిలో వస్తున్నాడు



కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'ఇండియన్ 2'. వీరి కాంబినేషన్‌లోనే 1996లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రధారులు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవల చెన్నైలో మొదలైన 'ఇండియన్ 2' భారీ షెడ్యూల్ చిత్రీకరణ ముగిసిందని, ఈ షూటింగ్ షెడ్యూల్‌తో టాకీ పార్టు పూర్తయిందని సమాచారం. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను కూడా చిత్రీకరిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుందని టాక్. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారట.

హిట్లర్ యాక్షన్



విజయ్ ఆంటోనీ, రియా సుమన్

విజయ్ ఆంటోనీ, రియా సుమన్ జంటగా నటించిన చిత్రం 'హిట్లర్'. ధన దర్శకత్వంలో డీటీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ''ప్రజాస్వామ్యం పేరుతో కొందరు పాలకులు నియంతల్లా వ్యవహరిస్తున్నారు. అలాంటి నియంతను ఎదుర్కొనే ఓ సాధారణ పౌరుడి కథే 'హిట్లర్'. ఈ మూవీలో లవ్ ట్రాక్‌కి కూడా ప్రాధాన్యత ఉంటుంది. యాక్షన్ థ్రిల్లర్ కథతో తీసిన ఈ 'హిట్లర్'లో కిల్లర్‌గా విజయ్ ఆంటోని కొత్త లుక్‌లో, క్యారెక్టరైజేషన్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

సహజత్వానికి దగ్గరగా...



శశి, రోహిత్

ముని, రోహిత్, రాజు, అజిత్, గాయత్రి గుప్తా, సాయి కిరణ్ యాదవ్, పవన్ కృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'డబుల్ ఇంజన్'. దర్శక ద్వయం రోహిత్-శశి తెరకెక్కించిన ఈ సినిమాను సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. జనవరి 5న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ''నలుగురు స్నేహితులు డానీ, మౌళి, నర్సింగ్, గోపీ డబ్బు సంపాదించడం కోసం చేసే ప్రయత్నాలతో థ్రిల్లింగ్ అడ్వెంచరస్ మూవీగా తీశాం'' అని యూనిట్ పేర్కొంది. ''కేవలం వంద ఇళ్లు ఉన్న తోటపల్లి గ్రామం బ్యాక్‌డ్రాప్‌లో సహజత్వానికి దగ్గరగా ఉండే సినిమా ఇది. మా చిత్రం టికెట్ ధర పీవీఆర్‌లో రూ. 112కే అందుబాటులో ఉంటుంది'' అని దర్శకుల్లో ఒకరైన రోహిత్ అన్నారు.

బంపర్ ఆఫర్



ఇంద్రసేన, సంతోష్

ఇంద్రసేన, సంతోష్, ప్రజ్ఞ నయన్, నవీనా రెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. రవి చావలి దర్శకత్వంలో ఎస్. రమేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ''రియల్ ఎస్టేట్ దందా చేసే ఒక వ్యక్తి దగ్గర పని చేసే ఇద్దరు కుర్రాళ్లు డబ్బు కోసం అతన్నే ఎందుకు కిడ్నాప్ చేశారు? వారికి తెలిసిన రహస్యాలు ఏంటి? చివరకు డబ్బు సంపాదించారా? లేదా అనే కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు రవి చావలి.

సాక్షి బిజినెస్

గురువారం
28-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	701	72,038
నిఫ్టీ ▲	213	21,655

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,078	▲ 4
డోజోన్స్	37,619	▲ 73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▲ 30
డాక్స్	16,739	▲ 33
షాంఘై	2,915	▲ 16
నికాయ్	33,681	▲ 376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,223	▲ 116
బంగారం (99.5 స్వచ్ఛత)	62,970	▲ 165
వెండి (కేజీ)	74,064	▲ 768

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.77	83.79
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.49	107.06
€	యూరో	ఒకటి	90.66	93.04
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.84	59.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.78	57.73
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.02	63.51
SAR	సౌదీ రియాల్	ఇరవై	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	ఇరవై	21.75	23.55
¥	చైనా యువాన్	ఇరవై	10.52	12.60

ఎస్‌బీఐ డిపాజిట్ రేట్ల పెంపు



ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొన్ని కాలపరిమితులపై స్థిర డిపాజిట్లపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్ల వరకూ (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. బుధవారం నుంచీ కొత్త వడ్డీరేట్లు అమల్లోకి వచ్చినట్లు బ్యాంక్ పేర్కొంది. డిపాజిటర్లకు తగిన 'న్యాయమైన' వడ్డీరేటును అందించాల్సిన అవసరం ఉన్నందున ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ దినేష్ కుమార్ ఖరా పేర్కొన్నారు. ఇక్కడ బ్యాంక్ నిర్వహించిన ''బ్యాంకింగ్, ఎకనమిక్ కాన్‌క్లేవ్''లో ఆయన మాట్లాడుతూ, డిపాజిట్ రేటు పెంపునకు తగిన వెసులుబాటు ఎస్‌బీఐకి ఉందన్నారు. రుణ రేటు పెరుగుదల, నిధుల సమీకరణ అవసరాల నేపథ్యంలో ఇటీవల కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో సహా కొన్ని బ్యాంకులు డిపాజిట్ రేటు నిర్ణయం తీసుకున్నాయి. ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో మరికొన్ని బ్యాంకులు ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయం ప్రకారం...

- 180–210 రోజుల మధ్య డిపాజిట్ రేటు 5.25 శాతం నుంచి 0.5 శాతం పెరిగి 5.75 శాతానికి చేరింది.
- 7 నుంచి 45 రోజుల మధ్య రుణ రేటు 3 శాతం నుంచి 3.5 శాతానికి ఎగసింది.
- 46 నుంచి 179 రోజుల మధ్య డిపాజిట్ రేటు 0.25 శాతం పెరిగి 4.75 శాతానికి ఎగసింది.
- 211 రోజుల నుంచి ఏడాది వరకూ రేటు 6 శాతానికి చేరింది.
- మూడేళ్ల నుంచి ఐదేళ్ల మధ్య రేటు 6.75 శాతానికి చేరింది.



జోయాలుక్కాస్ గ్రూప్ అధినేత జాయ్ అలుక్కాస్ తన స్వీయ చరిత్ర 'స్ప్రెడింగ్ జాయ్'ను ప్రధాని మోదీకి అందజేశారు.

మళ్లీ రికార్డుల మోత

- సెన్సెక్స్ @ 72000
- 21,650 స్థాయి పైకి నిఫ్టీ
- సరికొత్త శిఖరాలపై సూచీలు
- ఇంట్రాడే, ముగింపుల్లోనూ చరిత్రాత్మక స్థాయిల నమోదు



ముంబై: దేశీయ స్థూల ఆర్థిక వ్యవస్థపై ఆశావహ అంచనాలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలతో స్టాక్ సూచీలు బుధవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. బ్యాంకింగ్, కమోడిటీ, మెటల్, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ తొలిసారి 72,000 పాయింట్ల ఎగువన, నిఫ్టీ 21,650 స్థాయిపై ముగిశాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. సెన్సెక్స్ 71,492 పాయింట్లు వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 783 పాయింట్లు ఎగసి 72,120 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని తాకింది. చివరికి 701 పాయింట్లు లాభపడి 72,038 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 235 పాయింట్లు బలపడి 21,676 వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఆఖరికి 213 పాయింట్లు లాభపడి 21,655 వద్ద నిలిచింది. ఆయిల్ అండ్‌గ్యాస్, యుటిలిటీ, విద్యుత్, సేవా రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,926 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.192 కోట్ల షేర్లు విక్రయించారు.

ర్యాలీ ఎందుకంటే...?


ఫెడ్ రిజర్వ్ 2024 మార్చి కంటే ముందుగానే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఉంటుందనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూలత దేశీయ మార్కెట్‌కు కలిసొచ్చింది. గత 20 ఏళ్ల ట్రేడింగ్ ట్రెండ్‌ను అనుసరిస్తూ ఈక్విటీ మార్కెట్లలో శాంటా క్లాజ్ ర్యాలీ కొనసాగుతుంది. (డిసెంబర్ చివరి 5 ట్రేడింగ్ సెషన్లు, జనవరి తొలి 2 ట్రేడింగ్ సెషన్లు మార్కెట్ పెరిగితే దానిని శాంటా ర్యాలీగా వ్యవహరిస్తారు). వాల్ స్ట్రీట్‌లో 'సెల్ చైనా, బై భారత్' వ్యూహం జోరుగా సాగుతున్నట్లు కనిపిస్తుంది. అందుకు అనుగుణంగా డిసెంబర్‌లో ఎఫ్‌ఐఐలు రూ.57,275 కోట్ల ఈక్విటీలను కొన్నారు. రెండో త్రైమాసికంలో అలాగే భారత కరెంట్ ఖాతా లోటు తగ్గడం కలిసొచ్చింది. భారీ భద్రత నడుమ ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకల పునఃప్రారంభంతో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్ల దిగువకు చేరుకుంది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- చైనా తయారీ రంగం పుంజుకోవడం, డాలర్ బలహీనతతో అంతర్జాతీయంగా బేస్ మెటల్ ధరలు పెరగడం మెటల్ షేర్లకు డిమాండ్ పెంచింది. హిందాల్కో 4%, జేఎస్‌డబ్ల్యూ 3%, సెయిల్, నాల్కో 2% లాభపడ్డాయి. టాటా స్టీల్, వెల్‌స్పాన్ కార్ప్, హిందుస్థాన్ కాపర్, వేదాంతా, జిందాల్ స్టీల్ షేర్లు 1% వరకు పెరిగాయి.
- ఇటీవల ర్యాలీలో వెనకబడిన బ్యాంకింగ్ షేర్లు పుంజుకున్నాయి. పీఎన్‌బీ 4%, బ్యాంక్ ఆఫ్ బరోడా 3%, ఎస్‌బీఐ 2%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.50%, బంధన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, కోటక్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూస్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్‌లు 1–6% లాభపడ్డాయి.
- 4 రోజుల్లో సెన్సెక్స్ 1,532 పాయింట్ల ర్యాలీతో దలాల్ స్ట్రీట్‌లో రూ.11.11 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.361 లక్షల కోట్లకు చేరింది.

బ్యాంక్‌లపైనే ఆధారపడొద్దు

- నిధుల మార్గాలను విస్తృతం చేసుకోండి
- ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ సూచన



ముంబై: నిధుల సమీకరణ మార్గాలను విస్తృతం చేసుకోవాలని, బ్యాంక్‌లపై ఆధారపడడాన్ని పరిమితం చేసుకోవాలని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీలకు) ఆర్‌బీఐ సూచించింది. బలమైన కార్పొరేట్ గవర్నెన్స్ విధానాల ద్వారా బ్యాలన్స్ షీట్లు పటిష్టం చేసుకుని, మోసాలు, డేటా చోరీల నుంచి రక్షణ కల్పించుకోవాలని కోరింది. దేశ బ్యాంకింగ్ రంగం, ఎన్‌బీఎఫ్‌సీలు బలంగా ఉన్నాయంటూ.. అధిక నగదు నిష్పత్తి, మెరుగుపడిన ఆస్తుల నాణ్యత, లాభాల్లో బలమైన వృద్ధిని ప్రస్తావించింది. ఈ మేరకు బ్యాంకింగ్ రంగంపై ఆర్‌బీఐ ఓ నివేదికను విడుదల చేసింది. ''బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య పరస్పర అనుసంధానత పెరిగిన నేపథ్యంలో.. ఎన్‌బీఎఫ్‌సీలు తమ నిధుల సమీకరణ మార్గాలను విస్తృతం చేసుకోవాలి. బ్యాంక్‌లపై అధికంగా ఆధారపడడాన్ని తగ్గించుకోవాలి. కస్టమర్లకు సేవల విషయంలో మరింత కృషి చేయాలి''అని ఆర్‌బీఐ కోరింది.

సైబర్ దాడుల రిస్క్

నూతన టెక్నాలజీల అమలు నేపథ్యంలో సైబర్ దాడులు, డేటా చోరీ, నిర్వహణ వైఫల్యాలు పెరిగినట్టు పేర్కొంది. మెరుగైన పాలన, రిస్క్ నిర్వహణ విధానాల ద్వారా బ్యాలన్స్ షీట్లను పటిష్టం చేసుకుని, పెరుగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ ఆకాంక్షలను చేరుకునే విధంగా ఉండాలని కోరింది. ''ఈ విధమైన సాంకేతిక, సైబర్ భద్రతా రిస్క్‌లను గుర్తించి, వాటి ముప్పును తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. బలమైన గవర్నెన్స్, రిస్క్ నిర్వహణ విధానాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి''అని సూచించింది.

అదానీ గ్రీన్‌కు టోటల్ 'ఎనర్జీ'

రూ. 2,500 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశీ ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీలో ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ 30 కోట్ల డాలర్లు(సుమారు రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది. తద్వారా పునరుత్పాదక ఇంధన భాగస్వామ్య సంస్థ(జేవీ)లో సమాన వాటా తీసుకుంది. అదానీ రెనెవబుల్ ఎనర్జీ నైన్ లిమిటెడ్(ఏఆర్‌ఈ9ఎల్) పేరుతో జేవీని ఏర్పాటు చేశాయి. 1,050 మెగావాట్ల ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోగల జేవీలో అదానీ గ్రీన్, టోటల్‌ఎనర్జీస్ 50:50 శాతం చొప్పున వాటాను తీసుకున్నాయి. అదానీ గ్రీన్‌కు ఏఆర్‌ఈ9ఎల్ అనుబంధ సంస్థకాగా.. 300 మెగావాట్ల నిర్వహణా సామర్థ్యంతోపాటు, 500 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 250 మెగావాట్ల ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నట్లు అదానీ గ్రీన్ వెల్లడించింది. అదానీ గ్రీన్‌లో 19.75 శాతం వాటా కలిగిన టోటల్‌ఎనర్జీస్ గతంలో అదానీ గ్రీన్ ఎనర్జీ ట్వంటీ త్రీ(ఏజీఈ23) లిమిటెడ్‌లో ఇన్వెస్ట్ చేసింది. ఇది అదానీ గ్రీన్‌కు మరో అనుబంధ సంస్థ. కాగా.. నిర్మాణం, అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టులు వాణిజ్య ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభిస్తే కొన్ని ప్రమాణాలకు లోబడి టోటల్‌ఎనర్జీస్ తిరిగి జేవీకి అదనపు పెట్టుబడులను సమకూర్చనుంది. ఇంతక్రితం ఏజీఈ23ఎల్‌లో టోటల్ రూ. 4,013 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. తప్పనిసరిగా మార్పిడికి లోనయ్యే డిబెంచర్ల ద్వారా నిధులు సమకూర్చింది.

టోటల్ పెట్టుబడుల నేపథ్యంలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు ఎన్‌ఎస్‌ఈలో స్వల్ప నష్టంతో రూ. 1,597 వద్ద ముగిసింది.

లిస్టింగ్ టైమ్...

హ్యాపీ ఫోర్జింగ్స్ హైజంప్

గత వారమే పబ్లిక్ ఇష్యూకి వచ్చిన హ్యాపీ ఫోర్జింగ్స్ లిస్టింగ్‌లోనే ఇన్వెస్టర్లను మెప్పించింది. ఇష్యూ ధర రూ. 850తో పోలిస్తే బీఎస్‌ఈలో 18 శాతం ప్రీమియంతో రూ. 1,001 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 28 శాతం దూసుకెళ్లి రూ. 1,088 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 21% లాభంతో రూ. 1,030 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 18 శాతం అధికంగా రూ. 1,000 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 1,087 వరకూ జంప్‌చేసింది. చివరికి 21% బలపడి రూ. 1,030 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 9,701 కోట్లుగా నమోదైంది.

ఆర్‌బీజెడ్ జ్యువెలర్స్ ఓకే

ఆభరణాల కంపెనీ ఆర్‌బీజెడ్ జ్యువెలర్స్ లిస్టింగ్ తొలి రోజు ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. అయితే ఇష్యూ ధర రూ. 100తో పోలిస్తే బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 100 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 105 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి ఇదే స్థాయిలో రూ. 105 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ రూ. 100 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 105 వరకూ ఎగసింది. చివరికి అక్కడే స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 420 కోట్లుగా నమోదైంది.

క్రెడో బ్రాండ్స్.. గుడ్

మఫ్టీ డెనిమ్ బ్రాండ్ కంపెనీ క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ లిస్టింగ్ తొలి రోజు ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. అయితే ఇష్యూ ధర రూ. 280తో పోలిస్తే బీఎస్‌ఈలో స్వల్ప ప్రీమియం (0.7%)తో రూ. 282 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 16% జంప్‌చేసి రూ. 325 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 12% లాభంతో రూ. 313 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ నామమాత్ర లాభంతో రూ. 282 వద్ద లిస్టయ్యింది. ఆపై రూ. 325 వరకూ దూసుకెళ్లింది. చివరికి 11% బలపడి రూ. 311 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 2,009 కోట్లుగా నమోదైంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

స్టడీ అబ్రాడ్: విదేశీ విద్యకు.. స్కాలర్‌షిప్స్ ఊతం

ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్న ఉపకార వేతనాలు » అకడమిక్ రికార్డ్, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్స్

విదేశీ యూనివర్సిటీల్లో చదువుకోవాలని కోరుకుంటున్న విద్యార్థులకు అక్కడి భారీ ఫీజులు, వ్యయాలు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి.దీంతో ఎంతోమంది అవకాశాలు వచ్చినా వదులుకుంటున్న పరిస్థితి. ఇలాంటి విద్యార్థులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి.. స్కాలర్‌షిప్స్! అకడమిక్‌గా అద్భుత ప్రతిభతోపాటు టాప్ యూనివర్సిటీలో ప్రవేశం ఖరారు చేసుకుంటే.. ఉపకార వేతనాలు ఊతంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో..స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న పలు స్కాలర్‌షిప్‌ల వివరాలు..

ఫుల్‌బ్రైట్ మాస్టర్స్ ఫెలోషిప్స్

భారతీయ విద్యార్థులు తొలి గమ్యంగా భావించే అమెరికాలో.. ఎలాంటి కోర్సులో చేరాలనుకున్న వారికైనా.. అందుబాటులో ఉన్న ఉపకార వేతనం.. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్. ఆర్ట్స్, ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టడీస్, హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ఉమెన్స్ స్టడీస్/జండర్ స్టడీస్ తదితర విభాగాల్లో పీజీ, ఆపై స్థాయి కోర్సుల్లో చేరిన వారు ఈ ఫెలోషిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి కోర్సు వ్యవధిలో ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన చార్జీలు, నివాస ఖర్చులు, ట్యూషన్ ఫీజు ఫండింగ్ వంటివి లభిస్తాయి.

» వివరాలకు వెబ్‌సైట్: ww.usief.org.in/Fullbright-Nehru-Fellowships.aspx

క్వాడ్ ఫెలోషిప్ ఫర్ స్టెమ్ కోర్సెస్

క్వాడ్ దేశాల కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన స్కాలర్‌షిప్ ఇది. క్వాడ్ గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికాకు చెందిన వంద మంది విద్యార్థులకు అమెరికాలోని యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో చేరే వారికి ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు. దీనికి ఎంపికైన వారికి రూ.50 వేల డాలర్ల ఏక మొత్తం ఆర్థిక సహాయం అందిస్తారు. నీడ్ బేస్డ్ విధానంలో కోర్సు పూర్తి చేసుకునేందుకు అయ్యే వ్యయంలో భాగంగా మరో 25 వేల డాలర్లు ఇస్తారు. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» వివరాలకు వెబ్‌సైట్: www.quadfellowship.org

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ఫర్ ఎస్సీ క్యాండిడేట్స్

దేశంలో ఎస్సీ కేటగిరీలకు చెందిన అల్పాదాయ వర్గాల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం..నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్. ఎస్సీ/ఎస్టీ, వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, డినోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార జాతులు, సంప్రదాయ కళాకారుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలి. డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విదేశాల్లో పీజీ లేదా పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకుని ఉండాలి. మొత్తం 125 స్కాలర్‌షిప్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీ కులాల వారికి–115, సంచార, పాక్షిక సంచార జాతుల వారికి–06, భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు –04 స్కాలర్‌షిప్స్‌ను కేటాయిస్తారు. పీజీ కోర్సులో చేరితే మూడేళ్ల పాటు, పీహెచ్‌డీ చేస్తే నాలుగేళ్లు స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తారు. ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ అలవెన్స్, అత్యవసర ఖర్చులు, వీసా ఫీజు, ఎక్విప్‌మెంట్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ కింద ఆర్థిక సహకారం అందిస్తారు.

» వెబ్‌సైట్: https://nosmsje.gov.in

ఏడీబీ-జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

జపాన్‌లోని యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న మన దేశ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రముఖ స్కాలర్‌షిప్ పథకం.. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇతర అభివృద్ధి సంబంధిత విభాగాల్లో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇవి లభిస్తాయి.ఎంపికైన వారికి పూర్తి స్థాయి ట్యూషన్ ఫీజు, హౌసింగ్ అలవెన్స్, బుక్స్ అలవెన్స్, ట్రావెల్ ఎక్స్‌పెన్సెస్ అందుతాయి. అభ్యర్థులు తాము ప్రవేశం ఖరారు చేసుకున్న యూనివర్సిటీలో అడ్మిషన్ తేదీ ప్రారంభానికి కనీసం ఆరు నెలల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» వివరాలకు వెబ్‌సైట్: www.adb.org

వాయుసేనలో పైలెట్ కొలువు

రక్షణరంగంలో ఉన్నతమైన కొలువు సొంతం చేసుకోవాలనుకునే వారికి చక్కటి మార్గం.. ఏఎఫ్‌క్యాట్ (ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్). ఏఎఫ్‌క్యాట్ ద్వారా మొత్తం 317 ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో అర్హత సాధించిన వారు ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఉన్నతస్థాయి కొలువులను దక్కించుకోవచ్చు. తాజాగా ఏఎఫ్‌క్యాట్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్‌తో ఉద్యోగాలు, అర్హతలు, పరీక్షా విధానం తదితర వివరాలు..

» 2024 ఏఎఫ్‌క్యాట్ నోటిఫికేషన్ విడుదల
» డిగ్రీ, ఇంజనీరింగ్ అర్హతతో ఉన్నత కొలువులు
» లెవెల్-10 హోదాతో రూ.లక్షకు పైగానే వేతనం

దేశ త్రివిధ దళాల్లో ముఖ్యమైనది వాయుసేన. శత్రుమూకలు మన దేశ గగనతలంలోకి ప్రవేశించకుండా అరికట్టడంలో వైమానిక దళం నిరంతరం పహారాకాస్తుంది. ఇలాంటి కీలకమైన ఎయిర్‌ఫోర్స్‌లో విధుల నిర్వహణ కోసం ఏఎఫ్‌క్యాట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాల కోసం ఏటా రెండుసార్లు ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) పేరుతో నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

విద్యార్హతలు

ఫ్లయింగ్ బ్రాంచ్: ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్/10+2లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండి.. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ(ఏదేని గ్రూప్) ఉత్తీర్ణత సాధించాలి. లేదా కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)


- ఈ విభాగానికి అభ్యర్థులు ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రానిక్స్/మెకానికల్) విభాగాల్లో లేదా అనుబంధ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- 10+2 స్థాయిలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్)

- నాన్ టెక్నికల్‌కు సంబంధించి అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్, అకౌంట్స్ విభాగాలున్నాయి. అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ విభాగాలకు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుండాలి.
- అకౌంట్స్ విభాగానికి సంబంధించి 60 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణులవ్వాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

వయసు

ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వయసు 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ.. టెక్నికల్, నాన్-టెక్నికల్ పోస్టులకు వయసు 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.



ఎంపిక విధానం

ఆయా పోస్టులను అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్, పైలెట్ అప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్, ఫిజికల్ టెస్ట్‌లను నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు, ఉన్నత స్థాయి ఉద్యోగం సొంతమవుతుంది.

పరీక్ష ఇలా

- బ్రాంచ్ ఏదైనా ఏఎఫ్‌క్యాట్ పరీక్షను ఉమ్మడిగానే నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. 300 మార్కులకుగాను 100 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు. పరీక్ష సమయం 2 గంటలు.
- టెక్నికల్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ) నిర్వహిస్తారు. ఇది మొత్తం 50 ప్రశ్నలకుగాను 150 మార్కులకు 45 నిమిషాలపాటు జరుగుతుంది.

ఏఎఫ్ఎస్‌బీ ఇంటర్వ్యూ

రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ (ఏఎఫ్ఎస్‌బీ) ఇంటర్వ్యూలకు పిలుస్తుంది. ఇది రెండు స్టేజ్‌ల్లో(స్టేజ్-1, 2) ఉంటుంది. స్టేజ్-1లో అర్హత సాధించిన వారు స్టేజ్-2కి వెళ్తారు. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ జరుగుతుంది. ఈ దశలన్నీ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. అనంతరం మెరిట్‌ప్రాతిపదికన శిక్షణకు ఎంపిక చేస్తారు.

ఉచిత ట్రైనింగ్

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్‌లకు ఎంపికైన అభ్యర్థులకు 74 వారాల పాటు; గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్‌కు ఎంపికైన వారికి 52 వారాలపాటు ఉచిత ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణలో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ఫైటర్ పైలెట్, ట్రాన్స్‌పోర్ట్ పైలెట్, హెలికాప్టర్ పైలెట్‌గా.. ఆయా విభాగాల్లో ఇంటర్నల్ శిక్షణ ఇస్తారు.

స్టైఫండ్

శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.56,100 స్టైఫండ్‌గా చెల్లిస్తారు. విజయవంతంగా ట్రైనింగ్ పూర్తిచేసుకొని ఉద్యోగంలో చేరిన వారికి రూ.56,100 ప్రారంభ వేతనం లభిస్తుంది. దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్ఏ సహా వివిధ రకాల అలవెన్సులు, సౌకర్యాలు లభిస్తాయి.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 30.12.2023
- పరీక్ష తేదీ: 2024 ఫిబ్రవరి 16,17,18 తేదీల్లో
- వెబ్‌సైట్: https://afcat.cdac.in

ప్రిపరేషన్ పక్కాగా

- ఏఎఫ్‌క్యాట్ పరీక్షలో.. జనరల్ అవేర్‌నెస్,ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ,మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- ఈకేటీ పరీక్షలో మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ నుంచి ప్రశ్నలను అడుగుతారు.
- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగానికి సంబంధించి హిస్టరీ,సివిక్స్,పాలిటీ, కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంట్, కల్చర్, డిఫెన్స్, క్రీడలు తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **వెర్బల్ ఎబిలిటీ:** ఈ విభాగానికి సంబంధించి కాంప్రహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్, సెంటన్స్ కంప్లీషన్, సినానిమ్స్, యాంటానిమ్స్, వొకాబ్యులరీ, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** ఈ విభాగంలో ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. మిగిలిన విభాగాల్లోని ప్రశ్నలు మాత్రం డిగ్రీ స్థాయిలో అడుగుతారు. ముఖ్యంగా డెసిమల్ ఫ్రాక్షన్స్, టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, పర్సెంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్, సింపుల్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- **రీజనింగ్ అండ్ మిలటరీ అప్టిట్యూడ్:** వెర్బల్ స్కిల్స్, స్పేషియల్ ఎబిలిటీ(మెంటల్ ఎబిలిటీ) నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ఏఎఫ్‌క్యాట్ పరీక్షకు సన్నద్ధమయ్యే వారు మూడు దశల ఎంపిక ప్రక్రియపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. సిలబస్, ప్రశ్నలు అడిగే విధానం, టెక్నికల్, నాన్‌టెక్నికల్ పరీక్షల్లో వ్యత్యాసం, ఇంటర్వ్యూ వంటి వాటి గురించి తెలుసుకోవాలి.
- స్వీయ ప్రణాళిక, పక్కా వ్యూహంతో ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం సబ్జెక్ట్ వారీగా నిర్దిష్ట టైమ్ టెబుల్‌ను సిద్ధం చేసుకోవాలి. చదవడం పూర్తిచేసిన అంశాలను రివిజన్ చేయాలి.
- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా దినపత్రికలను చదవడం మేలు చేస్తుంది. చదువుతున్నప్పుడే ముఖ్యమైన అంశాలతో నోట్స్ రాసుకోవాలి.
- వీలైనన్నీ ఎక్కువ మాక్ టెస్టులను, ప్రాక్టీస్ టెస్టులను రాయడం మంచిది. దీనివల్ల నిర్ణీత సమయంలో పరీక్షను పూర్తిచేయడం అలవాటవుతుంది. అంతేకాకుండా పరీక్షలో చేస్తున్న పొరపాట్లను గుర్తించి.. అధిగమించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రజాస్వామ్య మనుగడకు ఆర్టీఐ అవసరం

కేంద్ర సమాచార చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమారియా

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య మనుగడకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) చాలా అవసరమని, చట్టం పరిరక్షణ బాధ్యత సమాచార కమిషనర్‌లు, ప్రధాన కమిషనర్‌లపైనే ఎక్కువగా ఉందని కేంద్ర సమాచార చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమారియా అభిప్రాయపడ్డారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలోని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌ను బుధవారం సమారియా సందర్శించారు. ఈ సందర్భంగా వర్చువల్/హైబ్రీడ్ విధానంలో సమాచార కమిషన్‌లు విచారణ నిర్వహించాలని, ఈ ఫైలింగ్ అమలు చేయాలని ఆయన సూచించారు. తద్వారా దూర ప్రాంతాల వారు వ్యయ ప్రయాసలకు లోనవ్వకుండా హైబ్రీడ్ విధానం దోహదపడుతుందన్నారు. రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆర్.మహబూబ్ బాష మట్లాడుతూ.. ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన వర్చువల్/హైబ్రీడ్ విధానంలో విచారణలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. శాశ్వత ప్రాతిపదికన ఈ విధానాన్ని కొనసాగించడానికి ప్రభుత్వ సహకారాన్ని కోరామని తెలిపారు. సమావేశంలో కమిషనర్‌లు, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

14 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన పలువురికి పోస్టింగ్ ఇచ్చి బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన సీహెచ్.కృష్ణమూర్తి, ఎం.వి.రమణను సీసీఎల్ఏ అసిస్టెంట్ కార్యదర్శులుగా, వై.తిరుపతి నాయుడును రెవెన్యూశాఖ అసిస్టెంట్ కార్యదర్శిగా, సి.విశ్వనాథ్‌ను అనంతపురం హెచ్‌పీసీఎల్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా, టి.శ్రీనివాసులును హిందూపురం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా, కె.బాలకృష్ణను అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా, చిలుకోటి లక్ష్మీకుమారిని బాపట్ల కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా, ఎల్.దేవకీదేవిని పౌరసరఫరాలశాఖ ఏలూరు, విజిలెన్స్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. అలాగే ఆర్.అరుణను గుంటూరు జిల్లా మైనార్టీ సంక్షేమ ఆఫీసర్‌గా, మధుసూదనరావును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా, సీహెచ్ విజయజ్యోతి కుమారిని కర్నూలు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా, ఎం.శిరీషను ప్రకాశం పౌరసరఫరాల విజిలెన్స్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా జి.అనిల్‌కుమార్‌ను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీగా, టి.మోహన్‌రావును ఏపీటీపీ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

రాష్ట్రానికి అమృత్ భారత్ రైలు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న నాన్ ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అమృత్ భారత్ రైలు రాష్ట్రం గుండా పరుగులు పెట్టనుంది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు మధ్య అమృత్ భారత్ రైలు ఈ నెల 30న పట్టాలు ఎక్కనుంది. ఈ రైలుకు రాష్ట్రంలో 13 రైల్వే స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ఈ నెల 30న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించనున్న ఈ రైలు జనవరి 1న రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. సామాన్య ప్రయాణికులకు సూపర్ ఫాస్ట్ రైలును అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' రైళ్లకు రూపకల్పన చేసింది.

రాష్ట్రంలో అమృత్ భారత్ రైలు హాల్ట్‌లు: శ్రీకాకుళం రోడ్, విజయనగరం, తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట

శ్రీవేంకటేశ్వర, ద్రవిడియన్ వర్సిటీలకు వీసీల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని శ్రీవేంకటేశ్వర వర్సిటీ వైస్ చాన్సలర్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీకాంత్‌రెడ్డి, ద్రవిడియన్ వర్సిటీ వైస్ చాన్సలర్‌గా కొలకలూరి మధుజ్యోతి నియామకానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు.

• తెలంగాణ

మాజీ ఐఏఎస్ అధికారి ఇంటి కబ్జా కేసులో ఐపీఎస్ ఆఫీసర్

- భన్వర్‌లాల్ ఇంటిపై నవీన్‌కుమార్ కన్ను
- తన సోదరుడైన సాంబశివరావుతో కలిసి కుట్ర
- ప్రస్తుతం పోలీసు అకాడమీలో పనిచేస్తున్న నవీన్
- బాధితుడి భార్య ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు నమోదు
- నవీన్‌కుమార్‌ను పట్టుకున్న పోలీసులు



ఎస్పీ నవీన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటిని నకిలీ పత్రాలతో కబ్జా చేయడానికి యత్నించిన కేసులో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ భట్ నిందితుడిగా ఉన్నారు. భన్వర్‌లాల్ భార్య మణి లాల్ ఫిర్యాదుతో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు నమోదు చేసిన ఈ కేసులో ప్రాథమికంగా నవీన్‌కుమార్‌తోపాటు ఆయన సోదరుడు ఒ.సాంబశివరావు పేర్లు మాత్రమే ఉన్నాయి. దర్యాప్తు నేపథ్యంలో సాంబశివరావు భార్య రూపా డింపుల్ పేరు వెలుగులోకి వచ్చింది. ఓల్డ్ అల్వాల్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్న భన్వర్‌లాల్‌కు జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో సొంత ఇల్లు ఉంది. సాంబశివరావు 2014 అక్టోబర్ 14న భన్వర్‌లాల్‌ను సంప్రదించి, నవంబర్ 1 నుంచి ప్రశాసన్‌నగర్‌లోని ఇంటిని ఐదేళ్లపాటు అద్దెకు తీసుకుంటూ ఒప్పందం చేసుకున్నారు. 2019లో భన్వర్‌లాల్ పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో తమ ఇల్లు ఖాళీ చేయాలని భన్వర్‌లాల్ కోరినప్పటికీ సాంబశివరావు స్పందించలేదు. ఈ క్రమంలో ఆ ఇంట్లో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ కూడా ఎలాంటి రెంటల్ అగ్రిమెంట్ లేకుండా ఉంటున్నట్లు వీళ్లు గుర్తించారు. 2020 జనవరి నుంచి అద్దె చెల్లించడం ఆపేశారు. అయితే 2020 సెప్టెంబర్ 18న సాంబశివరావు రూ.11,10,000కు మూడు పోస్టు డేటెడ్ చెక్‌లు ఇచ్చారు. ఈ చెక్కులను భన్వర్‌లాల్ డిపాజిట్ చేయగా.. అకౌంట్‌లో నగదు లేని కారణంగా బౌన్స్ అయ్యాయి. దీంతో భన్వర్‌లాల్ కోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు దాఖలు చేశారు. అయితే 2020 నవంబర్ 12న భన్వర్‌లాల్‌కు లీగల్ నోటీసు పంపిన సాంబశివరావు అందులో తప్పుడు ఆరోపణలు చేయడంతోపాటు తమకు రూ.49.3 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపైనా భన్వర్‌లాల్ సివిల్ కేసు ఫైల్ చేశారు. అయితే సాంబశివరావు, నవీన్‌కుమార్ ఇద్దరూ ఆ ఇంటిని కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ ఇంటి లీజును మరో 20 ఏళ్లకు పెంచినట్లు, హ్యాండ్ లోన్‌గా భారీ మొత్తం తీసుకున్నట్లు పత్రాలను తయారు చేశారు. ఇలా ఆ ఇంటిపై సివిల్ వివాదం సృష్టించి కబ్జా చేయాలని యత్నించారు.

రూ.42 లక్షల అద్దె నష్టం

ఈ పరిణామాలతో భన్వర్‌లాల్ రూ.42 లక్షల అద్దె నష్టపోవడంతోపాటు తీవ్ర మానసిక వేదనకు గురై అనారోగ్యం పాలయ్యారు. సుదీర్ఘకాలం ఐఏఎస్‌గా ప్రజలకు సేవ చేసి, సొంత ఇల్లు ఉండి కూడా అద్దె ఇంట్లో ఉండాల్సిన స్థితికి చేరారు. దీనిపై ఆయన భార్య మణి లాల్ ఈ ఏడాది నవంబర్ 17న పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు ఫోర్జరీ పత్రాలను సృష్టించడంలో అడ్వొకేట్ అయిన సాంబశివరావు భార్య రూపా డింపుల్ పాత్ర ఉన్నట్లు గుర్తించారు. వారిద్దర్నీ ఈ నెల 22న అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నవీన్‌కుమార్‌ను బుధవారం పట్టుకుని, సీసీఎస్‌కు తరలించారు. 41ఎ నోటీసులు జారీ చేశారు. నవీన్‌కుమార్ గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎస్పీగా పని చేశారు. అప్పట్లో ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో తూర్పుగోదావరి ఏఎస్పీగా పని చేస్తూ ఎస్పీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో సస్పెండ్ కూడా అయ్యారు. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.